

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 29-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 284 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య రా. 6.06 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 8.20 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ. 12.09-1.40; దుర్ముహూర్తం: మ. 12.05-12.50; అమృతఘడియలు: రా. 9.19-10.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.05 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



PADMABHUSHAN

నందమూరి బాలకృష్ణ

క్రమశిక్షణ, కష్టపడే తత్వం ఉన్న మాస్ హీరో. అన్నివేళలా ప్రజలకు అండగా నిలిచే నిబద్ధతగల నాయకుడు. క్యాన్సర్ పేషంట్లను, పేదలను ఆదుకునే ఆప్తుడు. ఒక కొడుకుగా, ఒక భర్తగా, ఒక తండ్రిగా, ఒక సోదరుడిగా, ఒక తాతగా తన బాధ్యతలను ఏనాడూ మరువని వ్యక్తి.

మీకు భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారం వచ్చినందుకు మేమందరం ఎంతో గర్విస్తున్నాం. మీ చుట్టూ ఉండే అందరి జీవితాలకు వెలుగును పంచుతూ... మీరు ఎల్లప్పుడూ ఇలాగే చిరునవ్వులు చిందిస్తూ ఉండాలి.

జై బాలయ్య!

నందమూరి మరియు నారా కుటుంబసభ్యులు

శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శ్రీమతి భువనేశ్వరి | శ్రీ నారా లోకేష్, శ్రీమతి బ్రాహ్మణి, దేవాన్ష్ | శ్రీమతి నందమూరి వసుంధరా దేవి
శ్రీ నందమూరి మోక్షజ్ఞ తారక రామ తేజ | శ్రీ మతుకుమిల్లి శ్రీభరత్, శ్రీమతి తేజస్విని, ఆర్యవీర్ | శ్రీ నందమూరి జయకృష్ణ, శ్రీమతి పద్మజ
కీ.శే. నందమూరి సాయికృష్ణ, శ్రీమతి మాధవి మణి | కీ.శే. నందమూరి హరికృష్ణ, శ్రీమతి లక్ష్మి | శ్రీ నందమూరి మోహనకృష్ణ, శ్రీమతి శాంతి
శ్రీ నందమూరి రామకృష్ణ, శ్రీమతి జయశ్రీ | శ్రీ నందమూరి జయశంకర్ కృష్ణ, శ్రీమతి శ్రీదేవి | శ్రీమతి గారపాటి లోకేశ్వరి, శ్రీ జ్ఞానేశ్వర రావు
శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, శ్రీ వెంకటేశ్వర రావు | కీ.శే. ఉమా మహేశ్వరి, శ్రీ కంఠమనేని శ్రీనివాస్ ప్రసాద్

త్రిష కొత్త చరిత్ర

త్రి'షో'

తెలుగమ్మాయి రికార్డు శతకం

- యువ భారత్ ఘన విజయం
- 150 పరుగులతో స్కాట్లాండ్ చిత్తు
- సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ
- అండర్-19 టీ20 వరల్డ్‌కప్



గొంగడి త్రిష (110 నాటౌట్, 3/6)

కౌలాలంపూర్: తెలుగమ్మాయి గొంగడి త్రిష (59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110 నాటౌట్, 3/6) సెంచరీ విజృంభణతో పాటు బౌలింగ్‌లోనూ సత్తా చాటడంతో.. అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ సిక్స్‌ను భారత జట్టు ఘన విజయంతో ముగించింది. ఈపాటికే సెమీస్ చేరిన డిఫెండింగ్ చాంప్ భారత్.. గ్రూప్-1లో మంగళవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో 150 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. తద్వారా టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. పిప్పా కెల్లీ (12), ఎల్మా (12) టాప్ స్కోరర్లు. ఆయుషి శుక్లా 4.. త్రిష, వైష్ణవి శర్మ చెరో 3 వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. శుక్రవారం జరిగే తొలి సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

బాదుడే.. బాదుడు: భద్రాద్రి కొత్తగూడెం అమ్మాయి త్రిష ఆరంభం నుంచే ఎడాపెడా షాట్లతో స్కాట్లాండ్ బౌలర్లను ఓ ఆటాడుకొంది. మరో ఓపెనర్ కమిలిని (51) కూడా త్రిషకు చక్కని సహకారం అందించడంతో స్కోరు బోర్డు కళ్లెంలేని గుర్రంలా పరుగెత్తింది. నాలుగో ఓవర్‌లో మూడు బౌండ్రీలు బాదిన త్రిష.. మ్యాచ్ ఆసాంతం అదే జోరును కొనసాగించింది. మరో ఎండ్‌లో ఉన్న కమిలిని కూడా ఎక్కువగా ఫోర్లతోనే స్కోరు బోర్డు నడిపింది. ఏడో ఓవర్‌లో మెక్‌కోల్ బౌలింగ్‌లో త్రిష ఏకంగా సిక్స్‌తో ఔరా అనిపించింది. టాప్ గేర్‌లో సాగిన త్రిష .. మరో మూడు బౌండ్రీలతో అర్ధ శతకం పూర్తి చేసుకొంది. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి భారత్ 104/0తో భారీ స్కోరు దిశగా సాగింది. పార్కర్ వేసిన 13వ ఓవర్‌లో త్రిష ఏకంగా మూడు సిక్స్‌లు బాదడం మ్యాచ్‌కే హైలైట్. ఇక, బౌండ్రీతో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కమిలిని ఆ తర్వాతి బంతికే అవుటైంది. దీంతో తొలి వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సనిక చల్కే (29 నాటౌట్) కూడా త్రిషకు అండగా నిలిచింది. 18వ ఓవర్‌లో త్రిష శతకం పూర్తి చేసుకోగా.. చల్కే బౌండ్రీలతో టీమ్ స్కోరును 200 మార్క్ దాటించింది.

నెంబర్‌వన్‌గా..

ఈ ప్రపంచకప్‌లో సూపర్‌ఫామ్‌తో దూసుకెళ్తున్న 19 ఏళ్ల గొంగడి త్రిష మరోమారు సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. 53 బంతుల్లోనే శతకం అందుకున్న త్రిష.. టోర్నీ చరిత్రలోనే సెంచరీ నమోదు చేసిన తొలి క్రికెటర్‌గా అరుదైన చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో ఓవరాల్‌గా ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఇంగ్లండ్ బ్యాటర్ గ్రేస్ స్క్రివెన్స్ (93) రికార్డును త్రిష అధిగమించింది. అంతేకాదు.. ప్రస్తుత టోర్నీలో 230 రన్స్‌తో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా టాప్‌లో కొనసాగుతోంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 208/1 (త్రిష 110 నాటౌట్, కమిలిని 51; మెక్రైరా 1/25).

స్కాట్లాండ్: 14 ఓవర్లలో 58 (కెల్లీ 12, ఎమ్మా 12; ఆయుషి 4/8, త్రిష 3/6).

సురేఖను ఖేల్‌రత్నకు పరిగణించండి

- కేంద్ర క్రీడా శాఖను ఆదేశించిన ఏపీ హైకోర్టు
- 2023 లేదా 2024 జాబితాలో ఆమె పేరు చేర్చాలని సూచన



అమరావతి (ఆంధ్రజ్యోతి): దేశ అత్యుత్తమ క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు విజయవాడ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఖేల్‌రత్న అందుకునేందుకు తనకు అన్ని అర్హతలున్నా అవార్డుకు ఎంపికచేయలేదంటూ 2023లో సురేఖ హైకోర్టులో పిటిషన్ వేసింది. సుదీర్ఘ వాదనల అనంతరం దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తుది తీర్పును వెలువరించారు. తీర్పు ప్రతి మంగళవారం అందుబాటులోకి వచ్చింది. 2023, 2024 సంవత్సరాలకు ఖేల్‌రత్న అవార్డుకు ఇప్పటికే ఎంపికైన క్రీడాకారులతో పాటు జ్యోతి సురేఖ పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. 2023లో జరిగిన అవార్డుల ఎంపికను ఈ దశలో రద్దు చేయడం సరికాదు కనుక మరోసారి దరఖాస్తు సమర్పించాలని సురేఖను కోరకుండా పాత అర్జీనే పరిశీలించి ఆమె పేరును క్రీడా పురస్కారాల జాబితాలో చేర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అవార్డుల పాలసీలో పతకాలకు కేటాయించిన మార్కుల ప్రకారం సురేఖకు 148 పాయింట్లు (80 శాతం అర్హత) ఉండగా, ఆ ఏడాది అవార్డు పొందిన వారికి 58.5 పాయింట్లు (31.46 శాతం అర్హత) మాత్రమే ఉన్నట్టు తమ దృష్టికి రావడంతో సురేఖకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశించింది. పాలసీలోని నిబంధనల ప్రకారం 80 శాతం పతకాల ఆధారంగా, 20 శాతం ఎంపిక కమిటీ విచక్షణాధికారం ప్రకారం మార్కులు ఇచ్చి అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఈ విచక్షణాధికారం దుర్వినియోగం కాకుండా కేంద్ర క్రీడాశాఖ మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో పిటిషనర్ తరఫున న్యాయవాది ఉన్నం మురళీధరరావు, అఖిల్ చౌదరి వాదనలు వినిపించారు.

'అత్యుత్తమ క్రికెటర్' బుమ్రా



దుబాయ్: ప్రతిష్ఠాత్మక ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును జస్‌ప్రీత్ బుమ్రా సొంతం చేసుకొన్నాడు. గతేడాది మూడు ఫార్మాట్లలోనూ 31 ఏళ్ల బుమ్రా ఆకట్టుకొన్నాడు. '2024లో అద్భుత ప్రదర్శనకుగాను పురుషుల విభాగంలో 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' కింద ఇచ్చే సర్ గ్యారీ ఫీల్డ్ సోబర్స్ అవార్డుకు బుమ్రా ఎంపికయ్యాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లోనే కాదు పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ అతడి ప్రదర్శన అమోఘం' అని ఐసీసీ కొనియాడింది. రాహుల్ ద్రవిడ్ (2004), సచిన్ టెండూల్కర్ (2010), అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2017, 2018) తర్వాత ఈ అవార్డును అందుకొన్న ఐదో భారత ఆటగాడిగా బుమ్రా రికార్డులకెక్కాడు. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ నెగ్గడంలోనూ జస్‌ప్రీత్ కీలకపాత్ర పోషించాడు. గతేడాది ఆడిన 13 టెస్టుల్లో 71 వికెట్లు పడగొట్టాడు. తనకు ఇంతటి గౌరవం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఓ వీడియో సందేశంలో బుమ్రా పేర్కొన్నాడు. టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా కూడా బుమ్రా ఎంపికైన సంగతి తెలిసిందే.



'మహిళల క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా కెర్

ఐసీసీ 'ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ ఎంపికైంది. ఇప్పటికే ఆమె మహిళల టీ20ల్లోనూ ఉత్తమ ప్లేయర్ అవార్డు దక్కించుకుంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో కెర్ విశేషంగా రాణించి 387 పరుగులతో పాటు 29 వికెట్లు తీసింది. అలాగే ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఆల్‌రౌండ్ షో (43; 3/24)తో కివీస్‌కు తొలి టైటిల్ దక్కేలా చేయడంతో పాటు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగానూ నిలిచింది.

ఝలకిచ్చారు

మూడో టీ20లో భారత్ ఓటమి

- ఇంగ్లండ్ ఆశలు సజీవం
- వరుణ్‌కు ఐదు వికెట్లు



డకెట్ (28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 51)

రాజ్‌కోట్: ఐదు టీ20ల సిరీస్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియాకు బ్రేక్ పడింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/24) బౌలింగ్‌లో వణికించినా.. బ్యాటింగ్‌లో వైఫల్యం దెబ్బతీసింది. అటు కచ్చితంగా గెలిచి తీరాల్సిన వేళ ఇంగ్లండ్ అదరగొట్టింది. మంగళవారం జరిగిన మూడో టీ20లో ఒత్తిడిని అధిగమిస్తూ.. బట్లర్ సేన 26 పరుగులతో గెలిచింది. సిరీస్‌ఎలో 2-1తో నిలిచింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. డకెట్ (28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 51), లివింగ్‌స్టోన్ (24 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 43), బట్లర్ (24) రాణించారు. హార్దిక్‌కు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులు చేసింది. హార్దిక్ (40), అభిషేక్ (24) ఫర్వాలేదనిపించారు. ఒవర్టన్‌కు మూడు.. కార్స్, ఆర్చర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డకెట్ నిలిచాడు. అర్ష్‌దీప్‌నకు విశ్రాంతినిచ్చి ఈ మ్యాచ్‌లో పేసర్ షమిని బరిలోకి దింపారు. మూడో టీ20 పుణెలో 31న జరుగుతుంది.

బ్యాటర్ల ఇబ్బంది: ఓ మాదిరి ఛేదనే అయినా సిరీస్‌లో తొలిసారి భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. హార్దిక్ పాండ్యా ఆదుకునే ప్రయత్నం చేసినా అతడి ఇన్నింగ్స్‌లో వేగం లోపించింది. శాంసన్ (3) మరోసారి షార్ట్ పిచ్ బంతికి వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ అభిషేక్, సూర్య (14) ఉన్న కాసేపు వేగం కనబర్చారు. కానీ ఈ ముగ్గురు కూడా పవర్‌ప్లేలోనే వెనుదిరగడం ఛేదనపై ప్రభావం పడింది. భీకరఫామ్‌లో ఉన్న తిలక్ (18) నాలుగు మ్యాచ్‌ల అనంతరం అవుటయ్యాడు. స్పిన్నర్ రషీద్ 8వ ఓవర్‌లో తిలక్‌ను బౌల్డ్ చేశాడు. సుందర్ (6) కూడా విఫలమవగా హార్దిక్‌పై భారం పడింది. వరుసగా రెండు ఓవర్లలో అతడి అవుట్ కోసం రివ్యూకు వెళ్లిన ఇంగ్లండ్ విఫలమైంది. ఆరో వికెట్‌కు అక్షర్ (15)తో కలిసి హార్దిక్ 38 రన్స్ జోడించాడు. 12 బంతుల్లో 41 రన్స్ అవసరమవగా, హార్దిక్ లాంగాఫ్‌లో క్యాచ్ ఇవ్వడంతో భారత్‌కు ఆశలు లేకుండా పోయాయి.

ఆదుకున్న డకెట్, లివింగ్‌స్టోన్: వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఇంగ్లండ్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలో ఓపెనర్ డకెట్, చివర్లో లివింగ్‌స్టోన్ మెరుపు బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. మరోవైపు వరుణ్ చక్రవర్తి మ్యాజిక్ బంతులకు సగం మంది బ్యాటర్లు వికెట్లను సమర్పించుకున్నారు. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ సాల్ట్ (5) వికెట్‌ను హార్దిక్ తీశాడు. ఈ దశలో బట్లర్ సాయంతో డకెట్ చెలరేగాడు. షమి ఓవర్‌లో సిక్సర్ బాదిన అతను హార్దిక్ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. అలాగే ఐదో ఓవర్‌లో 4,4,6తో 15 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 52/1 స్కోరుతో నిలిచింది. అటు బట్లర్ ఏడో ఓవర్‌లో 4,6 బాదడంతో 200 స్కోరు ఖాయమనిపించినా, మధ్య ఓవర్లలో వరుణ్ రాకతో సీన్ మారిపోయింది. ముందుగా బట్లర్ వికెట్‌తో వరుణ్ షాకిచ్చాడు. అటు 26 బంతుల్లోనే డకెట్ హాఫ్ సెంచరీ పూర్తి చేసినా.. అక్షర్‌కు చిక్కాడు. 14వ ఓవర్‌లో స్మిత్ (6), ఒవర్టన్ (0)లను వరుస బంతుల్లో వరుణ్ పెవిలియన్‌కు చేర్చాడు. తన తర్వాతి ఓవర్‌లోనే కార్స్ (3), ఆర్చర్ (0)లను అవుట్ చేసి ఐదు వికెట్లను పూర్తి చేశాడు. 16 ఓవర్లలో 127/8 స్కోరుతో కష్టాల్లో ఉన్న జట్టును లివింగ్‌స్టోన్ ఆదుకున్నాడు. 17వ ఓవర్‌లో 3 సిక్సర్లతో 19 రన్స్ రాబట్టాడు. ఈ దశలో లివింగ్‌స్టోన్‌ను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ చివరి రెండు ఓవర్లలో 20 రన్స్ రాబట్టడంతో ఇంగ్లండ్ స్కోరు 170 దాటగలిగింది.



1

తమ జట్టు ఓడిన రెండు సందర్భాల్లోనూ ఐదు వికెట్లు తీసిన తొలి టీ20 బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 5; డకెట్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 51; బట్లర్ (సి) శాంసన్ (బి) వరుణ్ 24; బ్రూక్ (బి) బిష్ణోయ్ 8; లివింగ్‌స్టోన్ (సి) జురెల్ (బి) హార్దిక్ 43; స్మిత్ (సి) జురెల్ (బి) వరుణ్ 6; ఒవర్టన్ (బి) వరుణ్ 0; కార్స్ (సి) తిలక్ (బి) వరుణ్ 3; ఆర్చర్ (బి) వరుణ్ 0; రషీద్ (నాటౌట్) 10; ఉడ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు: **11; మొత్తం: 20 ఓవర్లలో 171/9; వికెట్ల పతనం:** 1-7, 2-83, 3-87, 4-108, 5-115, 6-115, 7-127, 8-127, 9-147; **బౌలింగ్:** షమి 3-0-25-0; హార్దిక్ 4-0-33-2; సుందర్ 1-0-15-0; వరుణ్ 4-0-24-5; బిష్ణోయ్ 4-0-46-1; అక్షర్ 3-0-19-1; అభిషేక్ 1-0-4-0.

భారత్: శాంసన్ (సి) రషీద్ (బి) ఆర్చర్ 3; అభిషేక్ (సి) ఆర్చర్ (బి) కార్స్ 24; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) ఉడ్ 14; తిలక్ (బి) రషీద్ 18; హార్దిక్ (సి) బట్లర్ (బి) ఒవర్టన్ 40; సుందర్ (సి) బట్లర్ (బి) ఒవర్టన్ 6; అక్షర్ (సి) రషీద్ (బి) ఆర్చర్ 15; జురెల్ (సి) సాల్ట్ (బి) కార్స్ 2; షమి (సి) బ్రూక్ (బి) ఒవర్టన్ 7; బిష్ణోయ్ (నాటౌట్) 4; వరుణ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 145/9. వికెట్ల పతనం:** 1-16, 2-31, 3-48, 4-68, 5-85, 6-123, 7-131, 8-140, 9-140. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-33-2; ఉడ్ 3-0-29-1; కార్స్ 4-0-28-2; లివింగ్‌స్టోన్ 1-0-11-0; రషీద్ 4-0-15-1; ఒవర్టన్ 4-0-24-3.

విమర్శలను తట్టుకోలేకే
గవాస్కర్‌పై రోహిత్ ఫిర్యాదు?





న్యూఢిల్లీ: ఇటీవలే ముగిసిన ఆస్ట్రేలియా టూర్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్సీలోనూ విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో సిరీస్‌లో రోహిత్ వ్యూహాలు, మైదానంలో అతడి తీరును మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తూర్పారబట్టాడు. వ్యక్తిగత కారణాలతో పెర్త్‌లో తొలి టెస్ట్‌కు దూరమైన హిట్‌మ్యాన్.. సిడ్నీ మ్యాచ్‌లో ఆడలేదు. దీంతో జట్టు పగ్గాలను మరొకరికి అప్పగించాలని రోహిత్‌కు సన్నీ సూచించాడు. ఇలా తనను కించపరిచేలా విమర్శించడాన్ని జీర్ణించుకోలేక పోతున్న రోహిత్.. సన్నీపై చర్యలు తీసుకోవాలని బీసీసీఐకి ఫిర్యాదు చేసినట్టు ఓ అధికారి తెలిపాడు. 'గవాస్కర్ తనను అంతగా విమర్శించాల్సిన అవసరంలేదని రోహిత్ భావిస్తున్నాడు. ఇలాంటి వారి వ్యాఖ్యల కారణంగా తనపై ఒత్తిడి మరింతగా పెరిగిందని హిట్‌మ్యాన్ బోర్డుకు వివరణ ఇచ్చాడ'ని ఆ అధికారి చెప్పాడు. బీసీసీఐ కఠినంగా హెచ్చరించడంతో ఆసీస్ టూర్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత రోహిత్, జైస్వాల్, పంత్, గిల్ రంజీ మ్యాచ్ ఆడారు. కోహ్లీ, రాహుల్ మాత్రం వైద్య కారణాలతో విశ్రాంతి తీసుకొన్నారు. అయితే, ఆడిన ఆ ఒక్క రంజీ మ్యాచ్‌లో కూడా రోహిత్, జైస్వాల్ విఫలమయ్యారు. 'వారు మనసు పెట్టి ఆడలేదనిపిస్తోంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కాపాడుకోవడానికే రోహిత్, జైస్వాల్ తదితర టీమిండియా క్రికెటర్లు దేశవాళీ మ్యాచ్‌ల్లో ఆడారా?' అని సన్నీ అనుమానం వ్యక్తం చేశాడు. కోహ్లీ, రాహుల్ తనకు గాయాలైనట్టు చెప్పడంపైనా సందేహం వ్యక్తం చేశాడు. గాయపడితే వారు ఎన్‌సీఏకు ఎందుకు రిపోర్ట్ చేయలేదని ప్రశ్నించాడు. రంజీ చివరి లీగ్ మ్యాచ్‌లకు దూరమవుతామని ప్రకటించిన ఆటగాళ్లపై బోర్డు ఏవైనా చర్యలు తీసుకొంటుందా? అని అడిగాడు.

అర్జున్‌కు మరో డ్రా

వికాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి మరో గేమ్‌ను డ్రా చేసుకోగా.. పెంటేల హరికృష్ణకు ఓటమి ఎదురైంది. మంగళవారం వి ఇ (చైనా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌లో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. కాగా, వ్లాదిమిర్ ఫెడోసివ్ (స్లొవేనియా) చేతిలో హరి పరాజయం పాలయ్యాడు. కాగా, సహచరుల మధ్య జరిగిన గేమ్‌లో లియోన్ లూక్ మెండోన్కాపై వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు విజయం సాధించాడు. చాలెంజర్స్ విభాగంలో దివ్య దేశ్‌ముఖ్, వైశాలి రమేష్ బాబు మధ్య జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్ డ్రాగా ముగిసింది.



దేశాభివృద్ధిలో క్రీడలది కీలక పాత్ర

- 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నం
- ప్రధాని నరేంద్ర మోదీ
- ఘనంగా జాతీయ క్రీడల ప్రారంభోత్సవం



డెహ్రాడూన్: కిక్కిరిసిన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వేలాది మంది క్రీడాకారుల హర్షధ్వానాల మధ్య 38వ జాతీయ క్రీడలను ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఉత్తరాఖండ్ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాలు, లేజర్ షో అలరించాయి. మంగళవారం అంగరంగ వైభవంగా జరిగిన ఈ క్రీడల ఆరంభ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగమ్మ ఆశీస్సులతో ఇక్కడి జాతీయ క్రీడలు జరుగుతున్నాయని అన్నారు. 'గ్రీన్ థీమ్'తో నిర్వహిస్తున్న ఈ జాతీయ క్రీడల్లో క్రీడాకారులకు ఇచ్చే పతకాలను సైతం ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాలతో రూపొందించడాన్ని ప్రధాని అభినందించారు. దేశాభివృద్ధిలో క్రీడారంగానిది కీలక పాత్రని, 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వరల్డ్ చెస్ చాంపియన్ గుకేష్, ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్ హంపి, ఖోఖో వరల్డ్‌కప్‌లు సాధించిన భారత జట్లను అభినందించారు. అంతకుముందు వివిధ రాష్ట్రాల జట్లు తమ క్రీడాకారుల బృందాలతో మార్చ్ ఫాస్ట్‌ను నిర్వహించాయి. ఆంధ్రప్రదేశ్ తరఫున ఉమామహేష్, తెలంగాణ తరఫున చికితరావు రాష్ట్ర ఒలింపిక్ సంఘాల జెండాలను చేతబూని తమ క్రీడా బృందాలను ముందుకు నడిపించారు.

రేషన్ బియ్యం మాయంలో
లబ్ధిదారు పేర్ని నానియే!

- అందుకు ప్రాథమిక ఆధారాలున్నాయ్: ఏజీ
- గోడౌన్ మేనేజర్ ఖాతా నుంచి నానికి సొమ్ము బదిలీ అయింది
- వాస్తవాల వెలికితీతకు కస్టడీ విచారణ అవసరం
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి
- హైకోర్టుకు అడ్వకేట్ జనరల్ నివేదన
- ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వు
- తొందరపాటు చర్యలొద్దన్న ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గోడౌను నుంచి రేషన్ బియ్యం మాయం చేయడంలో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కీలక పాత్ర పోషించారని, అంతిమ లబ్ధిదారు ఆయనేనని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. బియ్యం విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్మును గోడౌన్ మేనేజర్, ఈ కేసులో రెండో నిందితుడైన మానసతేజ బ్యాంకు ఖాతా నుంచి పేర్ని నాని ఖాతాకు డబ్బులు బదిలీ అయ్యాయని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. గోడౌన్ నుంచి రేషన్ బియ్యం తరలింపులో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని.. గోడౌన్ ఆయన సతీమణి పేరుమీద ఉన్నప్పటికీ.. అక్కడి కార్యకలాపాలన్నీ ఆయనే పర్యవేక్షించేవారని ఏజీ తెలిపారు. ఇందుకు సంబంధించి మేనేజర్ మానసతేజ వాంగ్మూలం ఇచ్చారని వెల్లడించారు. మానసతేజ పిటిషనర్ సతీమణి వద్ద ఉద్యోగం చేస్తున్నారని, జీతం రూపేణా ఆయన అకౌంట్‌కు డబ్బులు వెళ్లాలని.. కానీ ఈ కేసులో ఉద్యోగి ఖాతా నుంచే యజమాని కుటుంబ సభ్యుల ఖాతాకు సొమ్ము చేరిందని వివరించారు. లావాదేవీలపై వాస్తవాల వెలికితీతకు పేర్ని నానిని కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించారు. ఈ మేరకు మంగళవారం ఆదేశాలిచ్చారు. పేర్ని నాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాల శాఖకు లీజుకిచ్చారు. ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయమయ్యాయని పేర్కొంటూ పౌరసరఫరాల అధికారి చింతం కోటిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం పేర్ని నానిని కూడా నిందితుడి(ఏ-6)గా చేర్చారు.



ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. నాని తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. గోడౌన్‌లో జరిగే కార్యకలాపాలతో పిటిషనర్‌కు సంబంధం లేదన్నారు. రేషన్ బియ్యం నిల్వకు సంబంధించి ఆయన సతీమణితో పౌరసరఫరాల శాఖ ఒప్పందం చేసుకుందని.. వేయింగ్ బ్రిడ్జిలో తలెత్తిన సాంకేతికలోపం కారణంగా బియ్యం నిల్వలో తేడా వచ్చిందని. అందుకు తగిన మొత్తాన్ని పౌరసరఫరాల శాఖకు పిటిషనర్ సతీమణి చెల్లించారని తెలిపారు. గోడౌన్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న మానసతేజ గతంలో పేర్ని నాని వద్ద పనిచేశారని.. అనంతరం ఆయన సతీమణి వద్ద ఉద్యోగిగా చేరి గోడౌన్ బాధ్యతలు చూస్తున్నారని.. మానసతేజ, నాని మధ్య లావాదేవీలను రేషన్ బియ్యంతో ముడిపెట్టడం సరికాదని పేర్కొన్నారు. కోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిన తర్వాత నాని దర్యాప్తులో జోక్యం చేసుకున్నట్లు గానీ, సాక్షులను బెదిరించినట్లు గానీ ఎలాంటి ఆధారాలూ లేవన్నారు. ఆయన మినహా ఇతర నిందితులందరూ బెయిల్‌పై ఉన్నారని, ఆయకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

ఫైబర్ నెట్‌లో కోటి కనెక్షన్లే లక్ష్యం!

- సంస్థలోని జీఎం, ఏజీఎం స్థాయి అక్రమార్కులపైనా చర్యలు
- 149కే త్రి ఇన్ వన్ సేవలను పునరుద్ధరించాలి
- సమీక్షలో మంత్రి జనార్దన్ రెడ్డి దిశానిర్దేశం

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్లను కోటికి చేర్చాలన్న లక్ష్యంతో పనిచేయాలని సంస్థ సిబ్బందికి మంత్రి బీసీ జనార్దనరెడ్డి కర్తవ్యబోధ చేశారు. విజయవాడలోని ఫైబర్ నెట్ కార్యాలయంలో సంస్థ పనితీరుపై మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సమీక్షలో సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన విభాగం ముఖ్యకార్యదర్శి యువరాజ్, ఫైబర్‌నెట్ ఎమ్‌డీ దినేశ్‌కుమార్, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. 2019 నాటికి 17 లక్షలుగా ఉన్న కనెక్షన్లు.. 2019-24 మధ్య కాలంలో ఐదు లక్షలకు ఎందుకు పడిపోయాయో పునఃసమీక్షించుకుని.. పూర్వవైభవం సాధించేలా అడుగులు వేయాలని ఫైబర్ నెట్ యాజమాన్యానికి సూచించారు. సంస్థపై ఆర్థిక భారంపడేలా వందల సంఖ్యలో ఉద్యోగులను ఇష్టారీతిన గత ప్రభుత్వంలోని ముఖ్యనేతలు నియమించుకున్నారని జనార్దనరెడ్డి మండిపడ్డారు. ఇలాంటివారిని దాదాపు 600 మందిని తొలగించి కొంత మేర ఆర్థిక ఉపశమనం కలిగే చర్యలు తీసుకున్నా.. సంస్థ మనుగడకు ఇదెంతమాత్రమూ చాలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ఫైబర్ నెట్ సంస్థకు బ్రాండ్‌గా మారి గుడ్‌విల్‌ను తీసుకువచ్చిన.. ల్యాండ్ లైన్, టీవీ ప్రసార చానళ్లు.. ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించడం ద్వారా.. కనెక్షన్లను గణనీయంగా పెంచుకోవచ్చన్నారు. గతంలో రూ.149కే త్రి ఇన్ వన్ సేవలను అందించేవారమని గుర్తు చేశారు. వ్యవస్థలన్నింటిని చెరబట్టినట్లే ఫైబర్ నెట్‌ను కూడా తన హయాంలో జగన్ ధ్వంసం చేశారని జనార్దనరెడ్డి ధ్వజమెత్తారు. గ్రామ, వార్డు సచివాలయాలకు.. ప్రభుత్వ శాఖలకు.. రెసిడెన్షియల్ పాఠశాలలకు.. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఇంటర్నెట్ సేవలను ఫైబర్ నెట్ సేవలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ఇప్పటిదాకా విశాఖపట్నం.. తిరుపతికే పరిమితమైన ఫైబర్ నెట్ "నాక్" సేవలు జిల్లాలకు వికేంద్రీకరిద్దామని ఆయన అన్నారు. కొందరు జనరల్ మేనేజర్, ఏజీఎం స్థాయి అధికారులు సంస్థకు నష్టం చేసే విధానాలను అమలు చేశారని.. వారిని కూడా గుర్తించి తొలగించాల్సిన అవసరం ఉందని జనార్దన్ రెడ్డి తెలిపారు.



ఫైబర్ నెట్ సమీక్షలో మంత్రి జనార్దన్ రెడ్డి, ఆ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి

..మరణం తర్వాత

ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు
నాగ్‌పూర్‌లో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య
ఆన్‌లైన్‌లో రాతి కత్తి కొనుగోలు
మణికట్టుపై రెండు క్రాస్ మార్కులు
సహా ఐదు తీవ్రమైన గాట్లు 9
ఆపై గొంతు కోసుకొని బలవన్మరణం
బాలిక తండ్రి ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం 29-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

మీ సమస్యకు మా పరిష్కారం!



అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

ప్రజా సమస్యలపై 'అక్షర' శంఖారావం.. పరిష్కారమే అజెండాగా 'ఆంధ్రజ్యోతి' వినూత్న కార్యక్రమం

- రాష్ట్రవ్యాప్తంగా 24 కేంద్రాల్లో నిర్వహణ
- కాలనీలకు తరలి వచ్చిన నేతలు, అధికారులు
- సమస్యలు వివరించిన స్థానిక ప్రజలు
- వాటి పరిష్కారంపై నిర్దిష్ట హామీలు
- కొన్ని అంశాలపై అప్పటికప్పుడే ఆదేశాలు
- శ్రీకాకుళంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళంలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో ప్రజల సమస్యలు విని స్పందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



కడపలో 'ఆంధ్రజ్యోతి' కార్యక్రమం ముగిసిన వెంటనే ప్రజల డిమాండ్ మేరకు అక్కడ వీధుల్లో అడ్డగోలుగా వేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగింపజేస్తున్న చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'మా అక్షరం... మీ ఆయుధం' అంటూ పదునైన కథనాలతో కలమెత్తుతున్న 'ఆంధ్రజ్యోతి' ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మీ సమస్య... మా ద్వారా పరిష్కారం' అంటూ ప్రజాప్రతినిధులు, కీలక అధికారులకు - ప్రజలకూ మధ్య సంధానకర్తగా నిలిచింది. 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' పేరుతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 24 కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్పొరేటర్, మేయర్ల నుంచి కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేల వరకు... శానిటరీ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వయంగా ఈ చర్చా వేదికకు హాజరయ్యారు. ఇతర కేంద్రాలకు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇతర


మిగతా 11వ పేజీలో...

'నాడు-నేడు'.. ఫలితం మోడు

ఐదో తరగతి చదువుతూ రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన వాళ్లు 2018లో 57.1 శాతం ఉండగా, 2022లో 37.9 శాతం, 2024లో 37.5 శాతానికి తగ్గారు.

జగన్ హయాంలో పాఠశాలల బాగు ఉత్తుత్తే

వైసీపీ పాలనలో విద్యా ప్రమాణాలు హుళక్కే



- అక్షరాలు, అంకెలూ గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు
- పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల హాజరు శాతం
- మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలూ కరువే
- 2018లో మెరుగ్గా ప్రమాణాలు.. 2024 నాటికి క్షీణత
- జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికలో వెల్లడి

ఎనిమిదో తరగతి చదువుతూ రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చినవారు 2018లో 78.6% ఉండగా, 2024లో 53 శాతానికి తగ్గారు.

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో 'నాడు-నేడు' పేరిట ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేశామని, ఇంగ్లిష్ మీడియంతో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి సర్కారీ స్కూళ్లను ఉద్ధరించేశామని చేసిన ఆర్భాటం హుళక్కేనని తేలిపోయింది. రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించినట్టు లెక్కలు చెప్పినా.. ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలను కూడా కల్పించలేదన్న విషయం తేటతెల్లమైంది. విద్యార్థులకు మెరుగైన బోధన అంటూ.. ఐబీ, సీబీఎస్ఈ పాఠ్యాంశాలను ప్రవేశ పెట్టామంటూ చేసిన ప్రకటనల్లోనూ పసలేదని స్పష్టమైంది. గత ఐదేళ్లలో విద్యాప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా మారాయని, విద్యార్థులు కనీసం అంకెలు, అక్షరాలను కూడా గుర్తించ లేనిస్థితికి దిగజారారని జాతీయ సర్వే సంస్థ 'అసర్' కుండబద్దలు కొట్టింది. తాజాగా విడుదల చేసిన అసర్ నివేదికలో జగన్ హయాంలో చేపట్టిన నాడు-నేడు ఫలితం ఒట్టి మోడేనని తేలిపోయింది. అసర్ నివేదికలో 2018, 2022, 2024 సంవత్సరాల్లో విద్యాప్రమాణాలు, పాఠశాలల్లో సౌకర్యాల గురించి వివరణాత్మకంగా పేర్కొంది. 2018లో మెరుగ్గా ఉన్న అనేక ప్రమాణాలు.. 2024నాటికి క్షీణించాయని వివరించింది. ముఖ్యంగా 6-14 ఏళ్ల పిల్లల హాజరు శాతం తగ్గిందని, పాఠశాలల్లో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, తాగునీటి వసతి కూడా లేకుండా పోయాయని వెల్లడించింది.

నివేదికలోని ముఖ్యాంశాలు 9లో..

117 జీవో ఉపసంహరణపై ఆమోదయోగ్య పరిష్కారం 7

- ఉపాధ్యాయులు, సంఘాల అభిప్రాయాలు తీసుకోండి
- అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశం
- బదిలీల చట్టంపైనా అభిప్రాయ సేకరణ చేయాలని నిర్దేశం
- టీచర్లకు ఇకపై ఒకటే యాప్.. ప్రతి శనివారం నో బ్యాగ్ డే



టీడీపీ ఎంపీలతో సమావేశమైన పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు

ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

జూన్‌లోపు నామినేటెడ్, పార్టీ పదవులన్నీ భర్తీ

- పార్టీని నమ్ముకున్నవారినే నేతలు ప్రోత్సహించాలి
- పార్టీ సభ్యత్వం బాగా చేసిన వారికే పదవులు
- పదవి పొందిన వారి పనితీరుపై రెండేళ్ల తర్వాత సమీక్ష
- దాని ఆధారంగా భవిష్యత్ అవకాశాలు: టెలికాన్ఫరెన్స్‌లో సీఎం 12

'బనకచర్ల' సాధనే లక్ష్యం!

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం దక్కేలా చూడండి
- టీడీపీ ఎంపీలకు చంద్రబాబు సూచన

ఈఏపీల రుణానికి కసరత్తు

రాష్ట్రంలో రూ.27,259 కోట్లతో 11 ప్రాజెక్టులు.. సీఎం కీలక సమీక్ష 10

ఇది పనికిమాలిన వ్యాజ్యం!

మరొక్క మాట మాట్లాడినా జరిమానా విధిస్తాం



- చంద్రబాబుపై సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం
- సీనియర్లు ఇలాంటి వ్యాజ్యాలూ చేపడతారా?
- పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది మణీందర్‌సింగ్‌పై న్యాయమూర్తి అసహనం
- పిటిషన్‌ను డిస్మిస్ చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో నాటి విపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన కేసులను సీబీఐకి బదిలీ చేయాలంటూ పిటిషన్ వేయడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదో పనికిమాలిన వ్యాజ్యమని స్పష్టంచేసింది. దీనిపై మరొక్కమాట మాట్లాడితే జరిమానా విధిస్తామని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాదిని హెచ్చరించింది. చంద్రబాబుపై నమోదైన సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలని న్యాయవాది బాలయ్య గత నెల 20వ తేదీన నేరుగా సుప్రీంకోర్టులో

మిగతా 12వ పేజీలో...



తెలుగమ్మాయి తడాఖా

- అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో స్కాట్లాండ్‌పై సెంచరీ కొట్టిన త్రిష
- ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా భద్రాచలం యువతి రికార్డు 11
- బౌలింగ్‌లోనూ 3 వికెట్లతో సత్తా

ఏపీ 'పవర్'



- పునరుత్పాదక ఇంధన పెట్టుబడుల్లో రాష్ట్రం దూకుడు
- ఇంధన ప్లాంట్ల ఏర్పాటు, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఒప్పందాలు
- ఇప్పటివరకు రూ.4.83 లక్షల కోట్ల పెట్టుబడులకు ఓకే
- 5.91 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వచ్చే అవకాశం
- కర్నూలు జిల్లాలో ఎకోరాన్ పవన విద్యుత్ ప్లాంటు
- కాకినాడలో గ్రీన్ అమోనియా రూ.12 వేల కోట్ల పెట్టుబడి
- లక్ష కోట్లతో విశాఖ జిల్లాలో ఎన్‌టీపీసీ, ఏపీఎన్‌ఆర్ఈడీసీ
- మరిన్ని ప్రతిపాదనలూ సిద్ధం
- సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థకు దరఖాస్తుల వెల్లువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రకృతికి నష్టం వాటిల్లని పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రపంచమంతా దృష్టిసారిస్తోంది. ప్రకృతే ముడిసరుకైన ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తూ మన రాష్ట్రం దూసుకెళుతోంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సులభతర వాణిజ్యం స్థానంలో వేగవంతమైన వ్యాపార విధానం అమలులోకి రావడం.. ప్రోత్సాహకాలు ఇవ్వడంతో

మిగతా 12వ పేజీలో...

వేగంగా రిఫైనరీ పనులు 7

మార్చి-ఆగస్టు మధ్య పర్యావరణ అనుమతుల సర్వే.. డిసెంబరులో శంకుస్థాపనకు కార్యాచరణ.. సీఎంకు బీపీసీఎల్ ప్రతినిధుల వెల్లడి

డబ్బుంటే చేదా!



- ఏకంగా రూ.7,733 కోట్ల వ్యాట్ బకాయి
- ఏడేళ్లుగా వాణిజ్య పన్నుల శాఖ తాత్సారం
- అందులో కొంత వసూలు చేసినా.. రాష్ట్ర సంక్షేమానికి, అభివృద్ధికి ఆసరా
- జీఎస్టీకి మారినప్పటి వ్యాట్, సీఎస్టీ బకాయిలివీ
- దేశంలోని మిగిలిన రాష్ట్రాలన్నీ ఓటీఎస్ బాట
- కానీ, ఏపీలో ఆ ఊసే లేదు
- 20% వసూలుచేసినా 1,546 కోట్లు ఖజానాకు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వందలు కాదు వేలూ కాదు... రూ.7,733 కోట్ల బకాయిలు ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారంగా పరిణమిస్తున్నాయి. దేశమంతా వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్(వ్యాట్) నుంచి గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్‌కు (జీఎస్టీ) మారిన సమయంలో ఏపీలో వ్యాట్, సెంట్రల్ సేల్స్ ట్యాక్స్(సీఎస్టీ) తదితర పన్నుల బకాయిలు సుమారు రూ.10 వేల కోట్లు పైచిలుకు ఉండేవి. అందులో నుంచి సుమారు రూ.3 వేల కోట్ల వరకు వసూలు చేసినా ఇంకా సుమారు రూ.7,733 కోట్ల బకాయిలు అలాగే ఉండిపోయాయి. దేశంలోని మిగిలిన రాష్ట్రాలు ఈ బకాయిల భారాన్ని తగ్గించుకుని ఎంతో కొంత ఆదాయాన్ని

మిగతా 12వ పేజీలో...

భారత్‌పై సుంకాలు విధిస్తాం!



- చైనా సహా ఇతర దేశాలపై కూడా
- ఆయా దేశాలతో అగ్రరాజ్యానికి నష్టం
- అమెరికన్లకు ఆదాయ పన్ను రద్దు! 9
- రిపబ్లికన్ సదస్సులో అధ్యక్షుడు ట్రంప్
- ఆర్మీలో ట్రాన్స్‌జెండర్ల నియామకాలు రద్దు
- వైట్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ

కదిలిన కారుణ్య నియామకాల ఫైల్ 12

- పీఆర్‌లో ఖాళీల భర్తీకి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ
- 1488 పోస్టుల భర్తీకి ఆదేశాలు.. పాత ఫైల్ బూజుదులిపి ఫైనాన్స్‌కు
- సీఎం ఆమోదమే తరువాయి.. బాధిత కుటుంబాలకు ఊరట

ఎస్తేర్ అనూహ్య అత్యాచారం, హత్య కేసులో చంద్రభాన్ సనప్ నిర్దోషి

- ఏపీ యువతి హత్య కేసులో సుప్రీం కోర్టు సంచలన తీర్పు
- ఉరిశిక్ష పడిన నిందితుడిని విడుదల చేయాలని ఆదేశం
- నేర నిరూపణలో ప్రాసిక్యూషన్ విఫలమైందని వ్యాఖ్య 9

అంతా ఉచితమంటే పాలన ఎలా?



- కావేరీ నీటిని ఉచితంగా ఇవ్వలేం
- జలమండలికి రుణాలు రావడం లేదు
- ఇప్పటికే ఏటా వెయ్యికోట్ల నష్టం వస్తోంది
- నీటి చార్జీలు పెంచడం అనివార్యం
- కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ 9

డీజీపీగా మళ్లీ హరీశ్ కుమార్ గుప్తా!



- రేపటిలోగా అధికారిక ఉత్తర్వులొచ్చే అవకాశం?
- రెండ్రోజుల్లో తిరుమలరావు పదవీ విరమణ 10

మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆక్రమణలపై హైడ్రా కొరడా



- హైదరాబాద్‌లోని అమీన్‌పూర్ పెద్దచెరువు భూమిలో నిర్మాణాల కూల్చివేత 9
- గతంలో కూల్చివేసిన చోటే మళ్లీ కబ్జాదారుల నిర్మాణాలు
- స్థానికుల ఫిర్యాదుతో కూల్చివేసిన హైడ్రా అధికారులు

ఏబీవీ సస్పెన్షన్ కాలం క్రమబద్ధీకరణ



- వేతన, అలవెన్సుల బకాయిలు చెల్లింపునకు ఆదేశాలు
- వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపుల నుంచి ఉపశమనం
- క్యాట్, కోర్టు తీర్పులిచ్చినా నాడు వేధింపులు
- అవినీతిపై ఆధారాల్లేకపోయినా 2సార్లు సస్పెన్షన్
- అలుపెరగకుండా న్యాయపోరాటం చేసిన ఏబీవీ
- తప్పనిసరి పరిస్థితుల్లో చివర్లో దిగొచ్చిన జగన్ సర్కార్ 10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గతించని గతం

'ఆష్విట్జ్ మారణ హోమం తరువాత కవిత్వం రాయడం అనాగరికం' అన్నాడు జర్మన్ తత్వవేత్త థియోడర్ అడోర్నో. ఆయన భావమేమిటి? ప్రసన్న చిత్తంతో మననశీలుడైన కవి ఆష్విట్జ్ మృత్యుకూప యాంత్రీకృత, ఆత్మరహిత, పారిశ్రామిక పాశవికతను వ్యక్తం చేసేందుకు సరైన శబ్దాలను కనుగొనలేడు. కవిత్వం అనేది ఆనందప్రదమైన, రమణీయమైన మానసోల్లాస సృష్టి. నరమేధం బీభత్సాన్ని వ్యక్తీకరించేందుకు అది అననుగుణమైనది.

గత శతాబ్ది ప్రథమార్థంలో జర్మనీని పాలించిన జాత్యహంకారులైన నాజీలు యూదు మతస్థులను సంపూర్ణంగా తుదముట్టించేందుకు చేసిన మహా అమానుషంలో భాగమే ఆష్విట్జ్ నిర్బంధ శిబిరం. ఐరోపాలో తాము ఆక్రమించిన అన్ని దేశాల నుంచి యూదులను ఆక్రమిత పోలెండ్‌లో ఏర్పాటు చేసిన ఆ నిర్బంధ శిబిరానికి తరలించి గ్యాస్ చాంబర్లలోకి పంపి హతమార్చారు. పదకొండు లక్షల మందికి పైగా యూదులను ఆ ఒక్క నిర్బంధ శిబిరంలోనే మట్టుపెట్టారు. ఆ మారణ హోమం మానవాళి చరిత్రలోనే మహాకిరాతకమైనది. 1945 జనవరి 27న సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం ఆష్విట్జ్‌ను నాజీల నుంచి విముక్తం చేసింది. ఐక్యరాజ్యసమితి నిర్ణయం ప్రకారం ప్రతి జనవరి 27ను అంతర్జాతీయ హోలోకాస్ట్ స్మారక దినంగా పాటిస్తున్నారు.

ఆష్విట్జ్ పాపం నాజీ జర్మన్లదే అయినా ఆ ముష్కరుల దుర్మార్గాలు తమ దృష్టికి వచ్చినప్పటికీ అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు ఉపేక్షించాయి. 1945లో ఇంకెప్పుడూ అటువంటి రాక్షసత్వాన్ని చోటు చేసుకోనివ్వకూడదని సంకల్పం చెప్పుకున్నాయి. ఆ సంకల్పానికి కట్టుబడి ఉన్నాయా? 1975–79 మధ్య కంబోడియాలో ఖ్మేర్ రూజ్ కమ్యూనిస్టులు తమ ఆదర్శ రాజ్య స్థాపనకు 20 లక్షల మందికి పైగా ప్రజలను హతమార్చారు. ర్వాండాలో టుట్సీ, హూటు తెగల మధ్య అంతర్యుద్ధంలో పదిలక్షల మంది బలైపోయారు. 1995లో బోస్నియాలో వేలాది ముస్లింలు ఊచకోతకు గురయ్యారు. సూడాన్‌లో ఈ శతాబ్ది తొలి సంవత్సరాలలో ప్రజ్వరిల్లిన హింసాకాండలో రెండు లక్షల మందికి పైగా చనిపోయారు. ఈ మారణ కాండల వెనుక అగ్ర రాజ్యాల స్వార్థ ప్రయోజనాలు, గర్హనీయమైన నిర్లక్ష్యం ఉన్నాయని మరి చెప్పనవసరం లేదు. ఇప్పుడు గాజాలో జరుగుతోన్న మారణకాండే అందుకు మరో తిరుగులేని దృష్టాంతం. గాజాలో జరుగుతున్నది గ్యాస్ ఛాంబర్లు లేకుండా ఆష్విట్జ్ పునరావృతమే నని మౌంగ్ జార్నీ అనే మానవ హక్కుల ఉద్యమకారుడు తెగేసి చెప్పారు. అమెరికాతో పాటు జర్మనీతో సహా అనేక యూరోపియన్ దేశాలలో కరడు గట్టిన మితవాదులు, మితవాద రాజకీయ పక్షాలు అంతకంతకూ ప్రాబల్యం పొందడాన్ని గమనిస్తే ఆ భయంకర గతం గురించిన భయాలు ఇంకా గతించలేదని, గతించబోవని చెప్పక తప్పదు. ఆష్విట్జ్‌లో సంభవించిందేమిటో నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటేనే ఆ ఘోర చరిత్రకు చరమగీతం పాడడం సాధ్యమవుతుంది.

ఆష్విట్జ్ జర్మన్ల నేర కృత్యం కాదని జర్మన్ యూదు అయిన అడోర్నో గట్టిగా విశ్వసించాడు. పారిశ్రామిక నాగరికతలోని అమానవత్వమే ఆ మారణహోమానికి దారితీసిందని ఆయన భావించారు. నాజీల దుర్మార్గాలు బహిర్గతమైన తరువాత ఆ దుష్కృత్యాలకు తాము నైతికంగా బాధ్యులమని సామాన్య జర్మన్లు చిత్తశుద్ధితో భావించారు. తమ తాతల ఉదాసీనత మూలంగా జరిగిన ఘోరాలకు నేటి జర్మన్లు మనస్ఫూర్తిగా నైతిక బాధ్యత వహిస్తున్నారు. అపరాధ భావన అనేది వారి మనసుల్లోంచి తొలగిపోలేదు, పోదు కూడా. ఇంకా చెప్పాలంటే గోథే భాష, బీథోవెన్ సంగీతం, కాంట్ తాత్వికత వలే ఆష్విట్జ్ కూడా జర్మన్లతో ముడివడిపోయింది. ఆ మారణహోమం కఠోర వాస్తవాన్ని అంగీకరించడం ద్వారానే వారు మానవతకు, తమ అస్తిత్వానికి కొత్త బాటలు నిర్మిస్తున్నారు.

ఒక కొత్త ప్రపంచ అవ్యవస్థ సమస్త దేశాలను కలవరపరుస్తున్న ప్రస్తుత సందర్భంలో మన భారత గణతంత్ర రాజ్యం ఆ పరిస్థితులను మార్చివేయ గలుగుతుందా? మన రిపబ్లిక్ ఆవిర్భావంలోనే కుల మతాలు, జెండర్ ఇతర అంతరాలకు అతీతంగా వయోజనులు అందరికీ ఓటు హక్కు కల్పించడమనేది ప్రజాస్వామిక చింతన, ఆచరణలో ఒక గొప్ప విప్లవాత్మక ముందంజ. ప్రాచీన గ్రీసులో థేలీజ్ అనే తత్వవేత్త దృగ్గోచర ప్రపంచమంతటికీ ఒక మూల పదార్థం ఉందని వివేచించి, వైజ్ఞానిక ఆలోచనా సరళికి నాందీ వాచకం పలకడం ద్వారా పాశ్చాత్య మేధో ప్రస్థానంలో సాధించిన మౌలిక పురోగతితో మన గణతంత్ర రాజ్య వ్యవస్థాపకుల ప్రజాస్వామిక భావ సాహసాన్ని పోల్చవచ్చు. అయితే మహోన్నత సంస్కృతీ నిర్మాతలయిన జర్మన్లు అస్తిత్వ ఆందోళనలతో అనుద్దేశపూర్వకంగా, నాజీ అనాగరికులకు అధికారమిచ్చి తమకు తామే హాని చేసుకున్నట్టుగా మనమూ మన పురా సామాజిక సంప్రదాయాల ప్రభావంతో మానవతా విరుద్ధమైన పోకడలు పోతున్నాం. జర్మన్ల అపరాధ భావనవలే ఈ వాస్తవాన్ని గుర్తించే నైతిక జాగృతి మనకు ఇప్పుడు అవసరం. తప్పు చేస్తున్నామనే భావనే కాకుండా ఆ దుశ్చర్యకు బాధితులవుతున్న వారి కలతలు, కష్టాలు తీర్చే కొత్త ప్రగతిశీల ఆలోచన కూడా ఆ నైతిక జాగృతిలో భాగంగా ఉండాలి. తద్వారా మాత్రమే మనం గతించని గతం నుంచి బయటపడి, ఒక కొత్త ప్రజాస్వామిక ప్రపంచానికి వేగుచుక్క కాగలుగుతాము.

కాలచక్రంలో ఢిల్లీ రాజకీయాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కాలం ఎంత వేగంగా మారుతోంది! గత అయిదేళ్లతో పోలిస్తే ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో తీవ్ర మార్పులు వచ్చినట్లు కనపడుతోంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ లోక్‌సభలో అత్యధిక స్థానాలు సాధించింది. అయినప్పటికీ దేశంలో ప్రత్యామ్నాయ శక్తులు బలంగా ఉండేవి. విచిత్రమేమంటే 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కేవలం 240 సీట్లు సాధించి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చినా, ప్రత్యామ్నాయ శక్తులు రోజురోజుకూ బలహీన పడుతున్నాయి. అయిదేళ్ల క్రితం 2020 జనవరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పౌరసత్వ చట్టంపై భారతీయ జనతా పార్టీని అత్యంత పదునైన భాషలో విమర్శించారు. భారత రాజ్యాంగ పీఠికలో ఏమి రాశారో చదివి మరీ వినిపించారు. ఆ రోజుల్లో కాంగ్రెస్ కూడా అంత బలంగా మాట్లాడేది కాదు. బీఆర్ఎస్ మాత్రమే కాదు, దేశంలో ప్రాంతీయ పార్టీలు ఎంతో కొంత బలంగా ఉన్నకాలమది. బీజేపీని ప్రాంతీయ పార్టీలే అడ్డుకుంటాయని, బీజేపీని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోందని విమర్శలు తలెత్తుతున్న రోజులవి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, జార్ఖండ్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా కనిపించేవి.

ఈ అయిదేళ్లలో పరిస్థితులు ఎంతో మారిపోయాయి. ఒడిషాలో 24 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌ను గద్దె దించి బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఎవరైనా ఊహించారా? మహారాష్ట్రలో ఒకప్పుడు శివసేనతో పొత్తు కోసం అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ ఆడ్వాణీ ఎంతగానో ప్రయత్నించి బాల్‌థాకరేను తమ వైపునకు తిప్పుకున్నారు. అదే శివసేన మోదీకి ఎదురు తిరిగి కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి 2019లో ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అప్పుడు బీజేపీకి మహారాష్ట్రలోని 280 సీట్లలో కేవలం 105 సీట్లే దక్కాయి. అయినప్పటికీ శివసేన, ఎన్సీపీలను బీజేపీ చీల్చి ఆ ప్రభుత్వాన్ని పడగొట్టి, శివసేన చీలికవర్గం నేత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు దోహదం చేసింది. గత ఏడాది ఎన్నికల్లో బీజేపీ స్వయంగా అత్యధిక సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, చీలిపోయిన ఎన్సీపీ, శివసేన పార్టీలు బీజేపీ పంచన చేరతాయని ఎవరు ఊహించారు? హరియాణాలో 2019లో ప్రాంతీయ పార్టీతో చేతులు కలిపి అధికారం ఏర్పాటు చేయాల్సి వచ్చిన బీజేపీ గత ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు కూడా అంచనా వేయలేకపోయారు. పంజాబ్‌లో 2019 వరకు అకాలీదళ్ లేకుండా బీజేపీ ఒకనాడు పోటీ చేసే పరిస్థితులు ఉండేవి కావు. వాజపేయి, ఆడ్వాణీ ప్రయత్నాల వల్లే అకాలీదళ్ బీజేపీకి స్నేహహస్తం చాచింది. కాని ఇప్పుడు అకాలీదళ్ అంతరించిపోయే పార్టీల జాబితాలో కలిసిపోయే ప్రమాదంలో పడింది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి, లోక్‌సభలో ఒక్క సీటు కూడా సాధించలేని దుస్థితిలో పడుతుందని, తన పార్టీని జాతీయ పార్టీగా మార్చాలని కలలు కన్న కేసీఆర్ ఫాం హౌజ్‌కు పరిమితమవుతారని, ఆయన పిల్లలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటారని ఆ పార్టీ నేతలు కలలో కూడా ఊహించి ఉండరు. ఒకప్పుడు 22 మంది ఎంపీలను, 151 ఎమ్మెల్యేలను గెలిపించుకున్న వైసీపీ ఆంధ్రప్రదేశ్‌లో స్వయంకృతాపరాధాల వల్ల చిత్తుగా ఓడిపోయి మనుగడ కోసం పోరావలసి వస్తుందని, జగన్ కుడిభుజంగా గుర్తింపు పొందిన విజయసాయిరెడ్డి కూడా రాజకీయ సన్యాసం చేస్తారని ఆ పార్టీ నేతల్లో ఎవరు ఊహించారు?

ఈ నేపథ్యంలో ఢిల్లీలో 2013 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తర్వాత బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్న నేత అరవింద్ కేజ్రీవాల్. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిన నేత కేజ్రీవాల్. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగు లేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. నాడు ఢిల్లీలో గెలుపుకోసం అమిత్ షా నిద్రాహారాలు మాని రాత్రింబగళ్లు పనిచేశారు. జామియా, జేఎన్‌యూలలో బీభత్స వాతావరణం నెలకొంది. షాహీన్ బాగ్‌లో నెలల తరబడి నిరసన ప్రదర్శనలు జరిగాయి. పౌరసత్వ చట్టం, 370 అధికరణ రద్దు, త్రిపుల్ తలాఖ్, రామమందిర నిర్మాణంపై తీవ్ర ప్రచారం జరిగింది. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ వైపే మొగ్గు చూపారు.

కాని 2020లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృతమవుతాయని చెప్పలేని పరిస్థితి ఢిల్లీలో నెలకొంది. 2019లో మాదిరి 2024లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢిల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు ఆస్కారం లేదు. దేశంలో వివిధ ప్రాంతీయ పార్టీలను దెబ్బతీసేందుకు అనుసరించిన వైఖరినే బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీ పట్ల ప్రదర్శించినప్పటికీ, ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తనంతట తాను తన ప్రతిష్ఠ దిగజారిపోయే పనులు చేసిందనడంలో అతిశయోక్తి లేదు. టీఆర్ఎస్ మాదిరే ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ప్రజా పోరాటం నుంచి పుట్టిన పార్టీ. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం జరిగిన ఉద్యమమే ఈ పార్టీ ఏర్పడేందుకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనం. యువతీయువకులు 'నేను ఆమ్ ఆద్మీని' అని రాసి టోపీలు ధరించి గల్లీ గల్లీలో పాటలు పాడుతూ, సామాజిక సమస్యలపై నృత్యరూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతికి బద్ధ వ్యతిరేకమని ఆ పార్టీ గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజ్రీవాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజ్రీవాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్, కోదండరామ్ వంటి వారు కూడా ఉన్నారు.



ఢిల్లీలో ఒకప్పుడు ఏకఛత్రాధిపత్యం వహించిన కాంగ్రెస్ ఆమ్ ఆద్మీ పార్టీ వల్ల అస్తిత్వం కోల్పోయింది. ఇప్పుడు బీజేపీ చేతిలో ఆప్ ఓడిపోతే తమకు మళ్లీ కోలుకునే అవకాశం దక్కుతుందని ఆ పార్టీ భావిస్తున్నట్లు కనపడుతోంది. ఢిల్లీలో బీజేపీ గెలిస్తే పంజాబ్‌లోనూ ఆప్ ప్రభుత్వానికి సమస్యలు రావడం ఖాయం. ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీ కూటమికీ, కాంగ్రెస్ కూటమికి ముఖాముఖి హోరాహోరీ పోరు జరిగేందుకు క్రమంగా రంగం సిద్ధమవుతోంది.

2020లో ఒక రోజు కేజ్రీవాల్‌ను కలిసి ఆయన పట్ల ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆసక్తి గురించి చర్చించాను. కాని ఆయన దృష్టి ఇతర అంశాలపై ఉన్నట్లు అర్థమైంది. ఆ తర్వాత కొంతకాలానికి బీఆర్ఎస్ నేతలతో ఆయన భవబంధాలు ఏర్పర్చుకోవడం, ఢిల్లీ మద్యం కుంభకోణం వెలుగులోకి రావడం జరిగింది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతి ఆయననే చుట్టుముట్టడం విషాదకరం. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడింది. మొహల్లా క్లినిక్‌లలో నకిలీ పేషంట్లను సృష్టించారని, జరగని వైద్య పరీక్షలను జరిగినట్లు చూపించారని, నాణ్యత లేని మందులు సరఫరా చేశారని ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకప్పుడు ఎలాంటి మచ్చా లేని ఆమ్ ఆద్మీ పార్టీ ఎవరి నుంచి అవినీతిపై పాఠాలు నేర్చుకుంది? ఉద్యమాల నుంచి, అణగారిన వర్గాల నుంచి అవతరించిన పార్టీలకు కూడా అవినీతి చెదలు పట్టి హరించుకుపోయే పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఏ రాజకీయ పార్టీ పట్ల నమ్మకం ఏర్పడుతుంది? కేవలం ఉచితాలే ఈ పార్టీలను కాపాడతాయా?

ఏమైనా దేశంలో ఒంటరిగా ప్రాంతీయ పార్టీలు పోరాడే పరిస్థితి మాత్రం కనపడడం లేదు. ఇందుకు గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలే నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు కుదరకపోయినా జాతీయ స్థాయిలో ఏదో ఒక కూటమిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. లోక్‌సభలో ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో 293 మంది సభ్యులు ఉండగా, ఇండియా కూటమిలో 238 మంది సభ్యులు ఉన్నారు. ఏ కూటమికీ చెందనివారు కేవలం 11 మంది మాత్రమే ఉన్నారు. దేశ రాజధానిలో జరిగే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించడాన్ని బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటే కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర వహించే స్థితిలో ఉంది. ఢిల్లీలో ఒకప్పుడు ఏకఛత్రాధిపత్యం వహించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వల్ల అస్తిత్వం కోల్పోయింది. ఇప్పుడు బీజేపీ చేతిలో ఆప్ ఓడిపోతే తమకు మళ్లీ కోలుకునే అవకాశం దక్కుతుందని కాంగ్రెస్ భావిస్తున్నట్లు కనపడుతోంది. ఎందుకంటే ఒకప్పటి కాంగ్రెస్ ఓట్లనే ఆప్ కబళించిందని ఆ పార్టీకి తెలుసు. ఢిల్లీలో బీజేపీ గెలిస్తే పంజాబ్‌లో కూడా ఆప్ ప్రభుత్వానికి చాప కింద నీళ్లు ప్రవేశించే అవకాశాలున్నాయి. ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీ కూటమికీ, కాంగ్రెస్ కూటమికి ముఖాముఖి హోరాహోరీ పోరు జరిగేందుకు క్రమంగా రంగం సిద్ధమవుతోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వైద్య విద్యను ప్రైవేటీకరించవద్దు

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో 2023 జూన్ 19న ఇచ్చిన జీవోలు 107, 108 వల్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో కన్వీనర్ కోటాలో విద్యార్థులకు కేటాయించవలసిన సీట్లలో సగభాగం... అంటే 50 శాతం సీట్లని సెల్ఫ్ ఫైనాన్స్ (35 శాతం), ఎన్నారై కేటగిరీలకు (15 శాతం) కేటాయించి, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీ సీట్లకు రూ.12 లక్షలు, ఎన్నారై కేటగిరీ సీట్లకు రూ.20 లక్షలు ఫీజులు పెట్టారు. ఈ రెండు కేటగిరీలలో దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులకు రిజర్వేషన్ పాలసీ వర్తించదు. కన్వీనర్ కోటాలో జనరల్ కేటగిరీకి సంవత్సరానికి ఫీజు 15 వేల రూపాయలు.

2023 సంవత్సరం తర్వాత కొత్తగా స్థాపించిన ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ జీవోలు 107, 108 అమలు చేసేలా ఉత్తర్వులు ఇచ్చారు. జగన్ ప్రభుత్వ హయాంలో మన రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, విజయనగరం, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో సీట్ల అమ్మకానికి తెరలేపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కట్టిన ఈ ప్రభుత్వ కాలేజీలలో సీట్ల భర్తీకి సెల్ఫ్ ఫైనాన్స్ ఎన్నారై కోటాను ప్రవేశపెట్టారు.

నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఈ అయిదు కాలేజీలలో ఒక్కోదానికి 150 సీట్ల చొప్పున మొత్తం 750 సీట్లకు అనుమతి వచ్చింది. వాటిలో 15 శాతం ఆలిండియా కోటాలో అంటే 113 సీట్లు పోగా, మిగిలిన 637 సీట్లను ఏపీలో కన్వీనర్ కోటా ఎ-కేటగిరీలో రిజర్వేషన్లను అనుసరించి ప్రతిభ ఉన్న వారితో భర్తీ చేయాల్సి ఉంది. కానీ జీవోలు 107, 108 వల్ల ప్రస్తుతం జనరల్ కేటగిరీలో కేవలం 50 శాతం అంటే 319 సీట్లు మాత్రమే మిగిల్చారు. 35 శాతం అంటే 223 సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో బి-కేటగిరీ సీట్లుగా మార్చారు. దానికి ఏడాదికి రూ.12 లక్షల చొప్పున ఫీజుగా ప్రకటించారు. మరో 15 శాతం సీట్లను అంటే 96 సీట్లు ఎన్నారై కోటాలో చేర్చారు. వీటికి ఏడాదికి రూ.20లక్షలు ఫీజుగా పేర్కొన్నారు. అంటే ఎంబీబీఎస్ కోర్సు కోసం బి-కేటగిరీ విద్యార్థి సుమారుగా రూ.60 లక్షలు, ఎన్నారై కోటాలో అయితే కోటి రూపాయలు చెల్లిస్తేనే ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు దక్కుతుంది.

ఈ జీవోల వల్ల మెరిట్ కేటగిరీ విద్యార్థులు, రిజర్వు కేటగిరీ విద్యార్థులు ఇద్దరూ నష్టపోతున్నారు. ఒక కాలేజీలోనే ఇలా సగానికి సగం సీట్లు తగ్గిపోతూ వుంటే 2023 సంవత్సరం తరువాత మన రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న, ఎన్ఎంసీ అనుమతులు పొందుతున్న కాలేజీలు మొత్తం కలుపుకుంటే కొన్ని వందల సీట్లని మెడికల్ విద్యార్థులు కోల్పోతున్నారు. 2023లో కొత్తగా ప్రారంభమైన అయిదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో మొత్తం సీట్లలో 85 శాతం ప్రతిభ ఉన్నవారికి దక్కాల్సి ఉండగా, కేవలం 42.5 శాతం... అంటే సగం సీట్లు మాత్రమే మెరిట్ కేటగిరీ విద్యార్థులకు దక్కుతున్నాయి. మిగిలిన సీట్లను ప్రభుత్వం అమ్మకానికి పెడుతోంది.

ప్రభుత్వ కళాశాలలలో వైద్య విద్య చదువుకోవాలని ఆశిస్తున్న ప్రతిభ కలిగిన పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్న, జగన్ ప్రభుత్వ హయాంలోని జీవో 107, 108లను తమ కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజులలో రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు కూటమిగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు విద్యార్థులకు వాగ్దానం చేశాయి. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— అండ్ర మాల్యాద్రి
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

పురుషాహంకార ఆలోచనాధోరణి మారడం లేదు

భార్య మొహం చూసుకుంటూ ఏ భర్త అయినా ఉన్నాడంటే పిచ్చోడైన అంటారు, లేదా అనుమానస్తుడు అయినా కావాలి. ఒకరి మొహాలు ఒకరు గడుపుతూ ఉంటే కుటుంబంలో అవసరాలు ఎలా తీరాలి? డబ్బు ఒకటే కుటుంబాన్ని నడపదు. అందరికీ తిండి కోసం వండాలి, ఇంటిని తీర్చి దిద్దుకోవాలి, శుభ్రం చేసుకునే పనులుంటాయి. పిల్లల పనులు, పండుగలు, పబ్బాలు, సరదాలు, శుభకరమైనవి, అశుభమైనవి ఇలా ఒకటా రెండా ఎన్ని పనులుంటాయి. ఈ పనులన్నీ ఎవరు చేయాలి? ఆడవాళ్ళు మాత్రమే చేయాలని, ఈ కాలంలో కూడా ఐటీ సంస్థల అధినేతలు అనుకుంటున్నారు. ఇటీవల ఎల్ అండ్ టి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తన కింది ఉద్యోగస్తులను శనివారం మాత్రమే కాదు ఆదివారం కూడా పనిచేయించలేకపోతున్నందుకు బాధపడుతున్నాను, ఆదివారం ఇంట్లో కూర్చొని ఏం చేస్తారు, ఎంత సమయం భార్యల మొహాలు చూసుకుంటూ కూర్చుంటారు అని అన్నాడు. అంటే దీని అర్థం ఏమిటి? ఇంట్లో పనులన్నీ ఆడవాళ్ళు చేయాలనే కదా!

ఉద్యోగం పురుషుల లక్షణం కాబట్టి, ఇంటికి కూడా రాకుండా వారానికి 90 గంటలు పని చేసి తన సంస్థకు లాభాలు తీసుకురావాలట. ఎల్ అండ్ టి లాంటి మన సంస్థలు విదేశీ బహుళజాతి కంపెనీల పెట్టుబడులతో నడిచేవే. కానీ విదేశాల్లోని ఆ కంపెనీల్లో స్త్రీలు, పురుషులు ఎక్కువగానే ఉద్యోగాలు చేస్తూ అలాగే ఇంటికి రాగానే కూడా పనిని పంచుకుంటారు. అక్కడి ఆర్థిక విధానం అనివార్యంగా స్త్రీలు, పురుషులు పనిచేసే విధంగా రూపొందించబడింది. కానీ దేశ సంస్థలకు విదేశీ పెట్టుబడులు కావాలి కానీ, స్త్రీ పురుషులు సమానంగా కుటుంబంలో కూడా పనిచేయాలనే భావజాలం కనీసంగా కూడా అబ్బడం లేదు. అంటే వీళ్లకు కేవలం లాభాలు మాత్రమే కావాలి. పురుషాహంకార మైండ్‌సెట్ మారడం లేదన్నమాట. 90 గంటలు పని చేయడానికి కార్మిక హక్కులు ఉంటాయని కూడా గుర్తు లేదు. ఇక 90 గంటల పని అమలు చేయడమంటే కేవలం పురుషులకు మాత్రమే సాధ్యమవుతుంది. అంటే పరోక్షంగా మహిళలను ఉద్యోగాల నుండి దూరం చేయడమే అవుతుంది.

ఇప్పటికే అనధికారికంగా ఐటీ కంపెనీలలో 8 గంటలకు మించి పనిచేయడం వల్ల మానసిక ఒత్తిడి ఉద్యోగులపై ఎక్కువగా ఉన్నది. ఆ మేరకు కుటుంబాలలో అశాంతి కూడా పెరుగుతున్నది. ఇక 90 గంటల పనివల్ల పని వత్తిడితో పాటు కుటుంబ హింస కూడా మరింత పెరుగుతుంది. అనివార్యంగా మహిళలపైనే ఆ హింస పెరుగుతుంది. ఉద్యోగులపై పని భారం లేకుండా ఇష్టంగా నాణ్యత కలిగిన ఎనిమిది గంటల పని, సంస్థలనే కాదు కుటుంబాలను కూడా సంతోషంగా ఉంచుతుంది. శని ఆదివారాలు ఇంట్లో కూడా పని భారం లేకుండా సమానంగా భార్యాభర్తలు చేసుకొని సరదాగా గడిపితే తిరిగి సోమవారం ఉత్సాహంగా ఉద్యోగం చేసుకుంటారు. ఇలా కుటుంబాలు ఆరోగ్యంగానే కాదు ఆనందంగా కూడా ఉంటాయి.

— అనిత, చైతన్య మహిళా సంఘం

తొక్కిసలాట మరణాలకు కారణాలు ఏమిటి?

ఈ మధ్య ఒక పత్రికలో 'దేవుడి అరెస్టు' అని ఒక మాట చదివి మొదటి క్షణంలో ఆశ్చర్యపోయాను. రెండో క్షణంలో, అంతాశ్చర్యం ఎందుకూ? అంతే మరి, అనుకున్నాను. తన గురించి, మానవులు అలా ఎందుకు అనుకుంటారో దేవుడికి తెలీదా? వైకుంఠంలో నించి కిందకి చూడడా? 'వైకుంఠం! వైకుంఠం!' అనుకుంటూ ఎన్నెన్ని దండుల దండుల మానవులు ఆ వైకుంఠం గుడికి వస్తున్నారో, ఇంకా ఇంకా రావాలనుకుంటున్నారో, దేవుడు చూడడా? అందరూ పచ్చి భక్తులు! పండు భక్తులు! ఆడా, మొగా! సుఖంగా ఇళ్ళల్లో ఉండకుండా వైకుంఠం కోసమే, అందులో ఉన్న దేవుడి దర్శనం కోసమే బయల్దేరి, దారిలో తోటి భక్త జనం వత్తిళ్ళతో కాళ్ళు కదలక, ఎలాగో భక్తి గీతాలతో దేహాల్ని ఈడ్చుకుంటూ ముందుకే, దేవుడి కోసమే వస్తున్నారు కదా? ఆ భక్తులు కనపడడం లేదా దేవుడికి?

దేవుడికి ముందుగా కనబడేది, సాధారణ భక్తులు కాదు. వి.ఐ.పి, వి.వి.ఐ.పి భక్తులు! అంటే వెరీ వెరీ ఇంపార్టెంట్ పర్సన్స్! అలాంటి వారెవరంటే: రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, పెద్ద పెద్ద కోర్టుల జడ్జీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వాళ్ళ కుటుంబాలూ, బంధుమిత్రులూ, అనుచరులూ, వగైరాలు! వీళ్ళందరూ ప్రత్యేక దర్శనాలకు అర్హులు. స్వామివారు, వీరిని ప్రత్యేక అతిథులుగా, ఆత్మీయ అతిథులుగా, ముఖ్య అతిథులుగా భావించి, దర్శన భాగ్యం కలిగిస్తారు. ఉన్నత హోదాల్లో లేని లక్షలాది సాధారణ భక్తులు మాత్రం క్యూలలో గంటల తరబడి నిలబడి వేచి చూడాలి. దేవుడి ముందు అందరూ సమానమే అంటారు గానీ, అది నిజం కాదు. కొందరు ఎక్కువ సమానులు, కొందరు తక్కువ సమానులు. 300 రూపాయల టిక్కెట్లు కొని ప్రత్యేక దర్శనం పొందేవారూ, 10 వేల రూపాయల టిక్కెట్లు కొని ప్రత్యేక దర్శనం పొందేవారూ, ఏ డబ్బూ లేకపోయినా, మంత్రుల, ఎమ్మెల్యేల సిఫార్సుల ఉత్తరాలతో, ప్రత్యేక దర్శనం పొందేవారూ– ఇలా భక్తుల్లో వర్గాలు! విశేషం ఏమిటంటే, ఇక్కడ కుల వివక్ష లేదు. వర్గ వివక్షే! డబ్బున్నవాడికే ప్రత్యేక దైవ దర్శన భాగ్యం!

భక్తిలో డబ్బు పాత్ర గురించి రమణ మహర్షి చెప్పిన అద్వైత వేదాంతానికి లొంగిపోక ముందు, చలం రాసిన చక్కని మాటలు చూడండి! "...మీ దేవుడు మీ డబ్బుకి దాసుడు. మీ నంగి పూజలకీ, స్వార్థ ప్రార్థనలకీ వశ్యుడు. దొంగ భక్త పరాధీనుడు." (శ్రీశ్రీ 'మహా ప్రస్థానా'నికి, 17-7-1940న చలం రాసిన యోగ్యతాపత్రం). అలాగే, ఒకప్పుడు కమ్యూనిస్టు కవిగా పేరొందిన గజ్జెల మల్లారెడ్డి అనే ఆయన కూడా, చక్కటి భావాన్ని కవితాత్మకంగా చెప్పాడు: "తెలుగునాట భక్తి రసం, తెప్పలుగా పారుతోంది! డ్రైనేజీ స్కీములేక, డేంజర్‌గా మారుతోంది!" (ఇంత గొప్ప కవిత్వం రాసినాయన కూడా, తర్వాత కాలంలో, ఆ డేంజర్‌లోనే పడ్డారని విన్నాను!)

ఇటీవలి వైకుంఠ ఏకాదశి సందర్భంగా, వేలాది మంది భక్తులు వైకుంఠ ద్వారం దగ్గర చేరారు. హఠాత్తుగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు స్త్రీలు నేలకూలి ప్రాణాలు వదిలేశారు! ఆరుగురిలోగానీ, ఆ వేలమందిలో గానీ, హైకోర్టు జడ్జీలో, మంత్రులో, మరో రకం వి.ఐ.పీలో లేరు సుమా! (ఎందుకు లేరు? వాళ్ళూ ఉండాలి–అని కాదు నా ప్రశ్న!) ఎంత విషాదం! దేవుడు చూస్తూవుంటే ఎలా జరిగింది అది? పడిపోయిన భక్తురాళ్ళని దేవుడు చప్పున తన అభయహస్తాలతో లేవదియ్యలేడా? భక్తులు విశ్రాంతుల కోసం నడకలు ఆపి పడుకున్నారు నేల మీద– అనుకున్నాడా దేవుడు? వాళ్ళు పోతున్నారని గ్రహించి, అభయ హస్తంతో వాళ్ల కళ్ళు తెరిచేలాగ చెయ్యలేడా? అది నిజం కాదు, అన్నీ చెయ్యగలడు! దేవుడు పరమ శక్తిమంతుడు కదా? మరి, ప్రాణాలు పోతుంటే, ఆ ప్రాణాల్ని పట్టి వెనక్కి విసిరికొట్టలేడా? ఆరు కుటుంబాల తల్లుల, భార్యల, మరణాలా? ఏమైపోవాలి ఆ కుటుంబాలు? బిడ్డలేమవుతారు? సామరస్యంగా గడిపే దాంపత్యాలైతే, ఆ భర్త లేమవుతారు? దేవుడికి దైవత్వం ఎక్కడుంది? ఆ ఆరు మరణాలేనా? దాదాపు నలభైమంది భక్తులకు గాయాలట! దేవుడు అభయ హస్తం చాచితే, ఆ భక్తులు ఆస్పత్రి మొహం చూడవలసి ఉండేదా? ఏమిటిది? తనని చూడాలని చచ్చిపోడానికి కూడా సిద్ధపడతారు మనుషులు – అని తెలియడం లేదా? ఇది తెలిసే, వాళ్ళని రక్షించకుండా వదిలేశాడా? రాగానే పాదాభివందనాలు చేస్తారని కాళ్ళు చాచుకుని కూర్చున్నాడా? భక్తులకు, ఇళ్ళ నించీ బయల్దేరినప్పుడే తెలుస్తుంది, కిక్కిరిసే జనాల గుంపులోకి దూరబోతున్నామని! కించిత్తు జంకులేదు. చావకుండా ఉన్న జనాలూ, ఇళ్ళల్లోనే ఉన్న జనాలూ, ఏం చెప్పుకుంటున్నారో దేవుడికి తెలుసా? 'చచ్చిపోయిన వాళ్ళు అదృష్టవంతులు! ఎంత అదృష్టం ఉంటే, వైకుంఠ ద్వారం ముందు ప్రాణాలు వొదులుతారు!' అని.

ఇంతకీ, ఈ తొక్కిసలాటలో జరిగిన మరణాలకు కారణం ఎవరు? తోసుకొచ్చిన భక్తులా? వారికి అలాంటి నమ్మకం కలిగించిన దేవుడా? దీనికి జవాబు, ఇంకో సినిమా తొక్కిసలాట సంఘటన గురించి చెప్పుకున్నాక ఆలోచిద్దాం! ఆ మధ్య ఎర్ర చందనం దొంగల నాయకుణ్ణి హీరోగా చూపిన ఒక సినిమా చూడడానికి, ఆ హీరో అభిమానులు వేల సంఖ్యలో, ఒక సినిమా హాలుకి ఎగబడి పోయారు. ఆ సినిమాకి, ఆ సమయానికి, ఆ హీరో కూడా వస్తున్నాడనీ, సినిమా హాలుకి దగ్గర్లోనే ఉన్నాడని తెలిసి, జనాలు గుంపులు గుంపులుగా తోసుకువెళ్ళారు. జనంలో తోపులాట! కదలలేక కిక్కిరిసిన గుంపులు! ఒక తల్లి మరణం! పిల్లవాడికి ప్రాణాపాయం! కొందరికి గాయాలు! ఆ కిక్కిరిసిన గుంపుల్లో ఉన్న ప్రతీ ఒక్కరూ ఎలాంటి వారనుకోవాలి? నేలమీద ఒక మనిషి పడివుంటే, ఆమెని లేవదీసే గుణం లేకపోయినా, ఆమె మీద చెప్పులతో, బూట్లతో, తొక్కుకుంటూ వెళ్ళకూడదనే బుద్ధి అయినా ఉండదా? పాదాలకు స్పర్శలు లేవా? కాళ్ళు నేలమీద ఉన్నాయో, పడిపోయిన పిల్లవాడి మీద ఉన్నాయో, స్పృహ ఉండదా? తప్పు ఎవరిది? వెంటనే అనిపించేది ఏమిటంటే, ఆ సినిమా జ్వరం పట్టుకున్న జనాల గుంపుల్లో ప్రతీ ఒక్కరిదీ తప్పే అవదా? అసలు ఆ హీరో, మొదటి రోజే, ప్రేక్షకుల మధ్య కూచుని, చూడాల్సిన అవసరమూ, తొందరా ఎందుకు? కావాలంటే, విడుదలకు ముందు చూసుకోలేడా? ఎందుకంటే, ఆ సినిమా గురించి, అంతకు ముందుదాకా, ప్రీ-రిలీజు ఫంక్షన్ల పేరుతో, అనేక నగరాల్లో, జరిపిన బహిరంగ సభల ప్రచారాలు సరిపోవు. సినిమా హాల్లోకే హీరో కూడా వస్తున్నాడంటే, ఆ ప్రచారం తారాస్థాయికి ఎగిరి, తర్వాత ఒకటి రెండు రోజుల్లో, వేలల్లో, లక్షల్లో జనాలు ఆ సినిమాని చూస్తే, కోట్లలో కలెక్షన్లు వచ్చిపడతాయి. పెట్టిన పెట్టుబడికి మించి వంద రెట్లలో, వేల రెట్లలో లాభాలే లాభాలు! పెట్టుబడికి అసలు జరగాల్సింది లాభాల ప్రవాహం! కాబట్టి, ఈ తొక్కిసలాట మరణాలకి సినిమా పెట్టుబడికి ఉన్న లాభాల రంధే కారణం! అలాగే, వైకుంఠ ద్వార దర్శనం దగ్గర తొక్కిసలాటకి కూడా భక్తిపేరుతో, ఆ దేవుణ్ణి పెట్టుబడిగా పెట్టి, ప్రభుత్వాలు నడిపే వ్యాపారమే కారణం!

పెట్టుబడికి అసలు జరగాల్సింది లాభాల ప్రవాహం. కాబట్టి, ఈ తొక్కిసలాట మరణాలకి సినిమా పెట్టుబడికి ఉన్న లాభాల రంధే కారణం. అలాగే, వైకుంఠ ద్వార దర్శనం దగ్గిర తొక్కిసలాటకి కూడా భక్తిపేరుతో, ఆ దేవుణ్ణి పెట్టుబడిగా పెట్టి, ప్రభుత్వాలు నడిపే వ్యాపారమే కారణం!




మొత్తం మీద, సినిమా తొక్కిసలాటకైనా, భక్తి తొక్కిసలాటకైనా, పెట్టుబడి అనేదే మూల కారణం! పెట్టుబడి అనేది ఎంతకైనా తెగిస్తుందని, 150 ఏళ్ళ కిందట, బ్రిటన్‌కి చెందిన డన్నింగ్ అనే కార్మిక నాయకుడు, ఇలా అన్నాడు: "తగినంత లాభం ఉంటే, పెట్టుబడి చాలా ధైర్యం గలది. నిశ్చయమైన 10 శాతం లాభం వుంటే, అది ఎక్కడైనా వ్యాపారం చేస్తుంది. నిశ్చయమైన 20 శాతం లాభం పెట్టుబడికి ఉబలాటాన్ని పెంచుతుంది. 50 శాతం లాభం అయితే సాహసాన్ని పుట్టిస్తుంది. లాభం 100 శాతం అయితే, పెట్టుబడి మానవీయ నియమాలన్నిటినీ కాలరాయడానికి సిద్ధపడుతుంది. 300 శాతం ఉంటే, పెట్టుబడి ఏ నేరం చేయడానికైనా సంకోచించదు. ఏ ప్రమాదానికీ వెనుదీయదు, దాని స్వంతదారుడికి ఉరిశిక్ష పడే అవకాశానికి కూడా!" – ఈ గొప్ప సత్యాన్ని మార్క్సు మనకి చెబుతూ, 'పెట్టుబడి' గురించి ఇలా అంటాడు: "ఒజ్యే అనే ఆర్థికవేత్త– 'డబ్బు అనేది పుట్టుకతో ఒక చెంప మీద రక్తపు మరకతో జన్మిస్తుంది' అంటుంది కానీ, పెట్టుబడి అనేది నఖశిఖ పర్యంతం, ప్రతీ రోమ కూపం నుంచీ రక్తమూ, మురికీ కారుతూ జన్మిస్తుంది!" (కాపిటల్-1, 31వ చాప్టరు చివరిలో).

కాబట్టి దేవుడినో, హీరోనో, ఇంకెవరినో అరెస్టు చేసి ప్రయోజనం లేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అరెస్టు చెయ్యాలి! దానికి తగిన జ్ఞానాన్ని పొందడమూ, ఆ సిద్ధాంతాన్ని, భక్తిలో, సినిమా మత్తులో మునిగిన జనాలకి వివరించడమూ చెయ్యాలి.

● రంగనాయకమ్మ



ఆంధ్రజ్యోతి





'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంఓహెచ్ బాబూ శ్రీనివాస్. చిత్రంలో వరుసగా.. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, ఈఈ సామ్రాజ్యం, ఆంధ్రజ్యోతి విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు (ఇన్‌సెట్‌లో) చర్చావేదికకు హాజరైన పటమట 13వ డివిజన్‌వాసులు

ప్రజాగళం

ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'కు విశేష స్పందన

పటమట 13వ డివిజన్‌లో చర్చావేదికకు భారీగా హాజరైన స్థానికులు

- స్థానిక సమస్యలపై అధికారుల వద్ద చర్చ
- మంచినీరు, డ్రెయినేజీ, శానిటేషన్ సమస్యలే ప్రధానం
- కుక్కల స్వైరవిహారం, దోమల సంచారంపై కూడా..
- శాంతిభద్రతలను పరిరక్షించాలంటూ వినతులు
- ప్రతి ఒక్క సమస్యకు పరిష్కారం చూపిన అధికారులు

'దాహార్తి తీర్చండి. కృష్ణానీటిని అందించండి. పక్కనే కృష్ణానది ఉన్నా నీటిని అందుకోలేని పరిస్థితి. మంచినీటి పైపులైన్లు పాతవైపోయాయి. కలుషిత మంచినీటిని అరికట్టండి. కల్వర్టులు బాగు చేయండి. రోడ్లపై గుంతలను పూడ్చండి. రోడ్లను వెడల్పు చేయండి. శానిటేషన్‌ను మెరుగుపరచండి. లీకవుతున్న భూగర్భ మురుగునీటిని అరికట్టండి. దోమలను నిర్మూలించండి. కుక్కలను నియంత్రించండి. సంఘ విద్రోహశక్తుల పీచమణచండి' అంటూ పటమట 13వ డివిజన్‌లో మంగళవారం ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' చర్చావేదికలో స్థానికులు అధికారులను కోరారు. ఈ 'మార్పు' చర్చావేదికకు డివిజన్ నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అనేక సమస్యలను అధికారుల ముందుంచగా, అధికారులు పరిష్కారానికి హామీ ఇచ్చారు. అలాగే, కేన్సర్‌పై అవగాహన, సూర్యఘర్ పథకాన్ని ఎలా పొందాలన్న దానిపై సంబంధిత అధికారులు.. స్థానికులకు అవగాహన కల్పించారు.

మొగల్రాజపురం/పటమట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పటమట ఆర్టీసీ కాలనీలోని రామాలయం వీధిలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' చర్చావేదికకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చారు. స్థానిక కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ ప్రభుదాసు, సర్కిల్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, సహాయ వైద్యాధికారి బాబూ శ్రీనివాసరావు, పటమట సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణవర్మ పాల్గొన్నారు. స్థానికులు ఒకటి రెండు నిమిషాల్లోనే తమ సమస్యలను అధికారుల ముందుంచారు.

సమస్యలు.. హామీలు..

- స్థానికులు ముఖ్యంగా మంచినీటి సమస్యల గురించి ప్రస్తావించారు. కృష్ణానది నీళ్లు పూర్తిగా రావట్లేదని, గంగిరెద్దులదిబ్బ రిజర్వాయర్ సరిపోకపోవటమే ఇందుకు కారణమని చెప్పారు. ఈ సమస్యను అధికారులు అంగీకరించారు. ఇది అత్యంత భారీ ప్రాజెక్టు కాబట్టి



ఏడాదిన్నరలో శాశ్వత ప్రాతిపదికన నూతన రిజర్వాయర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- డివిజన్‌లో దాదాపు 30 ఏళ్ల కిందట వేసిన మంచినీటి పైపులైన్ల కారణంగా కలుషిత నీరు వస్తోందని స్థానికులు తెలిపారు. కలుషిత నీటికి కారణమవుతున్న మంచినీటి పైపులైన్లను మార్చేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు హామీ ఇచ్చారు. అంచనాలు రూపొందించి కౌన్సిల్ ఆమోదం తీసుకుంటామన్నారు.
- శానిటేషన్‌కు సంబంధించి ప్రధానంగా చర్చ జరిగింది. శానిటేషన్ నిర్వహించేందుకు తగిన సంఖ్యలో సిబ్బంది లేరన్న విషయాన్ని ప్రస్తావించారు. రోడ్లు పరిశుభ్రంగా ఉండట్లేదని, రోడ్ల వెంబడి వ్యర్థాలు తొలగించాలని కోరారు. రోడ్లపై గోతులు ఉన్నాయని, ప్యాచ్‌వర్కులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
- భూగర్భ మురుగునీటి పథకంలో భాగంగా డీసిల్టింగ్ లేకపోవటం వల్ల మ్యాన్‌హోల్స్ నుంచి ఉబికివస్తున్న మురుగు కష్టాలను స్థానికులు అధికారుల ముందుంచారు. కల్వర్టులు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, రోడ్ల వెంబడి మార్జిన్లు దెబ్బతిన్నాయని, వీటిని పరిష్కరించాలని కోరారు. శానిటేషన్ సమస్యను యుద్ధప్రాతిపదికన చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. రోడ్ల ప్యాచ్‌వర్కులు, కల్వర్టులు, మార్జిన్ల పునర్నిర్మాణాలు తదితర సమస్యలకు అంచనాలు రూపొందిస్తామన్నారు.
- కుక్కల స్వైరవిహారంపై విస్తృత చర్చ జరిగింది. కుక్కల దాడులతో ప్రజల ఇబ్బందులు తెలపగా, కుక్కల నియంత్రణ విషయంలో జంతు ప్రేమికులు లేవనెత్తుతున్న అంశాలు సమగ్రంగా చర్చకు వచ్చాయి. ఈ అంశంపై నగరస్థాయిలో విస్తృత స్థాయి చర్చావేదికను నిర్వహించాల్సిందిగా స్థానికులు 'ఆంధ్రజ్యోతి'ని కోరారు.



ఇసుక.. పుష్కలంగా..

ఓవైపు కృష్ణానది.. మరోవైపు మునేరు.. ఇంకోవైపు కట్టలేరు.. ఇలా జిల్లావ్యాప్తంగా ఇసుక పుష్కలంగా లభిస్తోంది. జిల్లాలో దాదాపు అన్ని రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభం కాగా, ఏమాత్రం కొరత లేకుండా ఇసుక చేతికందుతోంది. ఫలితంగా బ్లాక్ మార్కెట్ తగ్గిపోయింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో బడా నిర్మాణ సంస్థలు, బిల్డర్లకే ఇసుక దక్కేది. టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ వల్ల సామాన్యులకు సైతం అతి తక్కువ ధరకు ఇసుక అందుతుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. - కంచికచర్ల, ఆంధ్రజ్యోతి

కృష్ణానది, మునేరు, కట్టలేరు.. ఎక్కడిపడితే అక్కడ ఇసుక

అన్నిచోట్లా లభిస్తుండటంతో నిలిచిన బ్లాక్‌మార్కెట్

- సామాన్యులకు అతి తక్కువ ధరకే లభ్యం
- జిల్లావ్యాప్తంగా తొలగిన ఇసుక కష్టాలు
- పతాక స్థాయిలో నిర్మాణరంగం
- భవన నిర్మాణ కార్మికులకు ఊరట
- విజయవాడలోనూ అందుబాటులోకి..

గత వైసీపీ పాలనలో..

కిందటి వైసీపీ పాలనలో ఇసుక దోపిడీ ఇష్టానుసారంగా జరిగింది. సామాన్యులకు ఇసుక లభించడం గగనమైంది. నిర్మాణ రంగం కుదేలై ప్రాజెక్టులు నిలిచిపోయాయి. పనులు లేక జీవనోపాధి కోల్పోవటంతో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పలువురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. కంచికచర్లలో ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4 వేలు పలికింది. అది కూడా అంత తేలిగ్గా దొరికేది కాదు. అర్ధరాత్రుళ్లు ఎవరి కంట పడకుండా దొంగతనంగా తెచ్చుకోవాల్సి వచ్చేది.

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక..

అధికారంలోకి రాగానే ఇసుక కష్టాలు, బాధలు తొలగించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ వనరుల కొరత వల్ల మొదట్లో కొన్ని ఇబ్బందులు తప్పలేదు. ఈ పథకం గత ఏడాది జూలై 8న అమల్లోకి వచ్చింది. పథకం అమల్లో లోటుపాట్లు, అడ్డంకులు ఎదురయ్యాయి. స్టాక్ పాయింట్ల వద్ద అవకతవకలు జరిగాయన్న ఆరోపణలొచ్చాయి. కృష్ణానదికి, మునేరుకు వరదలు రావటంతో ఇసుక తవ్వకాలకు ఆటంకం కలిగింది. దీంతో ఉచిత ఇసుక పంపిణీ విధానం సంతృప్తికరంగా లేదన్న భావన ఏర్పడింది. ప్రజల నుంచి వస్తున్న అసంతృప్తిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం కూడా గమనిస్తూ ఉచిత ఇసుక పథకంలోని లోటుపాట్లను సవరిస్తూ వచ్చింది. రీచ్‌లపై దృష్టి సారించింది. కృష్ణానది, మునేరులో నీటి ప్రవాహం తగ్గటంతో జిల్లాలోని మిగతా 6లో..



విజయవాడలోనూ తక్కువ ధరకే ఇసుక

ప్రస్తుతం విజయవాడలో కూడా చాలా తక్కువ ధరకు ఇసుక దొరుకుతోంది. ఒకప్పుడు టన్ను రూ.1,000కు లభించేది. ఇప్పుడు రూ.300 నుంచి రూ.350కే అందుతోంది. నిర్మాణ రంగం పుంజుకుంటోంది. భవన నిర్మాణ కార్మికులకు కూడా చేతినిండా పని దొరుకుతోంది. ఉచిత ఇసుక పంపిణీ వల్ల ఆశించిన ఫలితాలు వస్తున్నాయని, ఇదంతా కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చలవేనంటూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చేతినిండా పని



కొరత లేకుండా ఇసుక పుష్కలంగా దొరుకుతుండటంతో మాకు చేతినిండా పని దొరుకుతోంది. నిన్నటివరకు మందగించిన నిర్మాణ రంగం పుంజుకుంది. వైసీపీ హయాంలో ఇసుక కొరత వల్ల పనులు లేక నిర్మాణ కార్మికులు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చొరవ వల్ల కార్మికుల కుటుంబాల్లో వెలుగు కనిపిస్తోంది.

- ఓర్సు నరసింహరావు, ముఠామేస్త్రి

పదేళ్ల తర్వాత అనూహ్యంగా..



ఎస్తేర్ అనూహ్య హత్య కేసులో నిందితుడిని నిర్దోషిగా విడుదల చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు

- నిందితుడిపై ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలు చూపలేదని వ్యాఖ్య
- దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్న మచిలీపట్నం వాసులు

మచిలీపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నానికి చెందిన శింగవరపు ఎస్తేర్ అనూహ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న చంద్రభాన్ సనప్‌ను నిర్దోషిగా విడుదల చేస్తూ మంగళవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మచిలీపట్నం వాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాసిక్యూషన్ ఈ కేసులో నిందితుడిపై సరైన సాక్ష్యాధారాలు చూపలేదనే కారణంతో అతడిని నిర్దోషిగా తేల్చడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... మచిలీపట్నం నోబుల్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్తేర్ అనూహ్య ముంబైలోని టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. 2014 డిసెంబరులో క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆమె మచిలీపట్నం వచ్చింది. 2015, జనవరి 4న అనూహ్య తండ్రి జోనాతాన్ ప్రసాద్ విజయవాడ రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి ముంబై వెళ్లే రైలు ఎక్కించాడు. జనవరి 5వ తేదీన ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినల్ వద్ద ఆమె రైలు దిగింది. అక్కడి నుంచి ఆమె నివాసం ఉండే ఇంటికి వెళ్లేందుకు కారు కోసం ఎదురుచూస్తుండగా, టాక్సీ ఉందని చెప్పి చంద్రభాన్ సనప్ ఆమెను తన వెంట రైల్వేస్టేషన్ బయటకు తీసుకువెళ్లాడు. తన వద్ద కారులేదని.. తన మోటార్ బైక్‌పై తీసుకెళ్తానని చెప్పాడు. చంద్రభాన్ సనప్ వెనుక అనూహ్య నడిచి వెళ్తున్న దృశ్యాలు రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

నాడు మరణశిక్ష విధించిన ముంబై స్పెషల్ ఉమెన్స్ కోర్టు

బైక్‌పై అనూహ్యను తీసుకెళ్లిన చంద్రభాన్ సనప్ నిర్మానుష్య ప్రదేశంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసినట్లుగా నిర్ధారణ చేసుకుని పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన ముంబై స్పెషల్ ఉమెన్స్ కోర్టు అప్పట్లో నిందితుడికి మరణశిక్ష విధించింది. దీంతో నిందితుడు చంద్రభాన్ ముంబై హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు అతని అప్పీలును తిరస్కరించింది. ఈ నేపథ్యంలో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ చూపిన సాక్ష్యాధారాలు సక్రమంగా లేవనే కారణంతో చంద్రభాన్ సనప్‌ను నిర్దోషిగా చూపుతూ.. అతన్ని విడుదల చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఘటన

అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఉద్యమాలు జరిగాయి. అప్పటి మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎంపీ సుజనా చౌదరితో కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఈ కేసులో నిందితుడిని త్వరితగతిన గుర్తించేందుకు, శిక్షపడేందుకు తమవంతు ప్రయత్నాలు చేశారు. అనూహ్య తండ్రి జోనాతాన్‌ప్రసాద్‌ను అప్పటి కేంద్ర హోంమంత్రి షిండే వద్దకు తీసుకెళ్లి విషయం వివరించారు. దీంతో ఈ కేసులో నిందితుడిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు విచారణను వేగవంతం మిగతా 6లో..

ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి

- పాయకాపురంలో కబ్జాస్థలాన్ని పరిశీలించిన రూరల్ ఎమ్మార్వో
- అధికారులకు ఆదేశం

6లో

పాతపాడులో అనధికారిక ప్లాట్లు

- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి : బాధిత రైతుల డిమాండ్

పాకిస్థాన్ కాలనీ పేరు మార్పు

ఇక భగీరథ కాలనీగా అందుబాటులోకి..

స్థానికుల పోరాటానికి కలెక్టర్ లక్ష్మీశ చొరవ

- పేరు మార్పునకు వీఎంసీ కౌన్సిల్‌కు ప్రతిపాదన
- వెనువెంటనే పేరు మార్పు
- అడ్రస్ మార్పునకు ఆధార్ కేంద్రం ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మన దాయాది పాకిస్థాన్ పేరుతో నగరంలో ఉన్న కాలనీ పేరును ఎట్టకేలకు మార్చారు. పాకిస్థాన్ కాలనీ పేరు మార్చాలంటూ కాలనీ వాసులు కొద్ది రోజులుగా పోరాటం చేస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా ప్రచురితమైంది. ఇటీవల జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్ లక్ష్మీశకు కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. దీనిపై ఆయన చొరవ చూపించారు. ఈ కాలనీ కార్పొరేషన్ 62వ డివిజన్‌లో ఉంది. కాబట్టి కాలనీ పేరు మార్చాలంటే కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాలి. కానీ, జిల్లా యంత్రాంగం తరఫున మునిసిపల్ కార్పొరేషన్ చట్టంలోని సెక్షన్ 418 ప్రకారం పాకిస్థాన్ కాలనీ పేరు మార్చాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను కమిషనర్ ధ్యానచంద్ర ప్రత్యేకంగా తీసుకుని కాలనీ పేరు మిగతా 6లో..



పాకిస్థాన్ కాలనీ పేరు మార్చాలంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



రహదారి భద్రత అందరి బాధ్యత

- కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ

4లో

సౌర వెలుగుల హరివిల్లు కావాలి

- సూర్యఘర్ ర్యాలీలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

ఒరేయ్ ఈవో.. తోలుతీస్తా..

పంచాయతీ కార్యదర్శిపై జనసేన నేత చిందులు

- ఎనికేపాడులో రెండు వర్గాలుగా మారిన జన సైనికులు
- విగ్రహం ఏర్పాటులో మొదలైన వివాదం
- పంచాయతీ తీర్మానాన్ని కాదని గాంధీ విగ్రహం ఏర్పాటు
- వ్యతిరేకించిన మరో వర్గం.. పరస్పర బాహాబాహీ
- సర్దిచెప్పిన పంచాయతీ కార్యదర్శిపై దూషణలపర్వం

6లో



పంచాయతీ కార్యదర్శి (సర్కిల్‌లో)ను వేలుపెట్టి చూపిస్తూ దూషిస్తున్న జనసేన నేత చలమలశెట్టి రమేశ్


కార్యక్రమానికి హాజరై.. 'ఆంధ్రజ్యోతి' పేపరు వీక్షిస్తూ..



అక్షరం అండగా మార్పునకు నాంది

మొగల్రాజపురం/పటమట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పట్టణీకరణ జరగుతున్నంత వేగంగా మౌలిక సాకర్యాల కల్పన సాధ్యం కాకపోయినా సవాళ్లను అధిగమించి మరింత మెరుగ్గా పనిచేయడానికి, ప్రజలకు అవసరమైన వాటిని సమకూర్చడానికి పనిచేస్తున్నామని మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్ చెప్పారు. 'ఆంధ్రజ్యోతి' అధ్వర్యంలో విజయవాడ తూర్పుని యోజకవర్గం 13వ డివిజన్ ఆర్టీసీ కాలనీ రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా

- పట్టణీకరణ వేగం వల్లే సౌకర్యాల కల్పన ఆలస్యం
- సవాళ్లను అధిగమిస్తున్నాం
- ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తాం
- డి.చంద్రశేఖర్, అడిషనల్ కమిషనర్, వీఎంసీ

హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలపై ఆయన మాట్లాడుతూ, 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. రోడ్లు, డ్రైయిన్‌లు, పారిశుద్యం వంటి సమస్యలు ప్రజలు చెబుతున్నా.. వాటిలో ఖర్చుతో కూడుకున్నవి, ఖర్చుతో సంబంధం లేనివి ఉంటాయి. ఖర్చుతోకూడుకున్న వాటిని నిబంధనల ప్రకారం అంచానాలు సిద్ధం చేయించి కౌన్సిల్‌లో పెట్టి పనులు చేయిస్తామని, ఖర్చుతో సంబంధం లేనివి ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని చెప్పారు.

● వీధి కుక్కల విషయంలో ఇప్పటికే సుప్రీం తీర్పులు ఉన్నాయన్నారు. నగరంలో సుమారు 40 వేల వీధికుక్కలు ఉన్నాయని, ప్రతీరోజు 40, 50 కుక్కలకు కు.ని అపరేషన్లు చేస్తున్నామని చెప్పారు. వీధికుక్కలకు ప్రతి రోజు ఆహారం పెట్టేవారు కొందరైతే, కొన్ని చోట్ల రోడ్లపై చెత్తను పడేయడం వల్ల మిగిలిపోయిన ఆహార పదార్థాల వల్ల సమస్య వస్తోందన్నారు.

● ఈఈ సామ్రాజ్యం మాట్లాడుతూ, సమావేశం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. భూగర్భంలో ఉన్న శిథిలమైన మంచినీటి లైన్లు మార్పిస్తామన్నారు. రామలింగేశ్వరనగర్‌లో మరో మంచినీటి రిజర్వాయర్ కడుతున్నామని ఏడాదిలో నీటి సమస్య తీరిపోతుందన్నారు.

● ఏఎంహెచ్‌వో డాక్టర్ బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ, కొత్తగా వీఎంసీకి 150 మంది పారిశుధ్య కార్మికుల కేటాయింపు జరిగిందని, వారిలో ఐదుగురుని డివిజన్‌కు కేటాయిస్తామని చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళ చెత్తను రోడ్లపై పడేయడం వల్ల సమస్య వస్తున్నదన్నారు. చెత్తను వీధుల్లో వేస్తే ఇకపై జరిమానా విధిస్తామన్నారు. పారిశుధ్య సమస్యలపై ఫోన్ నెంబరు 9866514151కి చేయవచ్చని చెప్పారు.

● పటమట ఎస్‌ఐ కృష్ణ వర్మ మాట్లాడుతూ, ఆకతాయిల సమస్య ఉన్న చోట పాయింట్ బుక్‌లు పెట్టించి పెట్రోలింగ్ చేయిస్తామన్నారు. సమస్య ఉంటే ఎవరైనా 7981881018కు ఫోన్ చేయాలని సూచించారు.

● కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ, డివిజన్‌లో ప్రధాన సమస్యలు రెండు ఉన్నాయి.. అవి పారిశుధ్యం, యూజీడీ సమస్య. పారిశుధ్యం విషయంలో కాలనీలు 50 శాతం కంట్రిబ్యూషన్‌తో సిబ్బందిని పెట్టుకుని పనులు చేయించుకునే విధానం తొలగించడం వల్ల డివిజన్‌లో పారిశుధ్య సమస్య వస్తోందన్నారు. యూజీడీ చాలా చోట్ల పొంగి పొర్లుతోందని, అమృత్ పథకం కింద వీఎంసీకి వచ్చిన నిధులలో కొంత డివిజన్‌కు కేటాయించి పనులు చేయించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కోరారు. వీఎంసీకి పన్నుల రూపంలో డివిజన్ నుంచి రూ. 4 కోట్ల వరకు ఆదాయం వస్తున్నా.. ఆ స్థాయిలో మౌలిక వసతుల కల్పన జరగడం లేదన్నారు.

● 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ వేమూరి మురళి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం కోసం క్షేత్రస్థాయిలో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, జనసేన డివిజన్ అధ్యక్షుడు రామాయణపు కోటేశ్వరరావు, టీడీపీ డివిజన్ అధ్యక్షులు గద్దె ప్రసాద్, కాలనీ సంఘాల ప్రతినిధులు, స్థానికులు, సచివాలయ సిబ్బంది, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది పాల్గొన్నారు.

చర్చావేదికలో డివిజన్ ప్రజల అభిప్రాయాలు


● మెయిన్ రోడ్డు ఎంట్రన్స్‌లో కల్వర్టు పగిలిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి చాలా మంది గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనదారులు వెళుతుంటే వాటిలో ఇరుక్కుపోవడం పెద్ద సమస్యగా మారింది. కల్వర్టు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- సూర్యదేవర పాపారావు, లక్ష్మిపతినగర్ కాలనీ అధ్యక్షుడు


● మంచినీటికి వాడే పైపులైన్స్ పాతపడిపోయి నీరు రంగు మారి దుర్వాసన వస్తుంది. పైపులైన్ పునరుద్ధరిస్తే మంచిది. కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. అనేక మంది కుక్క కాటుకు గురయ్యారు. ముఖ్యంగా పిల్లలు బయటకు వచ్చి ఆడుకునే పరిస్థితి లేదు. సమస్యలు పరిష్కారానికి ఒక నిర్దిష్టమైన ట్రోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేయాలి

- భాస్కర రెడ్డి, లక్ష్మిపతినగర్


● సైడ్ డ్రెయినేజీలు పూడిపోయి వ్యర్థాలు రోడ్డు మీద పారుతున్నాయి. దీంతో రోడ్డు మీద నడిచే వీలుండటం లేదు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలి. పార్క్‌లో టాయిలెట్స్ పల్లం అయ్యాయి. ఆస్థలాన్ని మెరక చేయించి సమస్యను పరిష్కరించాలి.

- లీలా ప్రసాద్, న్యూ ఆర్టీసీ కాలనీ


● అంతర్గత రోడ్లు నెలలో పది సార్లు శుభ్ర పరచాలి. చెత్తతో నిండిన డస్ట్ బిన్స్ శుభ్రం చేయాలి. ఎప్పటికప్పుడు డస్ట్ బిన్స్ శుభ్రం చేయకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. మందుబాబుల అగడాలు అధికంగా ఉన్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డు కట్ట పడాలి. కుక్కలను సైతం నిర్మూళించాలి.

- సాంబశివరావు, జెడీ నగర్


● 7.ఎ రోడ్డులో దోమలు బెడద ఉంది. అపరిశుభ్రత వల్లే దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. బీసీ హాస్టల్లో 200 మంది విద్యార్థులు ఉన్నారు. వారు వినియోగించే వస్తువులు ఇతర వాటి వల్ల డ్రెయినేజీ నిండినప్పుడు అక్కడ నుంచి రోడ్డు మీదకు వ్యర్థాలు వచ్చేస్తున్నాయి. ఈసమస్యకు పరిష్కారం చూపాలి.

- శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటీ కాలనీ


● కాలనీలో అసాంఘిక కార్యక్రమాలు అధికంగా జరుగుతన్నాయి. రాత్రి వేళల్లో మరింత అధికంగా సాగుతున్నాయి. పోలీసుల నిఘా పెంచాలి. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. అసాంఘిక శక్తుల భరతం పట్టాలి.

- మధుసూదనరావు, ఎలక్ట్రిసిటీ కాలనీ


● భర్త చనిపోయి ఏడాదిన్నరయ్యింది. కాయకష్టం మీద జీవిస్తున్నాను. నాకు దిక్కు లేదు. నన్ను ఆదుకునే వారు లేదు. కనీసం ప్రభుత్వం నుంచి విడో పించన్ ఇప్పించి ఆదుకోవాలి.

- సత్యవతి


● ప్రభుత్వం నివేశన స్థలంతో పాటు ఇళ్లు ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలనైన ఇంత వరకు ఇవ్వలేదు. వచ్చే సంపాదన ఇంటి ఖర్చులకే సరిపోతుంది. అద్దెలు కట్టలేక అవస్థలు పడుతున్నాం. సొంత ఇళ్లు ఉంటే కొంత వెసులుబాటు ఉంటుంది.

- వరాలమ్మ


● సైడ్ కాలువలు నిండిపోయి కాలువల్లో మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. రోగాల భయంతో అల్లాడుతున్నాం. సైడ్ డ్రెయినేజీలను మెయిన్ డ్రెయినేజీల్లో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలి. లో ఓల్టేజ్ సమస్య ఉంది. ఇంట్లో గృహోపకరాలు ఏం అవుతాయోనని భయం వేస్తుంది. ఈరెండు సమస్యలు పరిష్కరించాలి.

- జగదీష్, మెగా టౌన్ షిప్


● పటమట ఈసేవ నుంచి ఎన్.ఎస్.ఎమ్ స్కూల్‌కు ఇరువైపులా ఉన్న రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఆరోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు.రోడ్డు వెడల్పు చేయించి సమస్యను పరిష్కరించాలి. పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచాలి.

- చిట్టా నిర్మల


● విజయవాడలో కార్పొరేషన్ వారి సహకారంతో 9 చోట్ల వర్మీ కంపోస్టు ప్లాంట్లు ఏర్పాటు చేశాం. వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడమే ముఖ్య లక్ష్యం. చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా కలిగే ప్రయోజనాలు అనేకం. పర్యావర్ణ పరిరక్షణకు చెత్త సంపద కేంద్రాలకు ప్రజలు చేయూతనందించాలి. వ్యర్థాలను ఇంటి వద్దకు వచ్చే వాహనాల్లోనే వేయాలి.

- ఎంవీ సుబ్బారావు


● ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తూ అధికారులు మీద ఫిర్యాదు చేసే అవకాశం ఇవ్వవద్దు. అందరం కలిసికట్టుగా పని చేద్దాం.

- శంకర్ మాస్టర్, జెడీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు





రామచంద్రాపురం ఎన్ఎస్‌పీ 117 వద్ద సాగునీటిని పరిశీలిస్తున్న కోట వీరబాబు తదితరులు

ఆరుతడి పంటలను కాపాడండి

- ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు

విస్సన్నపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ మూడో జోన్‌లో 2.11 లక్షల ఎకరాల్లో సాగు చేసిన ఆరుతడి పంటలను రక్షించాలని ఎన్ఎస్‌పీ మూడో జోన్‌కు నిరాటకంగా 1700 క్యూసెక్కుల సాగర్ జలాలు సరఫరా చేయాలని ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విస్సన్నపేట మండలం రామచంద్రాపురం 117 కి.మీ రెగ్యులేటర్ వద్ద తెలంగాణ రాష్ట్రం నుంచి వస్తున్న సాగర్ జలాలను నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. 12 టీఎంసీ సాగునీటిని విడుదల చేయాలని కృష్ణా రివర్ బోర్డు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేస్తే ఇప్పటి వరకు 2 టీఎంసీలు మాత్రమే పైనుంచి విడుదలయ్యాయన్నారు. రాష్ట్రానికి నిరాటకంగా 1700 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూడోజోన్ డీసీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, కొల్లి వెంకట శ్రీనివాస రెడ్డి, కాపా రాంబాబు, గంధ్ర ప్రసాద్, ఎమ్ఆర్ మోహిద్దీన్, ఈఈ సంతోష్, కవులూరి రాజ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, తదితరులు

రహదారి భద్రత అందరి బాధ్యత

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భద్రమైన సమాజానికి సురక్షిత రహదారులపై సురక్షిత డ్రైవింగ్ కీలకమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారి భద్రతకు బాధ్యతగా ముందడుగు వేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ (కేడీఎల్ఓఏ) అధ్వర్యంలో జిల్లా రవాణాశాఖ భాగస్వామ్యంతో మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. బెంజిసర్కిల్ వద్ద ర్యాలీని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ప్రారంభించగా, కలెక్టరేట్ వద్ద ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని ప్రతిఒక్కరూ రహదారులను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరముందన్నారు. రహదారి భద్రత విషయంలో లారీ యజమానుల అసోసియేషన్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేడీఎల్ఓఏ ప్రెసిడెంట్ నగుమోతు రాజా, జనరల్ సెక్రటరీ ఏవీవీ సత్యనారాయణ, డీటీసీ ఎ.మోహన్, ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఎన్‌సీసీ క్యాడట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌర వెలుగుల హరివిల్లు కావాలి

పటమట/కృష్ణలంక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు విద్యుత్ బిల్లుల చెల్లింపుల భారం తగ్గించేందుకు అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఇంటిని సూర్యఘర్ వెలుగులతో నింపి హరివిల్లు చేసుకోవాలని, సోలార్ ప్యానల కనెక్షన్‌ల కొరకు తక్షణమే పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశలు పిలుపునిచ్చారు. సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశలు పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభించి గురునానక్ కాలనీ వరకు ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గురునానక్ కాలనీలో సోలార్ ప్యానల్‌ను అమర్చిన గృహాన్ని సందర్శించి లబ్ధిదారుని అభినందించారు.

- విద్యుత్ చెల్లింపుల భారం తగ్గించాలన్నదే లక్ష్యం
- పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ



సూర్యఘర్ అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రజలకు విద్యుత్ చెల్లింపుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. అతి తక్కువ ఖర్చుతో లబ్ధిదారులు ఇంటిపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తయారైన విద్యుత్‌ను ఉచితంగా గృహ అవసరాలకు వినియోగించుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించవలసిన అవసరం వుండదన్నారు. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనం పొందగలుగుతారన్నారు. లబ్ధిదారులు రూ2 లక్షల విలువైన 3 కేడబ్ల్యు సోలార్ ప్యానల్‌ను రూ.78వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి పై కప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుందన్నారు.రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చన్నారు. దాదాపు 20 ఏళ్ల పాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చని వివరించారు. 3 కేవీ వ్యవస్థ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని, మన అవసరాలకు సరిపడా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చునని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందనానరు. లక్ష మందికి పైగా లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు సుమారు 800 మంది లబ్ధిదారులు 10 శాతం భాగస్వామ్యాన్ని చెల్లించడం జరిగిందన్నారు. బ్యాంకు నుంచి రుణం పొందిన లబ్ధిదారులు సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకొని విద్యుత్ బిల్లు చెల్లించడం ద్వారా ఆదా అయ్యే సొమ్మును బ్యాంకు రుణం కింద చెల్లిస్తే రుణం తీరుతుందన్నారు. అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకొని ప్రజలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటివరకు 70 వేల మంది లబ్ధిదారులు ప్యానెల్ పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు సౌరశక్తి విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా కాలుష్య రహిత పర్యావరణహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. అనంతరం సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చుకున్న మన్న నాగ భాస్కరాంబ గృహానికి వెళ్లి ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్‌ను పరిశీలించి సోలార్ ప్యానెల్ ద్వారా విద్యుత్ తయారి వినియోగం వివరాలను అడిగి తెలుసుకొని లబ్ధిదారుని అభినందించారు. అవగాహన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, పీవో యూసీడీ పి.వెంకటనారాయణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎ.మురళీమోహన్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, గద్దె క్రాంతి కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మడ అడవులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

మచిలీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మడ అడవులను ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్చుచేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా అటవీశాఖ రేంజ్ అధికారి పి.సునీత, డిప్యూటీ రేంజ్ అధికారి జీవీవీ జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'మడమతిప్పరు' శీర్షికతో మచిలీపట్నం మండలం కానూరులో మడఅడవులను నరికి మడ భూములను ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ప్రత్యేక కథనం వచ్చిన విషయం తెలిసిందే.. ఈ కథనంపై స్పందించిన అటవీశాఖ అధికారులు రెండు రోజులపాటు మచిలీపట్నం మండలంలోని కానూరు, బంటుమిల్లిమండలం మణిమేశ్వరంగ్రామాల పరిధిలోని మడ అడవులను పరిశీలించారు. మడ చెట్లు ఎత్తుగా పెరిగి ఉండటంతో భూముల ఆక్రమణ, మడచెట్ల నరికివేస్తున్న విషయాన్ని పరిశీలించేందుకు కష్టంగా మారిందని, దీంతో డ్రోన్ కెమెరా సాయంతో మడ అడవులలో ఆక్రమణలను చిత్రీకరించామని తెలిపారు. కానూరు గ్రామ పరిధిలో లజ్జబండ డ్రెయినేజీ పక్కన ఏపుగా ఎదిగిన మడచెట్లను కొంతమేర విస్తీర్ణంలో నరకడం ప్రారంభించారని, ఇందుకు బాధ్యుడైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సముద్రతీరం వెంబడి సహజసిద్ధంగా పెరిగే మడ అడవులను నరికి, ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.


కానూరు, బంటుమిల్లి మండలం మణిమేశ్వరం గ్రామాల పరిధిలో మడఅడవుల

స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా..

జగ్గయ్యపేట పురపాలక

- పన్ను వసూళ్లు, పనులు చేయటంలో ముందంజ
- పీఎం సూర్యఘర్‌కు 5400 రిజిస్ట్రేషన్లు లక్ష్యం
- పైపులైన్ల మార్పిడితోనే తాగునీటి సరఫరా మెరుగు
- ఆంధ్రజ్యోతితో కమిషనర్ రామ్మోహన్

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)



జగ్గయ్యపేట పట్టణాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించిందని రాష్ట్రంలోనే శానిటేషన్‌లో మోడల్‌గా మారబోతుందని మునిసిపల్ కమిషనర్ రామ్మోహన్ చెప్పారు. చెత్త శుద్ధితో పాటు డంప్ అయిన చెత్తను ప్రాసెస్ చేసి సంపదగా మారుస్తారని చెప్పారు. శానిటే షన్ మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, జీతాలకు ఇబ్బంది లేని విధంగా ఆర్థిక పరిస్థితిని తీసుకురాగలిగామని చెప్పారు. అన్ని రంగాల్లో పురపాలకసంఘాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ రంగాపురం రాఘవేంద్రల సహకారంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు.

'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు..

? పట్టణంలో శానిటేషన్ పరిస్థితి ఎలా ఉంది..

● జిల్లా స్వచ్ఛాంధ్ర మిషన్ పైలట్ ప్రాజెక్టుగా జగ్గయ్యపేట పురపాలక సంఘాన్ని ఎంపిక చేశారు. రాష్ట్రంలోనే చెత్తశుద్ధి, చెత్త డంప్‌లు లేని పురపాలకసంఘంగా మారబోతుంది.

? ప్రాజెక్టు అమలయ్యేలోపు పారిశుధ్యం ఎలా..

● ప్రస్తుతం 4 ఇ-ఆటోలకు 2 ట్రాకర్లు పనిచేస్తున్నాయి. 45 తోపుడు బండ్లు, 2 ఆటోలతో నెట్టుకొస్తున్నాం. మినీ జేసీబీ, కాంపాక్టర్స్ పనిచేస్తున్నాయి. 15వ ఆర్థికసంఘం నిధులతో 55 తోపుడు బండ్లు, 55 బిన్స్ కొనుగోలు చేయబోతున్నాం

? పన్ను వసూళ్లు ఎలా ఉన్నాయి.

● ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.34 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు ఉండగా, రూ.2.67 కోట్లు వసూలైంది. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు, డబుల్ అసెస్మెంట్లు వల్ల ఇబ్బందులు ఉన్నాయి.

? తాగునీటి సరఫరా ఎప్పుడు మెరుగుపడుతుంది.

● పుష్కలంగా తాగునీటి వనరులు ఉన్నా, పంపిణీ వ్యవస్థ 50 ఏళ్ల నాటిది కావటంతో సమస్య ఉంది. వాటర్ వర్క్స్‌లో పలు పనులకు రూ.50లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

? పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు ఎలా ఉన్నాయి.

● ప్రభుత్వం 5400 రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా పెట్టగా, 1100 చేశాం. ఇంకా కొనసాగుతున్నాయి.

? గుంతల పూడ్చివేత ఎంత వరకు వచ్చింది.

● కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో కొంత జాప్యం జరిగింది. పట్టణంలో రెండు ప్యాకేజీల కింద 141 గుంతలు పూడ్చేందుకు రూ.9 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 20శాతం పనులు జరిగాయి. ఈ నెలాకరు కల్లా పూర్తి చేస్తాం.

? ఉద్యోగులు జీతాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కదా!

● పన్నుల వసూళ్లతో పరిస్థితి మెరుగైంది. జీతాలకు ఎదురుచూడాల్సిన పరిస్థితి కార్మికులకు, సిబ్బందికి లేకుండా చేశాం. కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపులు ఇచ్చుకుంటు వస్తాం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

సదాశివంకు సత్కారం



పటమట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం స్థాపించిన నాటి నుంచి నేటి వరకు బీసీలంతా పార్టీకి వెన్నుముకగా నిలిచారని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి అన్నారు. మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్, డవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. నాయీ బ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోట సదాశివంకు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

కల్లుగీత కార్మికుల విభజన సరికాదు

పేరం శివనాగేశ్వరరావు గౌడ్

ధర్నాచౌక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బ్రాందీ షాపుల కేటాయింపుల్లో కల్లుగీత కార్మికులను విభజించడం సరికాదని అఖిల భారత గౌడ సంఘం ఛైర్మన్ పేరం శివనాగేశ్వరరావు గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, శ్రీసైన, యాత, కలాల్, కలారి తదితర కల్లు గీత కార్మిక కుటుంబాలకు చెందిన వారంతా 16వ జీవో ప్రకారం సమానమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1998లో గౌడ కులంగా నామకరణం చేసిందన్నారు. ఆ జీవో ప్రకారం ఆయా కుటుంబాలకు బ్రాందీ షాపులు పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్టు తెలిపారు. కల్లుగీత వృత్తిదారులందరినీ గౌడ్‌లుగా పిలవాలన్నారు.

వందేళ్లయినా రాష్ట్రం బతికే పరిస్థితి లేదు

ఆప్ నేత నేతి మహేశ్వరరావు

ధర్నాచౌక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ 2022-23 ఏడాదికి ఇచ్చిన ఆర్థిక నిర్వహణ నివేదికను చూస్తే మరో వందేళ్లైనా రాష్ట్రం బతికే పరిస్థితి లేదని అర్థమవుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఒకవైపు అప్పుల మీద వడ్డీలు పెరిగి మరోవైపు ఆదాయం పెరగక ఖర్చులు పెరిగి రాష్ట్రం దివాళా అంచులకు చేరిందన్నారు. వారసత్వం ద్వారా వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి, లోకేశ్‌లు ఏమి చేస్తే గెలుస్తాం అన్న కన్సల్టెంట్స్ రాజకీయాలతో రాష్ట్రాన్ని దేశంలోనే అథమస్థాయికి నెట్టారని నీతి ఆయోగ్ నివేదికను బట్టి తెలుస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం తక్షణం స్పందించి ఆర్టికల్ 360 విధించి రాష్ట్రాన్ని దివాళా వైపు వెళ్లకుండా కాపాడాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద యాచకులను, చిరు వ్యాపారులను తొలగించండి

పటమట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద యాచకులను, చిరు వ్యాపారులను తొలగించి వాహన చోదకులు ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్ నగర్ పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ ఉన్నతాధికారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నగరానికి నడిబొడ్డున ఉన్న చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిలో బెంజిసర్కిల్ వద్దయాచకులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు, అందులో మహిళలు, దివ్యాంగులు, హిజ్రాలు, గర్భిణులు, వృద్ధులు ఉంటున్నారని, సిగ్నల్ పడినప్పుడు, వదిలినప్పుడు, వాహనచోదకుల మధ్యలో ఇరుకులో వాహనాలకు ఆనుకుని వెళుతున్నారని ఫిర్యాదు చేశారు.

సహకార చట్టాలను మార్చాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం నేడు

విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కొత్త తెచ్చిన సహకార చట్టాలను మార్చాలని కోరుతూ విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సహకార ధర్మపీఠం నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లనపల్లిలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల పాక నాగభూషణం(45) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతను ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి రాక పోవటంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి చుట్టు పక్కల గాలించారు. మంగళవారం గ్రామంలోని ఊర చెరువులో మృతదేహం తేలి ఉండ టాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయ టకు తీయగా నాగభూషణంగా గుర్తించారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని భావించి అతని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నా కుమార్తెకు పెన్షన్ ఇప్పించండి సర్..

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'లో ఓ తల్లి ఆవేదన



దివ్యాంగురాలైన కుమార్తెను ఎత్తుకుని తీసుకొస్తున్న నాగలక్ష్మి

విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని పటమట 13వ డివిజన్‌కు చెందిన నాగలక్ష్మి అనే మహిళ మంగళవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి తన 30 ఏళ్ల దివ్యాంగురాలైన కుమార్తె పద్మావతితో కలిసి వచ్చారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తన కుమార్తెకు పెన్షన్ వచ్చేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. తన కుమారుడు హోంగార్డుగా పనిచేస్తున్నాడని తన కుమార్తె పెన్షన్‌ను తొలగించారని కన్నీటిపర్యంతమయ్యారు. కొడుకు ఒక్కడి జీతంతో తమ కుటుంబ జీవనం భారంగా మారిందని, తన కూతురు ఆరోగ్యానికి ఖర్చు పెట్టుకోలేని పరిస్థితిలో ఉన్నానని అధికారులకు తెలిపారు. పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ స్పందిస్తూ ఇలాంటి కేసులకు సంబంధించి ప్రభుత్వం కూడా గైడ్‌లైన్స్ మారుస్తోందని, ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే మొదటి ప్రాధాన్యతగా పద్మావతికి పెన్షన్‌కు అర్హురాలిని చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ప్రమాదాలకు నిలయంగా ..

● కోతకు గురైన కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డు మార్జిన్ ● ధ్వంసమైన రక్షణ గోడ

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డు మార్జిన్ కోతకు ,గురై వాహనదారుల పాలిట ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ సర్వీస్ రోడ్డు వెంబడి ప్రధాన అవుట్ పాల్ డ్రెయినేజీ ప్రవహిస్తోంది. డ్రెయినేజీకి రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన గోడ నిర్మించి ఏళ్లు గడిచి పోవంతో పలు చోట్ల ధ్వంసమైపోయాయి. దీంతో మురుగు నీరు ప్రవాహానికి సర్వీస్ రోడ్డు కోతకు గురవుతోంది. ఈ ప్రాంతం మూడు రోడ్ల కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. సర్వీస్ రోడ్డులో నుంచి మెయిన్ రోడ్డులోకి ప్రవేశించే రోడ్డు మలుపు కావడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రోడ్ల పక్కన రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని పలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.



కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డులో ప్రమాదకరంగా మారిన రోడ్డు మార్జిన్

విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

రాణిగారితోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 17, 18 డివిజన్లలో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న, కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలను విద్యుత్‌శాఖ అధికారులు మార్చే కార్యక్రమానికి మంగళవారం నుంచి శ్రీకారం చుట్టారు. రెండు డివిజన్లలో కొంత కాలం నుంచి సమస్యగా కొన్ని విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరుతూ స్థానిక టీడీపీ నేతలు గతంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొడానికి వచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ఈ సమస్య రెండు డివిజన్ల నేతలు గుర్తు చేయడంతో వెంటనే స్పందించిన ఆయన ఈ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు మంగళవారం నుంచి పనులు ప్రారంభించారు. 17వ డివిజన్‌లో 8 స్తంభాలు, 18వ డివిజన్‌లో 7స్తంభాలతో పాటు 17వ డివిజన్‌లోని జెండా చెట్టు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా మారుస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న సైడ్ కాల్వ ప్రమాదకారంగా ఉండడంతో దానిని అక్కడ నుంచి తొలగించి పక్కనే నూతనంగా ఏర్పాటు చేస్తున్నారు. సీపీఎం కార్యాలయం వద్ద పోల్‌ను మార్చారు మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తామని ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పనులను డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ పర్యవేక్షించారు.

సంతోషంగా ఉంది



రెండు డివిజన్లలో విద్యుత్ స్తంభాల సమస్యలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే ఆయన పరిష్కరించమని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించడం వారు కూడా ఆలస్యం చేయకుండా స్తంభాలను మార్చే పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది. డివిజన్ ప్రజల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

రాయి రంగమ్మ
(17వ డివిజన్ అధ్యక్షురాలు)

జీవనోపాధి మెరుగుకు సిటీ లైవ్లీహుడ్ మిషన్

కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, జనవరి 28 (జనవరి): నగర ప్రజల జీవనోపాధి మెరుగుపర్చేందుకే సిటీ లైవ్లీహుడ్ మిషన్ అని కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ ధ్యానచంద్ర తన చాంబర్‌లో కేంద్ర ప్రభుత్వం నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ 2.0 పథకంలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్‌ఐ ఎంఎస్‌ఎంఈ) నిపుణులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా వారికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీ మెంబర్ రాజేంద్ర ప్రసాద్‌ను ఆదేశించారు. అందులో భాగంగా అవసరమైన నైపుణ్య శిక్షణ, షెల్టర్ హోమ్ తదితర అంశాలు నెల గడువులో క్షుణంగా పరిశీలించి నివేదికను సమర్పించాలన్నారు. నివేదిక అనుగుణంగా నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా సిటీ లైవ్ లీ హుడ్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజలు ఆర్థిక పురోగతి సాధించవచ్చు అని తెలిపారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ (యూసీడీ) పి వెంకటనారాయణ, అసిస్టెంట్ ఫ్యాకల్టీ మెంబర్ సాయి పాల్గొన్నారు.

లయోలాలో ముగిసిన డిస్పేస్ సదస్సు

భారతీనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డిస్పేస్ సమాచార వ్యవస్థ, డిజిటల్ వ్యవస్థ గ్రంథాలయాలకు ఊపిరి వంటిదని ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సోమశేఖర రావు అన్నారు. ఫాదర్ గోర్డెన్ లైబ్రరీ ఆంధ్ర లయోలా కళాశాల ఆధ్వర్యంలో డిస్పేస్(గ్రంథాలయ అభివృద్ధి, పుస్తక పఠనం పెంచడం)అనే అంశంపై జరిగిన సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కె.సోమశేఖరరావు మాట్లాడుతూ డిస్పేస్ సమాచార వ్యవస్థ ద్వారా డిజిటల్ సమాచారాన్ని, ఉచితంగా ప్రతి విద్యాలయం సమాచారాన్ని భద్రపరచడానికి తిరిగి పొందడానికి గొప్ప అవకాశం అని, దీనిద్వారా అత్యంత ఖరీదైన సాఫ్ట్‌వేర్‌ను ఈ ఓపెన్ సోర్స్ ద్వారా పొందవచ్చునని అన్నారు. ఫాదర్ పి.ఆర్.జాన్ మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు డిస్పేస్ సమాచార వ్యవస్థ జ్ఞాననిధి అని అన్నారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరుకి చెందిన వితీ, రాంవిశ్వాస్ చౌరాసియా డిస్పేస్‌లో డిజిటల్ సమాచార భద్రత నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ డాక్టర్ ఎం.పాండురంగస్వామి మాట్లాడుతూ ఈ ఉచిత సాఫ్ట్‌వేర్ ద్వారా డిజిటల్ గ్రంథాలను ఏవిధంగా భద్రపరచాలో తెలియజేశారు. కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సగాయరాజ్ కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారులకు, అధ్యాపకులకు కార్యశాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.రోజామణి, కన్వీనర్ డాక్టర్ జి.ఎ.ప్రసాద్‌రావు, ఫాదర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు తుమ్మల శ్రీకుమార్, వివిధ గ్రంథాలయ అధికారులు, పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రొఫెసర్ సోమశేఖరరావు, ఫాదర్ పి.ఆర్.జాన్, అధ్యాపకులు, వివిధ గ్రంథాలయ అధికారులు

ఘనంగా పీబీ సిద్ధార్థ ఎన్‌సీసీ విజయంత పోటీలు

మొగల్రాజపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో మొట్టమొదటి స్వదేశీ యుద్ధ ట్యాంకు విజయంత పేరుతో పీబీ సిద్ధార్థ కళాశాల బాలికల ఎన్‌సీసీ బెటాలియన్(4ఎ) ఆధ్వర్యంలో మంగళవారం క్రీడలు, ఇతర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలో 14 పాఠశాలలు, ఆరు కళాశాలల నుంచి 537 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రన్నింగ్, త్రోబాల్, ఖోఖో, టగ్ ఆఫ్ వార్, తదితర క్రీడాంశాలలో జరిగిన పోటీల్లో ఓవరాల్ మొదటి బహుమతి నలందా కళాశాల, రెండో బహుమతి రామవరప్పాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. డ్రిల్, పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో స్టెల్లా కళాశాల, వక్తృత్వం , ఫ్లాగ్ ఏరియా పోటీల్లో నలందా కళాశాల, సోలో డ్యాన్స్‌లో లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాల, గ్రూప్ సింగింగ్‌లో రామవరప్పాడు జడ్పీ పాఠశాల, గ్రూప్ డ్యాన్స్‌లో గొల్లపూడి ఎట్కిన్‌సన్స్ పాఠశాల ఉత్తమప్రతిభ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్, ఇన్విక్టా కెరీర్ వ్యవస్థాపకులు జొన్నలగడ్డ వివేకానందమూర్తి, గణేష్ గిఫ్ట్ అధినేత గణేష్, ఎపెక్స్ కన్సల్టెంట్ దీపిక, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ సిహెచ్.వి రోహిణి కుసుమ, క్యాడెట్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న గద్దె రామ్మోహన్

విద్యార్థి ఫీజుకు గద్దె ఆర్థికసాయం

పటమట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కళాశాల ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న 2వ డివిజన్‌కు చెందిన నాలం ఫణిమాధవ్‌కు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రూ.15 వేలు తన సొంత నిధుల నుంచి ఆర్థిక సాయంగా అందించారు. ఏడో డివిజన్ సీఆర్ నగర్‌కు చెందిన రంగాల సాయిబాబుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.9 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని, 6వ డివిజన్‌కు చెందిన నందిగామ నవ్యశ్రీకి రూ.50 వేల ఎల్‌వోసీ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పటమట సతీష్ చంద్ర, పెనుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగ నమోదుపై అవగాహన, శిక్షణ

లబ్బీపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ డిజిటల్ యుగంలో దరఖాస్తు నమోదు ప్రక్రియతో ఉద్యోగ శోధన కష్టతరం అవుతుందని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వై.సత్యబ్రహ్మం తెలిపారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఉద్యోగ నమోదుపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల కోసం ప్రభుత్వ ఉపాధి పోర్టల్‌ను ప్రతిరోజు ఫాలో అవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ వేదికలను విద్యార్థులకు వివరించడంతో పాటు ప్రతిభావంతమైన ఉద్యోగ శోధనలు, దరఖాస్తుల కోసం ఆచరణాత్మక శిక్షణ అందించడం వంటి అంశాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ రీజినల్ ఆఫీసర్ ఎన్.రామ్‌మోహన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీస్ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, యూత్ సర్వీస్ ట్రైనర్ జె.చంద్రిక, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి ఆనం

వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మను మంగళవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఛైర్మన్ అజయకుమార్‌లకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం అధికారులు, అర్చకులు ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, సంస్థ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రుద్రకోటి సదాశివం, డైరెక్టర్ సురవరపు నాగరాజుకు ఎంపీ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు అభినందనలు తెలిపారు. అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారామ్‌ను ఎంపీ సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శులు గన్నే ప్రసాద్, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం ఎంపీని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.


నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివం, డైరెక్టర్ నాగరాజును సత్కరిస్తున్న ఎంపీ

కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయించండి

రాష్ట్రంలోని కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయించాలని ఎంపీ కేశినేని శివనాథ్‌ను ఏపీ సంగీత వాయిద్య సంగీత వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షురాలు ఎస్.మీరాబీ, సెక్రటరీ షణ్ముఖ శ్రీనివాస్ కోరారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో వారు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసి కళాకారులకు గుర్తింపు కార్డులతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఎస్.మీరాబీతో పాటు ఉపాధ్యక్షుడు వి.కృష్ణ, సెక్రటరీ షణ్ముఖ శ్రీనివాస్, కోశాధికారి ఎం.నారాయణరావు, సహాయ కోశాధికారి కె.ఆర్.ఈశ్వర్ పాల్గొన్నారు.



శివనాథ్‌ను కలిసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీజేపీ రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్.కృష్ణయ్యకు సాదర స్వాగతం పలికిన ఎంపీ కేశినేని శివనాథ్ ఆయన్ను శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జి యలగాల నూకాలమ్మ, కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.భాను ప్రకాష్ యాదవ్, విజయవాడ బీసీ సంఘం అధ్యక్షుడు తనిశెట్టి లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ సంఘం అధికార ప్రతినిధి పట్నాల హరిబాబు, సీనియర్ బీసీ నేతలు మారేష్ తదితరులు పాల్గొన్నారు.



శివనాథ్‌ను కలిసిన అనంతపురం ఎంపీ

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని మంగళవారం గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పార్లమెంట్‌లో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలతోపాటు రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుకున్నారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా నేతలు జి.కొండయ్య, వి.నరసింహారావు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, వేదికపై ఆసీనులైన పలువురు బీసీ నేతలు

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా
బాబు, పవన్ చొరవ తీసుకోవాలి

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ధర్నాచౌక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే చొరవ తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన బీసీ కులాల సమావేశం గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటుతున్నా బీసీలు రాజ్యాధికారం సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ బీసీ బిల్లుపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తానన్నారు. జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ ఓబీసీ డిమాండ్లకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. దీనిపై పవన్ కల్యాణ్‌తో చర్చిస్తామన్నారు. ఎన్.మారేష్ మాట్లాడుతూ కేంద్రంలో కీలకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లుకు సహకరించాలన్నారు. బీసీబీ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు కృషి చేయాలని తీర్మానించారు. అనంతరం మోదీ చిత్రపటానికి నేతలు పాలభిషేకం చేశారు. పలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

టిడ్కో ఛైర్మన్‌కు అవమానం

● దుర్గగుడిలో ఇన్‌స్పెక్టర్‌పై మంత్రి ఆనంకు ఫిర్యాదు
● మంత్రి ఆలయానికి వచ్చి ఛైర్మన్‌కు దర్శనం కల్పించిన వైనం
● సీఎంకు ఫిర్యాదు చేస్తానన్న ఛైర్మన్ అజయ్‌కుమార్

వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గగుడిలో అమ్మవారి హారతులకు కుటుంబ సభ్యులతో విచ్చేసిన ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌కు అవమానం జరిగింది. ఈ ఘటనపై ఆయన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం టిడ్కో ఛైర్మన్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి హారతులకు విచ్చేశారు. ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు టిక్కెట్లు కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. విధుల్లో ఉన్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ జి.ఎన్.ఎల్.ఆర్ చౌదరి టిడ్కో ఛైర్మన్‌కు ప్రొటోకాల్ ఉన్నప్పటికీ వెనుక వైపున కూర్చోబెట్టారు. దీంతో ఛైర్మన్ ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించగా, ఆయన దురుసుగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో ఆయన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మంత్రి హుటాహుటిన ఆలయానికి విచ్చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని ఛైర్మన్‌ను, ఆయన కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ వ్యవహారంపై తాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానని చెప్పినట్టు తెలిసింది. ఈ సంఘటన దేవస్థానంలో చర్చనీయాంశమైంది.

అంకితభావంతో పనిచేయాలి

● జిల్లా ప్రజా రవాణా అధికారి యేసుదానం

బస్‌స్టేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగం లభించటం గొప్ప విషయమని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కండక్టర్లుగా నియమితులైన వారికి ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.యేసుదానం సూచించారు. ఏపీఎస్‌ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల పిల్లలకు మంగళవారం ఆయన తన చాంబర్‌లో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2020 తరువాత ఆర్టీసీలో వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగులకు సంబంధించి అర్హులైన 30 మందికి ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ డిపోలకు కారుణ్య నియామకం ద్వారా కండక్టర్లుగా నియామక పత్రాలను అందచేసి అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా పర్సనల్ ఆఫీసర్ వెంకటరమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

2న ఫస్ట్ ఏపీ స్టేట్ చెస్ టోర్నమెంట్

లబ్బీపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కానూరులోని స్కాట్స్‌పైన్ ఇంటర్‌నేషనల్ స్కూల్ నందు ఫిబ్రవరి 2న ఫస్ట్ ఏపీ స్టేట్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజీవ్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి 20 మంది స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు క్యాష్ ప్రైజ్‌తో పాటు ప్రతి ఏజ్ గ్రూప్‌లో మొదటి మూడు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. కృష్ణా, గుంటూరు, ఏలూరు, ప్రకాశం జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని ఫిబ్రవరి 1న సాయంత్రం 6 గంటల్లోపు తమపేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, వివరాలకు 9700775220, 92476775 566 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పికిల్ బాల్ క్రీడాకారులకు మెడల్స్

లబ్బీపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కొంపల్లిలోని పికిల్ బాల్ హబ్‌లో జరిగిన హైదరాబాద్ ఓపెన్ పికిల్ బాల్ ర్యాంకింగ్ టోర్నమెంట్ స్విట్ విభాగంలో నగరానికి చెందిన ఎన్.శ్రీధర్, చరణ్ జట్టు విజయం సాధించింది. శ్రీధర్, చరణ జట్టు ఫైనల్స్‌లో సూర్య ఆకాష్, సి.హెచ్.శివ జట్టుపై 15-14 స్కోర్‌తో విజయం సాధించారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం

● ప్రాధాన్యత క్రమంలో 15వేల ఉద్యోగాలు: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యమని, ప్రాధాన్యత క్రమంలో 15వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించి మాట్లాడుతూ అమర్‌రాజా గ్రూప్ వెయ్యి ఉద్యోగాలు, ఎం గ్రూప్‌లో 100 ఉద్యోగాలిచ్చేందుకు వచ్చాయన్నారు. నెల క్రితం నిర్వహించిన జాబ్ మేళాలో 1535 మందికి నాన్ ఐటీ, 72 మంది ఐటీ ఉద్యోగాలు కల్పించినట్టు గుర్తు చేశారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇచ్చిన మల్లవల్లి హామీని ఇప్పటికే అమలు చేశానన్నారు. సుమారు 420 కంపెనీలు మల్లవల్లికి రానున్నాయన్నారు. కేడీసీసీ బ్యాంకు చరిత్ర లో తనకు ఎప్పటికీ ఒక పేజీ ఉంటుందన్నారు. బ్రహ్మయ్య లింగయ్య చెరువులో మట్టి తవ్విన పాపం ఊరికే పోదని హెచ్చరించారు. పోలవరం కాలువను ఏలూరు కాలువకు అనుసంధానం చేస్తానని, ఏలూరు కాలువపై వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చానని దానికి అనుగుణంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తన కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వాస్పత్రిని కూడా అభివృద్ధి చేయలేకపోయాడని విమర్శించారు. కూటమి నేతలు చిరుమామిళ్ల సూర్యం, చలమలశెట్టి రమేష్, దొంతు చిన్న, మూల్పూరి సాయికళ్యాణి, మేడేపల్లి రమాదేవి, దయాల రాజేశ్వరరావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, గొడ్డళ్ల చిన రామారావు, చిమట రవివర్మ, ఎంపీటీసీ పడమట రంగారావు పాల్గొన్నారు.


అభ్యర్థికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రభుత్వ పథకాలపై
ప్రజలకు అవగాహన పెంచాలి

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై ప్రజా సమస్యలు వెలుగులోకి తెచ్చి, ప్రజాగళం వినిపించటంలో ఐటీడీపీ కీలకపాత్ర పోషించిందని, అంతకుమించిన బాధ్యతతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సోషల్ మీడియా ద్వారా మరింతగా అవగాహన కల్పించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఐటీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులతో గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీపీ అంటే బాధ్యత, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. ఐటీడీపీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు చిరుమామిళ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బొగతా రవితేజ, కార్యనిర్వాహక కార్యదర్శి నక్కబోయిన దుర్గ జగదీష్, స్టేట్ కార్యదర్శి కొల్లా దుర్గారావు, తిరువూరు అధ్యక్షుడు ఉప్పెల నరసారెడ్డి, మైలవరం అధ్యక్షుడు పరసా కిరణ్, నందిగామ అధ్యక్షుడు కొమ్మూరి శేషు, విజయవాడ వెస్ట్ అధ్యక్షురాలు మంత్రరత్నం స్రవంతి, సిద్దెల వివేక్, విజయవాడ సెంట్రల్ అధ్యక్షుడు మంగరాజులతోపాటు మండల, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

చలనచిత్రాలకు మాతృక రంగస్థలం

● వేముల హజరత్తయ్య గుప్తా

విజయవాడ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చలనచిత్రాలకు మాతృక రంగస్థలమని, సమాజానికి చైతన్యకారకాలు, నవ సమాజ నిర్మాణానికి సోపానాలు నాటికలని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా సమితి, కొడాలి బ్రదర్స్ సంయుక్త అధ్వర్యంలో డాక్టర్ నందమూరి తారక రామారావు కళాపరిషత్ 8వ ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాల్లో రెండోరోజు మంగళవారం హనుమంతరాయ గ్రంథాలయ కళావేదికపై జరిగాయి. సభకు అధ్యక్షత వహించిన ఆయన ప్రసంగిస్తూ నాటక రంగం తిరిగి పూర్వవైభవం సంపాదించుకోవాలంటే ప్రేక్షకాదరణ, ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఆంధ్ర నాటక కళా సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా తపస్వి వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు స్వాగత వచనాలు చేశారు. వేదికపై గౌరవ, ఆత్మీయ అతిథులుగా ఆర్.మల్లిఖార్జునరావు, ఎం.సంజీవి, పువ్వాడ సుధాకరరావు, వల్లభనేని రాజేశ్వరి పాల్గొని ప్రముఖ రచయిత డాక్టర్ పొట్లూరు సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. అదే వేదికపై ప్రథమ ప్రదర్శనగా తపస్వి కల్చరల్ ఆర్ట్స్ సమర్పణలో ఎం.సంజీవి నాటకీకరణతో పిళ్లా నటరాజ్ దర్శకత్వం వహించిన మహాప్రస్థానం నాటిక ప్రదర్శితమైంది. ద్వితీయ ప్రదర్శన కళాభినయ, విశాఖపట్నం సమర్పణలో పీటీ మాధవ్ రచించిన కవి ప్రసాద్ దర్శకత్వం వహించిన ఓ కాశీ వాసా రావయ్య నాటిక ప్రదర్శితమైంది.




కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మార్వో సుగుణ

ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి

● కబ్జాస్థలాన్ని పరిశీలించిన విజయవాడ రూరల్ ఎమ్మార్వో.. అధికారులకు ఆదేశం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పాయకాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కండ్రిక కాలనీలో కబ్జాకు గురైన స్థలానికి ఫెన్సింగ్ వేయాలని విజయవాడ రూరల్ ఎమ్మార్వో సుగుణ అధికారులను ఆదేశించారు. స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ అసోషియేషన్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌ను ఆనుకుని ఉన్న కార్పొరేషన్ స్థలం కబ్జాకు గురైన విషయమై 'కార్పొరేషన్ స్థలం కబ్జా' పేరుతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రూరల్ ఎమ్మార్వో సుగుణ మంగళవారం కబ్జాకు గురైన స్థలం వద్దకు అధికారులతో కలిసి వచ్చా రు. కార్పొరేషన్ పరిధిలోని స్థలం సర్వే నెంబరు రూరల్ పరిధిలో ఉండటంతో కబ్జాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ అధికారులను పిలిపించి సదరు స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్టు తెలిపారు.

ఇసుక..పుష్కలంగా..

(3వ పేజీ తరువాయి)

ఆళ్లూరుపాడు, ఇందుగుపల్లి, కాసరబాద, పొక్కునూరు (కాసరబాద), ఉస్తేపల్లి, ఏటూరు-1, వేములపల్లి, పెండ్యాల రీచ్‌లతో పాటు దాదాపు అన్ని రీచ్‌లు ప్రారంభమయ్యాయి. ఎలాంటి ఆటంకాలు లేనందున ఇసుక తవ్వకాలు సజావుగా సాగాయి. లారీలకు, టిప్పర్లకు గరిష్టంగా టన్ను రూ.137 చొప్పున లోడింగ్ చేస్తున్నారు. మరోవైపు ట్రాక్టర్ల దగ్గర ఎలాంటి అదనపు రుసుము తీసుకోవట్లేదు. కేవలం ఇసుక లోడింగ్ ఖర్చు భరిస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు గిట్టుబాటు కిరాయి చూసుకుని, నిర్మాణదారులకు, వినియోగదారులకు ఇసుక సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,300కు లభిస్తోంది. ఎక్కువ పరిమాణంలో కావాల్సి వస్తే రూ.1,200కే సరఫరా చేస్తున్నారు.

ఇసుక కొరత లేదు

జిల్లాలో ఇసుక పుష్కలంగా లభిస్తోంది. అన్ని అనుమతులతో ఆరు రీచ్‌లు ప్రారంభమయ్యాయి. కొత్త రీచ్‌ల వద్ద డిమాండ్ లేనందున తవ్వకాలు జరగట్లేదు. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు రీచ్‌లో భూగర్భ జలాలు అడుగంటుతాయంటూ గ్రామస్తులు ఆందోళన చేయటం, కేసులు నమోదు చేయటం వల్ల పెండ్యాల రీచ్‌లలో తవ్వకాలు జరగటం లేదు. వచ్చేనెలలో జిల్లాలో కొన్ని రీచ్‌లకు పర్యావరణ అనుమతుల ధ్రువీకరణ గడువు ముగియనుండటంతో తవ్వకాలు నిలిపేయాల్సి ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఇది సరికాదు. సర్టిఫికెట్ జారీ అయిన తేదీతో సంబంధం లేదు. తవ్వకాలు ప్రారంభమైన నాటి నుంచి ఏడాది వరకు అమల్లో ఉంటుంది.

- వీరాస్వామి, మైనింగ్ ఏడీ

తక్కువ ధరకే..

కూటమి ప్రభుత్వం పుణ్యమా అని ఇసుక బాధలు తొలగిపోయాయి. చాలా తక్కువ ధరకే లభిస్తోంది. వైసీపీ పాలనలో పక్కా ఇల్లు కట్టుకోవాలన్న, పాత ఇంటికి మరమ్మతులు చేయించాలన్న ఇసుక కోసం ఇబ్బందులు పడేవాళ్లం. రూ.4 వేలు చెల్లించినా.. ట్రాక్టర్ ఇసుక దొరకటం గగనమయ్యేది. అలాంటిది ప్రస్తుతం సామన్యులకు సైతం రూ.1,300కే ఇసుక లభిస్తోంది. ట్రాక్టర్లకు లోడింగ్, కిరాయి ఖర్చు చెల్లిస్తే సరిపోతోంది.

- అల్లడి కోటేశ్వరరావు, వినియోగదారుడు

ఒరేయ్ ఈవో.. తోలుతీస్తా..

విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి రమేశ్.. పంచాయతీ కార్యదర్శిపై నోరు పారేసుకున్నారు. ప్రజల ముందే నోటికి వచ్చినట్టు దూషించారు. 'ఒరేయ్..' దగ్గర నుంచి మొదలుపెట్టి 'తోలుతీసేస్తా..' వరకు వెళ్లారు. ఈ ఘటన విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో మంగళవారం జరిగింది.

విగ్రహాల ఏర్పాటులో రభస

ఎనికేపాడుకు చెందిన టంకశాల సుబ్బారావు కొద్ది రోజుల క్రితం జనసేన పార్టీలో చేరారు. జాతీయ రహదారికి పక్కన చిన్న బస్టాప్ ఉండేది. అక్కడికి ఆకతాయిలు చేరుతున్నారని, జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయించాలని సుబ్బారావు నిర్ణయించారు. ఆయన కుమారుడు శివ.. పంచాయతీ ఉపసర్పంచ్ పదవిలో ఉన్నారు. విగ్రహాల ఏర్పాటు కయ్యే ఖర్చును తాను భరిస్తానని సుబ్బారావు చెప్పారు. ఈ అంశాన్ని పంచాయతీ సమావేశ అజెండాలో ప్రవేశపెట్టారు. ఇందుకు సమావేశం అంగీకరించింది. సుబ్బారావు పదిరోజుల క్రితం వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించారు. తర్వాత ఆయన మరో కుమారుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తే స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తుల విగ్రహాలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించడంతో సుబ్బారావు వెనక్కి తగ్గారు. తర్వాత గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. ఇంతలో మండల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న పొదిలి దుర్గారావు గాంధీజీ విగ్రహం స్థానంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. దీంతో వివాదం ఏర్పడింది. విషయం తెలియడంతో పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ విద్యాధర్ ఘటనాస్థలానికి వెళ్లి రెండువర్గాలకు సర్దిచెప్పారు. ఇక్కడ ఎవరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న అంశంపై పంచాయతీలో మరో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలోని పెద్దలు, పాలకవర్గం కలిసి ఒక కమిటీగా ఏర్పడి ఓ నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. ఇదిలా ఉండగా, సుబ్బారావు సోమవారం రాత్రి వంగవీటి మోహన్‌రంగా విగ్రహం పక్కనే గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి రమేశ్‌ను ఆహ్వానించారు. అక్కడికి దుర్గారావు వర్గం చేరుకుని ఎవరినీ సంప్రదించకుండా గాంధీజీ విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. దీంతో సుబ్బారావు, దుర్గారావు వర్గాల మధ్య వివాదం రేగింది. సమాచారం తెలుసుకున్న ఈవో విద్యాధర్ ఘటనాస్థలానికి చేరుకుని పెద్దలతో చర్చించాక నిర్ణయం తీసుకోవాలని అనుకున్నాక.. గాంధీజీ విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. దీనికి అక్కడే ఉన్న చలమలశెట్టి రమేశ్ పూనకం వచ్చినట్టు ఊగిపోయారు. 'ఒరేయ్.. ఈవో మమ్మల్ని అడగటానికి నువ్వెవడివి..? నువ్వొక పాలేరువి.. నువ్వెంత, నీ బతుకెంత.. తోలుతీస్తా జాగ్రత్త..' అంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు. తర్వాత అక్కడున్న వారంతా ఈవోను ఘటనాస్థలం నుంచి పంపేశారు.

ఆయన ఈవో అని తెలియలేదు:చలమలశెట్టి రమేశ్

దుర్గారావు పార్టీలో కార్యకర్త మాత్రమేనని, ఆయనకు ఎలాంటి పదవి లేదని రమేశ్ చెబుతున్నారు. జరిగిన ఘటనపై తాను ఎంపీ బాలశౌరి, ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు సామినేని ఉదయభానుతో ఫోన్‌లో మాట్లాడానని పేర్కొన్నారు. మండల కమిటీలు రద్దయ్యాయని ఉదయభాను అన్నారని వివరించారు. దీని ప్రకారం చూస్తే దుర్గారావు ఎలాంటి పదవి పార్టీలో లేదని చలమలశెట్టి రమేశ్ చెబుతున్నారు. ఆయన ఈవో అని తెలియక దురుసుగా ప్రవర్తించానని చెప్పారు. పంచాయతీ సమావేశంలో చేసిన నిర్ణయానికి విరుద్ధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు తాను ప్రశ్నించానని ఈవో విద్యాధర్ పేర్కొన్నారు.

అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తాం : పొదిలి దుర్గారావు

చలమలశెట్టి రమేశ్ తీరుపై ఎంపీ బాలశౌరి, జనసేన అధిష్ఠానానికి, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తామని పొదిలి దుర్గారావు పేర్కొన్నారు. టంకశాల సుబ్బారావు కొద్దినెలల క్రితమే పార్టీలో చేరారని, జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తాము చెబితే, రాత్రికి రాత్రి గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. చలమలశెట్టి రమేశ్‌ను ఆహ్వానించి కొబ్బరికాయలు కొట్టించారని, తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీలో జరిగిన నిర్ణయానికి వ్యతిరేకంగా విగ్రహం ఏర్పాటు చేసినందుకు పంచాయతీ కార్యదర్శి ప్రశ్నించారని, ఆయన్ను ఇష్టానుసారంగా కొట్టికొచ్చినట్టు దూషించారని పేర్కొన్నారు.

పదేళ్ల తర్వాత అనూహ్యంగా.

(3వ పేజీ తరువాయి)

చేశారు. నిందితుడిని గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. అయితే పదేళ్ల తర్వాత ఈ కేసులో మరణశిక్ష పడిన నిందితుడిపై ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలు చూపని కారణంగా అతనిని నిర్దోషిగా విడుదల చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

బాధ కలిగించింది : జోనాతాన్‌ప్రసాద్, ఎస్తేర్ అనూహ్య తండ్రి

నా కుమార్తె ఎస్తేర్ అనూహ్య హత్య కేసులో నిందితుడిని సుప్రీంకోర్టు నిర్దోషిగా విడుదల చేసిందనే విషయం తెలిసి చాలా బాధ కలిగించింది. అనూహ్య హత్య జరిగిన ప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు నిందితుడు చంద్రభాన్ సనప్‌కు సంబంధించిన ఐడీకార్డు, ఇతరత్రా సాక్ష్యాధారాలను సేకరించిన తర్వాతనే అతన్ని అరెస్ట్ చేశారు. స్పెషల్ ఉమెన్స్ కోర్టు నిందితుడికి మరణశిక్ష విధించింది. ముంబై హైకోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. దీంతో ఈ కేసులో న్యాయం జరిగిందని భావించా. అయితే సుప్రీంకోర్టులో ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాలు సక్రమంగా లేవని నిర్ధారించి నిందితుడి విడుదలకు ఆదేశించిందని తెలిసింది. సుప్రీంకోర్టు తీర్పును నేను ఇంకా పరిశీలించలేదు.

పాకిస్థాన్ కాలనీ పేరు మార్పు

(3వ పేజీ తరువాయి)

మార్పునకు కౌన్సిల్ అనుమతి తీసుకున్నారు. కలెక్టర్ లక్ష్మీశ సూచన మేరకు భగీరథ కాలనీగా నామకరణం కూడా చేశారు.

ఆ పేరెలా వచ్చింది..?

భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో పాకిస్థాన్‌కు చెందిన కొంతమంది అక్కడి నుంచి ఇక్కడకు శరణార్థులుగా వచ్చారు. వారిలో కొందరికి నగరంలో ఆశ్రయం కల్పించారు. అప్పట్లో 40 కుటుంబాల కు ఇక్కడ తాత్కాలిక ఇళ్లు కూడా నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో ఈ ప్రాంతానికి పాకిస్థాన్ కాలనీగా పేరొచ్చింది. యుద్ధం ముగిశాక శరణార్థులంతా పాకిస్థాన్ వెళ్లిపోయారు. ఇది జరిగిన కొద్దిరోజులకే బుడమేరుకు వరదలొచ్చాయి. నిరాశ్రయులైన వారికి ఎత్తయిన ప్రాంతంలో ఉన్న పాకిస్థాన్ కాలనీలో ఆశ్రయం కల్పించారు. కాలక్రమంలో ఆ కుటుంబాలు అక్కడే స్థిరపడిపోయాయి. ప్రస్తుతం ఈ కాలనీలో 60లోపు కుటుంబాలు ఉంటున్నాయి. వీరంతా సగర సామాజికవర్గం కావటంతో రాష్ట్ర క్షత్రియవర్గ సగర సేవాసమితి నేతృత్వంలో కాలనీ పేరు మార్పునకు ప్రతిపాదన వచ్చింది. పేరు కారణంగా తమను దేశద్రోహులుగా చూసే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన చెందారు. కలెక్టర్ చొరవతో పేరు మార్చడంతో ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారి ఆధార్ కార్డుల్లోనూ పాకిస్థాన్ కాలనీ మార్చేసి, భగీరథ కాలనీగా పేర్కొంటున్నారు. మునిసిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని నియమించి చిరునామాల మార్పుకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.


పంట పొలాలకు దారిలేకుండా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

పాతపాడులో అనధికారిక ప్లాట్లు

● రైతులను ఇబ్బంది పెడుతున్న వెంచర్ నిర్వాహకులు
● అనధికార ప్లాట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి - బాధిత రైతులు

విజయవాడ రూరల్ /వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసింది అనధికార లే అవుట్! నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్ వేసి రహదారులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేస్తున్నారు. వాటి వెంబడి పొలాల్లోకి రైతులు వెళ్లాలంటే చుట్టూ ఉన్న ఫెన్సింగ్ దాటాలి. దీంతో పొలాల్లోకి స్వేచ్ఛగా వెళ్లే పరిస్థితి లేదు. సీఆర్‌డీఏ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కన్నెత్తి చూడని పరిస్థితి. విజయవాడ రూరల్ మండలం, పాతపాడు గ్రామ పరిధిలో ఓ ప్రైవేటు వెంచర్ నిర్వాహకులు అనధికారికంగా పాట్లు వేసి సమీప రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతపాడు గ్రామ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్లు 366/1, 366/2ఏలో ఉన్న సుమారు నాలుగెకరాల భూమిలో ముగ్గురు వ్యక్తులు సీఆర్‌డీఏ అనుమతి లేకుండా ప్లాట్లు వేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న భూముల్లోకి రైతులు వెళ్లే వీల్లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల్లోకి నీరు పారుదల కాకుండా కాలువను పూడ్చివేశారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముగ్గురు వ్యక్తులు రైతులను బెదిరించి భయాందోళనలకు గురిచేశారని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అంగన్వాడీ సిబ్బంది అంత్యక్రియలకు 15 వేలు

» మహిళా,శిశు సంక్షేమశాఖ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉండగా మరణించిన అంగన్వాడీ వర్కర్లు, సహాయకుల అంతిమ సంస్కారాల కోసం(అబ్సెక్వియస్ చార్జీలు) వారి కుటుంబానికి రూ.15 వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ డబ్బును మృతుల చట్టబద్ధమైన వారసులకు అందించాలని పేర్కొన్నారు.

ఇమాం, మౌజన్ల వేతనాలు విడుదల చేయాలి

» మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ విజ్ఞప్తి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇమాం, మౌజన్ల గౌరవ వేతనాన్ని త్వరితగతిన విడుదల చేయాలని రాష్ట్ర మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖమంత్రి ఫరూక్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇమాం, మౌజన్ల గౌరవ వేతనాలను చెల్లించడంలేదని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చెల్లించాలని కోరారు.

ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంచుతున్న కూటమి

» వైసీపీ పాలనలో వేధింపులు, చీత్కారాలు: డూండీ రాకేశ్

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆర్యవైశ్యులు కోల్పోయిన గౌరవాన్ని కూటమి ప్రభుత్వం పెంచుతోందని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్యవైశ్య పదం వినపడితే చాలు జగన్ చిరాకుపడిపోయేవారని, ఆర్యవైశ్య సంఘాలను వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఆలయాలను, ఆలయ సిబ్బందిని ఇబ్బంది పెట్టారని, ఆర్యవైశ్యుల వ్యాపారాలను దెబ్బతీశారని అన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆ కష్టాలన్నీ కడతేరాయన్నారు. ఆర్యవైశ్యుల ఇలవేల్పు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడమే కాకుండా, వాసవీ అమ్మవారికి సీఎం హోదాలో చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించనుండటం ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంచుతుందన్నారు. పెనుగొండలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో జనవరి 31న సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు.

దివ్యాంగుల కోసం విశాఖలో స్టేడియం

» ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లు, త్రీ వీలర్స్: మంత్రి డోలా

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం విశాఖపట్నంలో రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో స్టేడియం నిర్మిస్తున్నట్లు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పలువురు విభిన్న ప్రతిభావంతులు మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిసి రాష్ట్ర పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లు, త్రీ వీలర్స్ ఇస్తున్నామన్నారు. పింఛను రూ.6 వేలకు పెంచామని చెప్పారు.

ఇప్పటికైనా 'పనికిమాలిన పనులు' మానుకోండి

» జగన్ బ్యాచ్‌కు సోమిరెడ్డి హితవు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జగన్ చేసినవన్నీ పనికిమాలిన పనులేనని టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబుపై కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. 'స్కిల్ డెవలప్‌మెంట్‌లో అక్రమాల పేరుతో చంద్రబాబుపై జగన్ సర్కార్ అక్రమ కేసు బనాయించింది. ఆ కేసును సీఐడీ నుంచి సీబీఐకి బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించారు. ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేస్తూ చేసిన వ్యాఖ్యలే అది 'పనికిమాలిన కేసు' అనేందుకు నిదర్శనం. ఇప్పటికైనా జగన్‌అండ్‌కో పనికిమాలిన పనులు మానుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో సోమిరెడ్డి హితవు పలికారు.

దావోస్ నుంచి వైసీపీ ఏం సాధించింది?

» శ్వేతపత్రం విడుదల చేయండి: విష్ణువర్ధన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో దావోస్ నుంచి ఏం సాధించారో శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ ఏపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇక్కడి కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రుల దావోస్ పర్యటన మీద వైసీపీ రాద్ధాంతం చేయడం హాస్యాస్పదమని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కుటుంబ సమేతంగా ఆ పార్టీ అధినేత జగన్ దావోస్ వెళ్లిన విషయం మర్చిపోయారని ఎద్దేవా చేశారు. వాళ్లు చేస్తే తప్పు లేదు, పెట్టుబడుల కోసం కూటమి ప్రభుత్వం దావోస్ వెళ్తే తప్పా? అని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్‌లో ఆధోని ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ నేతలు కిలారు దిలీప్, కిరణ్ పాల్గొన్నారు.

ఏపీలో కార్పెట్ల ఉత్పత్తి లేదు

» అందుకే పొరుగు వస్త్రం కొనుగోలు చేశాం: ఆప్కో

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కార్పెట్ల ఉత్పత్తి లేనందువల్లే తెలంగాణలో లివరీ వస్త్రం కొనుగోలు చేసినట్లు ఆప్కో ఎండీ పావనమూర్తి తెలిపారు. తెలంగాణతో పోలిస్తే మన రాష్ట్రంలో పది రెట్లు ఎక్కువ చేనేత మగ్గాలున్నప్పటికీ ఇక్కడి ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన దుప్పట్లు, తువ్వాళ్లు, బెడ్ షీట్లు పొరుగు రాష్ట్రం నుంచి కొనుగోలు చేయడంపై నేతన్నలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మన నేతన్నల పొట్టకొట్టి..' శీర్షికన ప్రచురితమైన వార్తపై ఆప్కో ఎండీ వివరణ ఇచ్చారు. ఏపీలోని చేనేత సహకార సంఘాల నుంచి చీరలు, దోతీలు, తువ్వాళ్లు, డిజైన్ బెడ్ షీట్లు, ఖాదీ షర్టింగ్ కొనుగోలు చేస్తూ ఆప్కో షోరూమ్‌ల ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. అయితే లివరీ బెడ్‌షీట్లు రాష్ట్ర సంక్షేమ శాఖల అవసరాలకు సరిపడా ఏపీలోని చేనేత సొసైటీల్లో ఉత్పత్తి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకుని పొరుగు రాష్ట్రం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

మన చేనేత సొసైటీల్లో లివరీ స్టాక్ ఉంది

» నిబంధనలు ఉల్లంఘించి పొరుగు నుంచి కొనుగోలు

» ప్రభుత్వానికి చేనేత సంఘాల అధ్యక్షుల లేఖలు

» నేతన్నను రోడ్డుపాలు చేశారంటూ ఆప్కోపై ఆగ్రహం

మన రాష్ట్రంలోని కర్నూలు, కడప, మంగళగిరి, రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని చేనేత సొసైటీల్లో లివరీ వస్త్ర నిల్వలు ఉన్నా పొరుగు రాష్ట్రంలోని మ్యాక్ సొసైటీల నుంచి ఆప్కో కొనుగోలు చేయడంలో అవినీతి ఉందని ఏపీ చేనేత సహకార సంఘాలు ఆరోపించాయి. దీనిపై తమ గోడు విన్నవించుకోవడానికి అవకాశం ఇవ్వాలని సీఎస్, సీఎంవో, విజిలెన్స్ విభాగాలకు పలువురు సొసైటీల అధ్యక్షులు లేఖ రాశారు. పొరుగు రాష్ట్రానికి చెందిన వారిని విజయవాడ పిలిచి సమావేశాలు పెట్టామని చెబుతున్న ఆప్కో అధికారులు.. తమకు అపాయింట్మెంట్ కూడా ఇవ్వట్లేదని ఆ లేఖలో వాపోయారు. ఆప్కో షోరూమ్‌ల విక్రయాల్లోనూ అవకతవకలు ఉన్నాయంటూ, తమ వస్త్రం కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు చెబుతున్న అధికారులు.. బయటి వస్త్రం కొనుగోలుకు స్థానిక ఆప్కో జీఎంలకు అనుమతి ఇచ్చి లక్షలాది రూపాయలు జేబులో వేసుకొంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని చేనేత మగ్గాలను వైసీపీ ప్రభుత్వం సగం నిర్వీర్యం చేస్తే ఇప్పుడున్న అధికారులు పూర్తిగా చంపేస్తున్నారంటూ వాపోయారు. ఆప్కో ఉన్నతాధికారి సొంత జిల్లా కర్నూలులోనే లివరీ స్టాకు ఉందని తెలిపారు. మ్యాక్ సొసైటీల్లో కుటుంబ సభ్యులు తప్ప చేనేత కార్మికులు ఉండరని, తెలంగాణ జౌళి శాఖ జియో ట్యాగింగ్ చేసిన నేతన్నల్లో మన ఆప్కో కొనుగోలు చేసిన వస్త్రం తయారు చేసినవారు లేరని ప్రభుత్వానికి రాసిన లేఖలో వివరించారు. మహారాష్ట్ర వస్త్ర వ్యాపారి, తెలంగాణ మ్యాక్ సొసైటీల బిల్లులు, తమిళనాడు నుంచి కొనుగోలు చేసిన వస్త్రం వివరాలను ఆధారాలతో అందజేస్తామన్నారు. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే అన్ని ఆధారాలు అందజేస్తామన్నారు.

ఏకే 47 మిస్ ఫైర్!

» స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయం.. గోప్యంగా ఉంచిన పోలీసులు

సీలేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఏకే 47 మిస్ ఫైర్ అయి స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయమైంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. సోమవారం సాయంత్రం సీలేరు పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ పార్టీకి కేటాయించిన గది వద్ద ఆర్ఎస్ఐ కె.హరీశ్ ఏకే 47లోని మ్యాగ్జైన్‌ను బయటకు తీసి శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయి కుడి కాలి పాదానికి గాయమైంది. వెంటనే ఆయన్ను సీలేరు, చింతపల్లి పీహెచ్‌సీలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఏకే 47 మ్యాగ్జైన్ తొలగించే క్రమంలో ఒక రౌండ్ అందులో ఉండిపోవడంతో మిస్‌ఫైర్ అయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

రఘురామ హత్యకు.. పురమాయించింది ఎవరు?

» సునీల్‌కుమార్ మీకెలా పరిచయం?

» నేరుగా ఆయన ఆఫీసులోకి వెళ్లేంత చనువా?

» దాడిచేస్తుండగా వీడియో తీసిందెవరు?

» ముఖాలకు కర్చీఫ్‌లు కట్టుకుని మీ వెంట వచ్చిన నలుగురు ఎవరు?

» తులసిబాబును ప్రశ్నించిన ప్రకాశం ఎస్పీ

» రెండ్రోజుల్లో 75 ప్రశ్నలు

» నోరువిప్పని నిందితుడు

» నేడు గుంటూరు కోర్టులో హాజరు

» పోలీసులు మళ్లీ కస్టడీకి కోరే అవకాశం

నిజానిజాలు తేలేదాకా.. తులసిబాబును దూరంగా ఉంచుదాం!

టీడీపీ నాయకత్వం నిర్ణయం.. గుడివాడ ఎమ్మెల్యే రాము అంగీకారం

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రఘురామరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబును పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచాలని టీడీపీ నాయకత్వం నిర్ణయించింది. ఇటీవలి ఎన్నికల్లో ఆయన గుడివాడ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెనిగళ్ల రాము గెలుపు కోసం పనిచేశారు. అక్కడ ఆ పార్టీలో క్రియాశీలంగా ఉంటున్నారు. తనపై దాడిలో తులసిబాబు పాత్ర ఉందని రఘురామరాజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ జరిపి అరెస్టుచేశారు. అప్పట్లో సీఐడీ అధిపతిగా ఉన్న పీవీ సునీల్ కుమార్‌కు ఆయన సన్నిహితంగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను పార్టీకి దూరంగా ఉంచాలని నాయకత్వం నిర్ణయంపై ఎమ్మెల్యే రాముతో పార్టీ నాయకులు చర్చించారు. అందుకు ఆయన అంగీకరించినట్టు టీడీపీ వర్గాలు వెల్లడించాయి.



తులసిబాబును ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురి చేసిన కేసులో నిందితుడు కామేపల్లి తులసిబాబును దర్యాప్తు అధికారి అయిన ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ మంగళవారం రెండోరోజు కూడా విచారించారు. 'రఘురామను హత్య చేయాలని ఎవరు పురమాయించారు? అలా చేసినందుకు మీకు కలిగిన లాభమేంటి? అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ మీకెలా పరిచయం? నేరుగా ఆయన కార్యాలయంలోకి వెళ్లేంత చనువు ఎలా వచ్చింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నెల 8న తులసిబాబును ఒంగోలులో విచారించి అరెస్టు చేసినట్లు ఎస్పీ ప్రకటించడం.. అనంతరం గుంటూరు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించడం.. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు కోర్టు ఆయన్ను పోలీసు కస్టడీకి ఇవ్వడం తెలిసిందే. రఘురామ గుండెలపై కూర్చుని హత్య చేసేందుకు యత్నించింది ఎవరో నిర్ధారించే పరేడ్ ఆదివారం గుంటూరులో జరిగింది. రఘురామరాజు స్వయంగా హాజరై గుర్తుపట్టారు. ఇక కోర్టు అనుమతితో సోమవారం ఒంగోలు పోలీసులు తులసిబాబును తమ కస్టడీకి తీసుకున్నారు. ఆయనకు రక్తపోటు అధికంగా ఉండడంతో ఒంగోలుకు తరలించడం ఆలస్యమైంది. చివరకు రాత్రి 7 గంటలకు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. కొద్దిసేపటి తర్వాత ఎస్పీ దామోదర్ ఎదుట హాజరుపరచగా.. రాత్రి 8.30 గంటల వరకూ ఆయన విచారణ జరిపారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి అక్కడే ఉంచారు. మంగళవారం ఉదయం అల్పాహారం అందించారు. 9 గంటలకు తిరిగి జిల్లా పోలీసు కార్యాలయానికి విచారణ కోసం తీసుకెళ్లారు. అక్కడ ఎస్పీ పలు ప్రశ్నలు సంధించారు. రెండ్రోజుల్లో కలిపి 75 ప్రశ్నలు వేయగా.. తులసిబాబు నోరు విప్పలేదని తెలిసింది. 'గుంటూరు సీఐడీ కార్యాలయంలో ముఖానికి కర్చీఫ్‌లు కట్టుకుని రఘురామ గుండెలపై కూర్చొని దాడి చేస్తున్నప్పుడు వీడియో తీసింది ఎవరు? మీ వెంట వచ్చిన నలుగురు ఎవరు' అని ఎస్పీ అడిగినట్లు సమాచారం. అలాగే ఈ నెల 8న తులసిబాబు ఒంగోలులో విచారణకు హాజరైన సమయంలో జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఆయన అనుచరులు చేసిన రగడపై ఎస్పీ సీరియస్ అయ్యారు. 'ఒంగోలు పోలీసులను గుడివాడ రమ్మని మీ అనుచరులు సవాల్ చేస్తారా? అక్కడకు వస్తే ఏం చేస్తారు' అని మండిపడినట్లు సమాచారం. అప్పటి వీడియోలు చూపించి ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. నీళ్లనమిలిన తులసిబాబు ఇందులో తన ప్రమేయం లేదని చెప్పినట్లు సమాచారం. లాయర్ల సమక్షంలో సీసీ కెమేరాల మధ్య విచారణ సాగింది. తులసిబాబును బుధవారం తిరిగి గుంటూరు కోర్టులో హాజరుపరచనున్నారు. పోలీసులు మరోసారి కస్టడీకి కోరే అవకాశముంది.

సీపీడీసీఎల్ సీఎండీగా భాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కేంద్ర విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీగా ఏపీట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏకేవీ భాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలను ఇంధన శాఖ అప్పగించింది. ఇప్పటిదాకా సీఎండీ బాధ్యతలు నిర్వర్తించిన రవిని ఆరోగ్యశ్రీకి బదిలీ చేశారు. ఈ సమయంలో భాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించాలని ఆదేశిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు.

ఆర్ఐడీఎఫ్ పనులు సత్వరమే పూర్తి చేయండి

» జల వనరుల శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌ఫండ్ (ఆర్ఐడీఎఫ్)తో జల వనరులశాఖలో చేపట్టే పనులను త్వరితగతిన పూర్తి చేపట్టాలని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్ఐడీఎస్ నిధులతో ఐదు పనులు చేపట్టాల్సి ఉందని అధికారులు ఆయనకు వివరించారు. ఆర్ఐడీఎఫ్ ఇచ్చే రూ.999 కోట్లలో గోదావరి డెల్టా సిస్టమ్ ఆధునీకరణకు రూ.449.91 కోట్లు, కృష్ణా డెల్టా ఆధునికీకరణకు రూ.250 కోట్లు, పెన్నా డెల్టాను రూ.100 కోట్లతో ఆధునికీకరించాల్సి ఉందని అధికారులు తెలిపారు. రూ.100 కోట్లతో చెరువుల అభివృద్ధి, ఎత్తిపోతల పథకాల పనులను రూ.100 కోట్లతో చేపట్టాల్సి ఉందన్నారు.

వేగంగా రిఫైనరీ పనులు

» మార్చి-ఆగస్టు మధ్య పర్యావరణ అనుమతుల సర్వే

» డిసెంబరులో శంకుస్థాపనకు కార్యాచరణ

» 6 వేల ఎకరాల్లో భారీ రిఫైనరీ ఏర్పాటు

» సీఎం చంద్రబాబుకు వివరించిన బీపీసీఎల్ ప్రతినిధులు

» సమగ్ర ప్రాజెక్టు రిపోర్టుతో రావాలన్న ముఖ్యమంత్రి

» త్వరలోనే అందజేస్తామన్న బీపీసీఎల్ ప్రతినిధులు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు వేగంగా కార్యరూపం దాలుస్తున్నాయి. రామాయపట్నంలో రూ.95,000 కోట్లతో ఆయిల్ రిఫైనరీని ప్రారంభించేందుకు వీలుగా బీపీసీఎల్ పనులు ప్రారంభిస్తోంది. ఉండవల్లి నివాసంలో బీపీసీఎల్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. ఈ ఏడాది డిసెంబరులో శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపడతామని ముఖ్యమంత్రికి ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. రామాయపట్నంలో 6,000 ఎకరాల్లో స్థాపిస్తున్న ఆయిల్ రిఫైనరీకి కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ భారీ రిఫైనరీని నిర్మించేందుకుగాను అటవీ, పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందని, ఇందుకోసం ఆరు నెలల పాటు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సర్వే తర్వాత.. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అనుమతులు ఇస్తుందని పేర్కొన్నారు. ఈ సర్వే మార్చి నెలలో ప్రారంభమై ఆగస్టునాటికి పూర్తవుతుందన్నారు. ఈ భారీ రిఫైనరీకి కేంద్రం ఆమోదం తెలిపినందున అటవీ పర్యావరణ అనుమతుల్లో ఎలాంటి ప్రతికూలతా ఉండకపోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి రిపోర్టును సమర్పించాలని బీపీసీఎల్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. త్వరలోనే రిపోర్టును సమర్పిస్తామని వారు వెల్లడించారు. ఈ భారీ రిఫైనరీని సౌదీ ప్రభుత్వ రంగ సంస్థ సౌదీ ఆరాంకో భాగస్వామ్యంతో బీపీసీఎల్ స్థాపిస్తోంది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా శాఖ సమీక్షలో మంత్రి లోకేశ్, ఆ శాఖ ఉన్నతాధికారులు

117 జీవో ఉపసంహరణపై ఆమోదయోగ్య పరిష్కారం

» ఉపాధ్యాయులు, సంఘాల అభిప్రాయాలు తీసుకోండి

» అధికారులకు విద్యా శాఖ మంత్రి లోకేశ్ ఆదేశం

» బదిలీల చట్టంపైనా అభిప్రాయ సేకరణ చేయాలని నిర్దేశం

» టీచర్లకు ఇకపై ఒకటే యాప్.. ప్రతి శనివారం నో బ్యాగ్ డే

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కార్ అనాలోచితంగా తీసుకువచ్చిన 117 జీవో ఉపసంహరణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 117 జీవో ఉపసంహరణపై ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో పాఠశాల విద్య డైరెక్టర్ నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాలు, సూచనలను అధికారులు మంత్రికి వివరించారు. వాటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. ఏ ఒక్క విద్యార్థీ డ్రాపౌట్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలో తీసుకురానున్న ఉపాధ్యాయ బదిలీ చట్టంపై కూడా క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, సంఘాల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు సాంకేతిక పరిజ్ఞానం సాయం తీసుకోవాలన్నారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి.. విద్యార్థులకు కో-కరిక్యులమ్ యాక్టివిటీస్ రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న యాప్‌ల స్థానంలో ఒకటే యాప్‌ను రూపొందించే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఘటనాస్థలంలో సహాయచర్యల్లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

గ్యాస్ లీకై పేలుడు

» కుప్పకూలిన రెండిళ్లు.. నాయనమ్మ, మనవడి దుర్మరణం

» 9 మందికి గాయాలు, రూ.24 లక్షల ఆస్తి నష్టం

» నంద్యాల జిల్లా చాపిరేవులలో ఘటన

నంద్యాల క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో గ్యాస్ లీకై రెండు ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరో ఇంటి స్లాబ్ కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన వెంకటమ్మ(62), ఆమె కుమారులు సుబ్బరాయుడు, లింగమయ్య మూడు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వెంకటమ్మ లైట్ ఆన్ చేశారు. అప్పటికే గ్యాస్ లీకవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు కుప్పకూలింది. దీంతో వెంకటమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన జరిగిన ఇంటిని ఆనుకొని ఉన్న సుబ్బరాయుడు ఇంటి శ్లాబ్ కుప్పకూలడంతో ఆయన కుమారుడు దినేష్(10) అక్కడికక్కడే మరణించాడు. సుబ్బరాయుడు, భార్య రామలక్ష్మి, కుమారుడు కార్తీక్‌తో పాటు అత్త సుబ్బమ్మ, బావమరిది రాములు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి లింగమయ్య ఇల్లు కూడా కుప్పకూలింది. లింగమయ్యతో పాటు ఆయన భార్య వెంకటేశ్వరమ్మ, కుమారులు సుశాంత్, సుధీర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల రూరల్ తహసీల్దార్ పత్తి శ్రీనివాసులు, తాలుకా సీఐ ఈశ్వరయ్య, అగ్నిమాపక దళ అధికారి యోగేశ్వరరెడ్డి శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలు వెలికితీసి, క్షతగాత్రులను నంద్యాల, కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.24 లక్షల ఆస్తినష్టం జరిగిందని అగ్నిమాపక దళ అధికారి తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ 10.46 లక్షల విరాళం

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.10.46 లక్షల విరాళాన్ని అందజేసింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబును కలిసి, రూ.10,46,169 చెక్కు అందజేశారు. గతేడాది విజయవాడలో వరదలకు సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు తమ వంతు విరాళం ఇచ్చినట్టు అసోసియేషన్ ప్రతినిధులు డి.గోపాలకృష్ణ, వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ను చంద్రబాబు అభినందించారు.

మంత్రి లోకేశ్‌కు విరాళాల అందజేత

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు, ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు దాతలు మంత్రి నారా లోకేశ్‌కు విరాళాలు అందజేశారు. మంగళవారం ఉండవల్లిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయనకు విరాళాల చెక్కులు అందజేశారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ నిమిత్తం ఏలూరుకు చెందిన గుత్తా స్వరూపారాణి రూ.లక్ష, గుత్తా వెంకట కృష్ణారావు రూ.50వేలు, గుత్తా శారదాదేవి రూ.50వేలు ఇవ్వగా, చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన జొన్నలగడ్డ శేఖర్ రూ.10 వేల చెక్కు సీఎంఆర్ఎఫ్‌కు ఇచ్చారు. దాతలను మంత్రి లోకేశ్ అభినందించారు.

పాత పెన్షన్ కోసం ఏపీసీపీఎస్ఈఏ పోరుబాట

విజయవాడ(వన్‌టౌన్), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ కోసం పోరుబాటలో నిరసన కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) పిలుపునిచ్చినట్టు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ విధుల్లో చేరిన ఉద్యోగులందరూ యూపీఎస్ పరిధిలోకి వచ్చే విధంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను అమలు చేస్తున్నట్టు మోదీ సర్కార్ ప్రకటించిందని తెలిపారు. యూపీఎస్‌లో 100 శాతం ఉద్యోగి సొమ్ము ప్రభుత్వమే తీసుకుంటుందని, ప్రతినెలా 10 శాతం చొప్పున 30-40 సంవత్సరాలు సర్వీసు చేసిన ఉద్యోగి దాచుకున్న మొత్తాన్ని రిటైర్మెంట్ తరువాత ఇవ్వకుండా ప్రభుత్వమే తీసుకోవటం అత్యంత దారుణమని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు మేనిఫెస్టోలో, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్/జీపీఎస్ విధానానికి బదులుగా పాత పెన్షన్‌లో ఉన్న ప్రయోజనాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. యూపీఎస్‌కు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన ఎన్ఎంఓపీఎస్‌కు మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో సీపీఎస్ ఉద్యోగులు నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు.

వీసీఐసీ అంచనా వ్యయం పెంపు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైజాగ్-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) అభివృద్ధిలో భాగంగా నీటి సదుపాయ పథకం అంచనా వ్యయాన్ని రూ.712.65 కోట్ల నుంచి రూ.766.25 కోట్లకు పెంచుతూ పరిశ్రమల శాఖ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మంగళవారం పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వు జారీ చేశారు.

ఫిబ్రవరి 23న మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఏఎస్, ఐపీఎస్ రిటైర్డ్ అధికారుల పర్యవేక్షణలో హైదరాబాద్‌లో నడుపుతున్న ఎక్సెల్ సివిల్స్ అకాడమీలో ఫిబ్రవరి 23న యూపీఎస్సీ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ కె.రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 75% మెరిట్ స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు 9100433442, 9100433445 నంబర్లలో సంప్రదించాలని, పూర్తి వివరాలకు www.excelacademy.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

చెన్నై రైల్వే స్టేషన్‌లో బాలుడి అపహరణ

» ఐదుగురు నరసరావుపేట మహిళల అరెస్టు.. చిన్నారి క్షేమం

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఓ బాలుణ్ని అపహరించిన కేసులో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఐదుగురు మహిళల్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి చెర నుంచి ఆ బాలుణ్ని రక్షించారు. అసోంకు చెందిన సచితాబేగం తన ఆరేళ్ల కుమారుడు సకీబుద్దీన్‌తో ఈ నెల 12వ తేదీన చెన్నై సెంట్రల్ స్టేషన్ చేరుకున్నారు. స్టేషన్‌లోనే బాలుడితో కలిసి నిద్రపోయారు. ఆమె నిద్ర లేచేసరికి సకీబుద్దీన్ కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. ఆ బాలుణ్ని అపహరించింది చెన్నైలో భిక్షమెత్తుకుంటున్న మహిళా ముఠా అని గుర్తించారు. అనంతరం ఈ నెల 26న నరసరావుపేట వెళ్లిన పోలీసులు.. సరస్వతి, సత్యవతి, వీర అంజమ్మ, ఉమా, అంజమ్మ అనే ఐదుగురు మహిళల్ని అరెస్టు చేశారు. వారి చెరలో ఉన్న బాలుణ్ని రక్షించారు.

ఇంటి తోట

బాల్కనీలో పాలకూర పెంచేద్దాం!

ఆకుకూరల్లో పాలకూర ఆరోగ్యవంతమైనది. దీనిలో బి, సి, ఇ, కె విటమిన్లతో పాటు కాల్షియం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉంటాయి. ప్రతిరోజూ పాలకూరను కొద్ది మోతాదులోనైనా ఆహారంలో చేర్చుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇంటిల్లిపాదికీ ఆరోగ్యాన్ని అందించే పాలకూరను ఇంటి బాల్కనీలోని కుండీలో ఎలా పెంచుకోవాలో తెలుసుకుందాం!

- లోతు ఎక్కువగా ఉన్న వెడల్పాటి కుండీలో మట్టి నింపాలి. దీనిలో సేంద్రీయ ఎరువు, ఎండిన ఆకులు కలపాలి. మట్టి అంతా తడిసేలా నీరు చిలకరించి పాలకూర విత్తనాలు చల్లాలి. మట్టికి ఎండ తగిలేలా ఉంచితే నాలుగు రోజుల్లో మొలకలు వస్తాయి.



- మొక్క పెరుగుతున్నపుడు రెండు వారాల పాటు ప్రతిరోజూ అయిదు నుంచి ఆరు గంటలు ఎండ తగిలేలా చూసుకోవాలి. మొక్క పెరిగిన తరవాత కనీసం ఎనిమిది గంటలు సూర్యరశ్మి సోకాలి.
- మొక్కకు తరచూ నీరు పెడుతూ ఉండాలి. మట్టి ఎప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి. ఎండాకాలంలో మట్టి తడి ఆరిపోకుండా మొక్క చుట్టూ గడ్డిని లేదా ఆకులను పరచాలి.
- నాలుగు వారాల తరవాత కుండీలోని మట్టికి నత్రజని అధికంగా ఉన్న ఎరువును కలిపితే ఆకులు పెద్దగా వస్తాయి.
- కుండీని వేడిగా ఉండే ప్రదేశంలో ఉంచితే మొక్క బాగా పెరుగుతుంది.

సౌందర్యం

గంధం చర్మానికి వరం!

చర్మ సమస్యలను నివారించడంలో, శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో గంధం అద్భుతంగా పనిచేస్తుంది. మొటిమలను నివారించి ముఖాన్ని ప్రకాశవంతంగా మార్చేందుకు గంధంతో పాటించాల్సిన చిట్కాల గురించి తెలుసుకుందాం!

- ఒక గిన్నెలో ఒక చెంచా గంధం పొడి, చిటికెడు పసుపు, చిటికెడు కర్పూరం పొడి, రెండు చెంచాల నీళ్లు కలిపి ఆ మిశ్రమాన్ని రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే మొటిమలు రావు.
- ఒక చెంచా గంధం పొడికి ఒక చెంచా కొబ్బరి నూనె కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి సున్నితంగా మర్దన చేస్తే మొటిమల వల్ల వచ్చే మచ్చలు పోతాయి. ఎండ వల్ల ఏర్పడే నలుపుదనం, కళ్ల కింద నల్లని వలయాలు తగ్గుతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల ముల్తానీ మట్టి, రెండు చెంచాల గంధం పొడి వేసి మూడు చెంచాల గులాబీ నీళ్లు చల్లుతూ బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని



ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకుంటే చర్మం నిగారిస్తుంది. నుదుటి మీద, పెదాల చుట్టూ ముడతలు రావు. మెడ భాగంలో నలుపు తగ్గుతుంది.
- ఒక గిన్నెలో అరచెంచా గంధం పొడి, అరచెంచా ముల్తానీ మట్టి, ఒక చెంచా టమాటా రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పది నిమిషాల తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం మీద జిడ్డు వదిలిపోతుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.

వికసిత పద్మాలు

నృత్యంలో కొత్త ధోరణులకు శ్రీకారం చుట్టినవారొకరు, అంతరించిపోతున్న కళారూపానికి నవతరంలో ప్రాచుర్యం కల్పిస్తున్నవారు మరొకరు, మత్తుమందుల బారి నుంచి యువతను కాపాడడానికి పాటుపడుతున్న ఒక మహిళ, సంగీత రంగంలో ప్రయోగశీలి, గ్రామస్వరాజ్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం పరితపిస్తున్న గాంధీయవాది...
ఈ ఏడాది పద్మ పురస్కారాలను అందుకోనున్న కొందరు విశిష్ట మహిళల పరిచయాలివి.



కథక్‌లో విప్లవ కెరటం

"నృత్యం ఒక సజీవమైన కళారూపం. దానిలో నిరంతరం మార్పులు వస్తూనే ఉండాలి. అలాంటి మార్పులను మనం స్వాగతించాలి" అంటారు కుముదినీ రజనీకాంత్ లాఖియా. కథక్ నృత్యంలో 'రెబల్' అనే పేరు ఆమెకు ఉంది. ఈ సంగతి ఎవరైనా ప్రస్తావిస్తే "నేనెప్పుడూ సంప్రదాయాన్ని ఉల్లంఘించలేదు. అయితే ప్రజలను ఆకట్టుకోవడానికే పరిమితం కాకుండా సంప్రదాయ పరిధిలోనే మరింత కొత్తదనాన్ని వెతకడానికి ప్రయత్నిస్తూ ఉంటాను" అని చెబుతారామె. సమకాలీన కథక్ నృత్యానికి మార్గదర్శిగా ఖ్యాతిపొందిన 94 ఏళ్ళ కుముదిని 1930లో ముంబయిలో జన్మించారు. ఆమె తల్లి లీల శాస్త్రీయ గాయని. కుముదినిని ఏడేళ్ళ వయసులో కథక్ శిక్షణలో ఆమె తల్లి చేర్చారు. లాహోర్, అలహాబాద్, తదితర ప్రాంతాల్లో పలువురు గురువుల వద్ద కుముదిని నృత్యాన్ని అభ్యసిస్తూనే చదువు కొనసాగించారు. ఆ తరువాత నాటి ప్రసిద్ధ నర్తకుడు రామ్‌గోపాల్ బృందంతో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. 1967లో 'కదంబ్ నృత్య, సంగీత పాఠశాల'ను ఏర్పాటు చేసి వేలమందిని కళాకారులుగా తీర్చిదిద్దారు. అదితి మంగళ్ దాస్, సంధ్యా దేశాయ్, ఇషిరా పరీఖ్, వైష్ణవి త్రివేది తదితర ప్రముఖ కథక్ నర్తకులు ఆమె శిష్యులే. రజనీకాంత్ లేఖియాతో వివాహమయ్యాక... అహ్మదాబాద్‌లో కుముదిని స్థిరపడ్డారు. అక్కడే తన స్కూల్ కార్యకలాపాలను కొనసాగించారు. నృత్యనిర్దేశకురాలిగా అనేక వినూత్నమైన, సామాజికమైన అంశాలతో ప్రదర్శనలకు రూపకల్పన చేశారు. అప్పట్లో ఆమె చేసిన ప్రయోగాలు కథక్ నృత్యంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికాయి. అయితే తీవ్రమైన ప్రతిఘటనను కూడా ఆమె ఎదుర్కోవాల్సి వచ్చింది. "పురాణ కథలను విడిచిపెట్టి, సాంఘిక సమస్యలను ఎంచుకున్నందుకు విమర్శకులు నా మీద విరుచుకుపడ్డారు. అదే



విమర్శకులు పాతికేళ్ళ తరువాత... 'కుముదిని కథక్ నృత్యానికి రక్షకురాలు' అంటూ పొగిడారు. అంటే నేను వాళ్ళ కన్నా పాతికేళ్ళు ముందున్నాననే కదా అర్థం! అప్పట్లో నేను చేసిన ప్రయోగాలు నా గురువులకు కూడా నచ్చలేదు. "ఇది కథక్ కాదు" అనేవారు. తరువాత వాళ్ళే కాదు, ప్రతి ఒక్కరూ అదే మార్గాన్ని అనుసరించారు. కానీ వాటికి మూలకర్త నేననేది ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే అనుకరణ కన్నా గొప్ప ప్రశంస మరేం ఉంటుంది?" అంటారు కుముదిని. 'సంగీత నాటక అకాడమీ అవార్డ్', 'కాళిదాస సమ్మాన్'తో సహా ఎన్నో పురస్కారాలను ఆమె అందుకున్నారు. 1987లో 'పద్మశ్రీ', 2010లో 'పద్మభూషణ్' అందుకున్న కుముదినికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'పద్మవిభూషణ్'ను ప్రకటించింది.



సంగీతమే సర్వస్వం



కామాక్షి ఓమనకుట్టి అమ్మకు గతం, వర్తమానం, భవిష్యత్తు... అన్నీ సంగీతమే. తండ్రి మలబార్ గోపాలన్ నాయర్ గొప్ప సంగీత విద్వాంసుడు. తల్లి, అన్న శాస్త్రీయ సంగీతంలో నిపుణులు. అదే బాటలో బాల్యం నుంచే సంగీతం అభ్యసించారు ఓమనకుట్టి. అయితే ఆమె ప్రభుత్వ ఉద్యోగి అయితే బాగుంటుందనుకున్నారు తల్లితండ్రులు. వారి మాటను గౌరవిస్తూ జువాలజీలో డిగ్రీ చేస్తూనే... తన అభిరుచికి అనుగుణంగా 'గాన ప్రవీణ కోర్సు'లో చేరారు. రెండిటిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వెంటనే ఆమెకు తిరువనంతపురం ప్రభుత్వ మహరాజా కాలేజీలో మ్యూజిక్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత సంగీతంలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి చేశారు. ఉద్యోగ జీవితంలో అంచెలంచెలుగా ఎదిగి... కేరళ విశ్వవిద్యాలయంలో సంగీత విభాగాధిపతిగా వ్యవహరించారు. బోధన, పరిశోధన తనకు రెండు ప్రాణాలంటారు ఓమనకుట్టి. కొన్ని వందల పరిశోధన పత్రాలను ఆమె వెలువరించి, ఆ రంగానికి విలువైన సేవలు అందించారు. స్వాతి తిరునాళ్ కీర్తనలకు ప్రాచుర్యం కల్పించడానికి అపారమైన కృషి చేశారు. కేవలం స్వాతి తిరునాళ్ కృతులతో 300కు పైగా కచ్చేరీలను ప్రపంచవ్యాప్తంగా చేశారు. త్యాగరాజ పంచరత్న కృతుల తరహాలో... 2015లో 500 మంది విద్యార్థులతో తిరువనంతపురంలో 'స్వాతి పంచరత్న కీర్తనల'తో ఒక కార్యక్రమం నిర్వహించారు. మానవులు, జంతువుల మనస్తత్వం మీద సంగీతం చూపే ప్రభావాన్ని తెలుసుకోవడానికి ఆమె తీవ్ర కృషి చేశారు. అందులో భాగంగా 'సంగీత భారతి' అనే సంస్థను స్థాపించి, మ్యూజిక్ థెరపీలో పరిశోధనలు చేపట్టారు. అలాగే ఆ సంస్థ ద్వారా వర్ధమాన సంగీత కళాకారులకు సాధికారమైన సంగీత శిక్షణ కూడా అందజేశారు. మ్యూజిక్ థెరపీలో ఆమె చేస్తున్న ప్రయోగాలను గుర్తించిన తిరువనంతపురంలోని పంకజ కస్తూరి ఆయుర్వేదిక్ వైద్య కళాశాల' అధికారులు... సంగీతం ద్వారా వైద్య చికిత్స అందించడంలో సహకరించడం కోసం తమ సంస్థలో 'సీనియర్ మోస్ట్ ఫ్యాకల్టీ'గా ఓమనకుట్టిని నియమించారు. ప్రముఖ నేపథ్య గాయనులు కె.ఎస్. చిత్ర, బి.అరుంధతి తదితరులెందరో ఆమె శిష్యులు. ఆమె సోదరులు ఎం.జి.రాధాకృష్ణన్, ఎం.జి.శ్రీకుమార్ మలయాళంలో ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు. కేంద్ర ప్రభుత్వం తనకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడంపై స్పందిస్తూ "ఈసారి పద్మశ్రీకి నన్ను పరిగణనలోకి తీసుకుంటారని ఆశించలేదు. ఎందుకంటే గతంలో నా పేరు నామినేట్ అయినా ఆ అవార్డు రాలేదు. ఇప్పుడు అందుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది. 'స్వాతి మ్యూజిక్ అవార్డ్', 'చెంబై అవార్డ్' లాంటి అసంఖ్యాకమైన అవార్డులు నేను స్వీకరించాను. ఈ గౌరవం వాటన్నిటిలోనూ ప్రత్యేకంగా నిలుస్తుంది. సంగీత అభ్యాసాన్ని, బోధనను జీవితాంతం కొనసాగించాలనే నా కోరికను ఇది మరింత బలోపేతం చేసింది" అన్నారు ఓమనకుట్టి.

అమ్మ మనసు



మత్తుమందులకూ, మద్యానికి బానిసలై చిన్న వయసులోనే రాలిపోతున్న వారిని చూసిన జుమ్దే యోమ్గామ్ గామ్లిన్ మాతృ హృదయం చలించిపోయింది. ఆ మహమ్మారుల నుంచి వారికి విముక్తి కలిగించాలనే తపన ఆమెను నిలువనివ్వలేదు. తనలాంటి మరో పది మంది తల్లులతో కలిసి 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్' పేరుతో 2013లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఆలో పట్టణంలో ఒక ఎన్జీవోను ఆమె స్థాపించారు. ఆ తరువాత దాని పేరును 'మదర్స్ విజన్'గా మార్చారు. ప్రభుత్వోద్యోగిగా పని చేస్తూనే... ఈ సంస్థ కార్యకలాపాలను కొనసాగించారు. మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యాసంస్థల్లో పిల్లలకు అవగాహన కలిగించడం, సామాజిక, చర్చా సమావేశాలను ఏర్పాటు చేయడంతోపాటు డ్రగ్స్ బాధితులకోసం 'డిఅడిక్షన్, ఆఫ్టర్ కేర్' కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ముప్పై పడకలు ఉన్న ఈ కేంద్రం ద్వారా 700 మందికి పైగా ఆ వ్యసనాల నుంచి బైటపడ్డారు. దీనితోపాటు రెండువేల మంది మహిళలకు ఒకేషనల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, వారి ఆర్థిక స్వావలంబనకు దోహదం చేశారు. స్థానిక మహిళలు, సంఘాలు, జిల్లా అధికారుల సాయంతో... అప్పర్ సియాంగ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా ఉన్న మార్జువానా, ఓపియం సాగును నిర్మూలించారు. డ్రగ్స్, మద్యానికి వ్యతిరేకంగానే కాకుండా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహనను పెంచడం కోసం 'మదర్స్ విజన్' విస్తృతంగా పని చేస్తోంది. మహిళలకు జీవనోపాధి అవకాశాల పెరుగుదలకోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. "మత్తు పదార్థాలకు బానిసలైన వారిని వాటి నుంచి బయటకు తీసుకురావడం అనేది క్లిష్టమైన, అనేక సవాళ్ళతో కూడుకున్న అంశం. బాధితులు, వారి కుటుంబాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు కలిసి పని చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. బాధితులను ముందుగానే గుర్తించి, వారికి సమగ్రమైన చికిత్స అందించడం, చికిత్సానంతర సహాయాన్ని అందించడం కీలకం అవుతుంది" అని చెబుతున్న జుమ్దే జిల్లాపరిషత్ సభ్యురాలుగా కూడా సేవలందించారు. కిందటి ఏడాది .ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ రిఫార్మ్స్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్' (ఐఎస్ఆర్‌హెచ్ఇ) నుంచి 'భారత్ విభూషణ్' పురస్కారాన్ని ఆమె స్వీకరించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తనకు 'పద్మశ్రీ'ని ప్రకటించడంపై స్పందిస్తూ "ఈ పురస్కారం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. నిజాయితీతో కూడిన మంచి ప్రయత్నాలకు గుర్తింపు లభించకపోవడం అనేది జరగదు. ఎప్పటికైనా వాటికి ప్రతిఫలం ఉంటుంది. దానికి ఇదే నిదర్శనం" అని చెప్పారు యాభై తొమ్మిదేళ్ళ జుమ్దే.

మహాత్ముడి అడుగుజాడల్లో...



రాధా బహిన్ భట్‌కు పద్మశ్రీ పురస్కారం వచ్చిందన్న వార్త వినగానే, ఆమె గురించి తెలిసినవారిలో "అదేమిటి? ఇప్పటివరకూ ఆమెకు ఆ గౌరవమే దక్కలేదా?" అని విస్మయం వ్యక్తం చేసేవారే ఎక్కువ. ఎందుకంటే... జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో గౌరవాలను ఆమె ఇప్పటికే అందుకున్నారు. గతంలో నోబెల్ శాంతి బహుమతికి సైతం ఆమె నామినేట్ అయ్యారు. వీటన్నిటికన్నా తనను సంతోషపరిచేవి తన ఉద్యమ ఫలితాలు, తద్వారా ప్రజలకు చేకూరే ప్రయోజనాలేనంటారు 'పర్వతాల గాంధీ'గా పేరుపొందిన రాధా బహిన్. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరా జిల్లాలో దుర్కా గ్రామంలో 1933లో ఆమె జన్మించారు. చిన్నవయసునుంచి ఉపాధ్యాయురాలు కావాలనేది ఆమె కోరిక. ఇంటర్ పూర్తి చెయ్యగానే... కౌసానీ గ్రామంలోని 'లక్ష్మీ ఆశ్రమ్' (కస్తూర్బా మహిళా ఉత్థాన్ మండల్)లో టీచర్‌గా చేరారు. గాంధీ శిష్యురాలైన సరళా బెహెన్ ఈ ఆశ్రమ వ్యవస్థాపకురాలు. గాంధేయవాదం పట్ల రాధా బహిన్‌కు ఉన్న ఆసక్తి... సరళ మార్గదర్శకత్వంలో మరింత బలపడింది. తరువాత అదే సంస్థకు 1966 నుంచి 1989 వరకు కార్యదర్శిగా వ్యవహరించారు, ప్రస్తుతం అధ్యక్షురాలుగా ఉన్నారు. 'సర్వోదయ-భూదాన్' ఉద్యమంలో 1957 నుంచి 1961 వరకూ ఆమె చురుగ్గా పాల్గొన్నారు. ఆచార్య వినోబా భావేతో కలిసి ఉత్తరప్రదేశ్, అసోం రాష్ట్రాల్లో సుదీర్ఘ పాదయాత్రల్లో భాగస్వామి అయ్యారు. ఈ యాత్రల సందర్భంగా గ్రామస్వరాజ్యం, మద్యవ్యతిరేక ఉద్యమం, మహిళా సాధికారత గురించి ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ తరువాత గ్రామీణ పునర్నిర్మాణం, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాలు, చిప్కో ఉద్యమం, తెహ్రీ డ్యామ్ ఉద్యమం, గనుల అక్రమ తవ్వకాల వ్యతిరేక ఉద్యమాలు, నదుల పరిరక్షణ ఉద్యమం... ఇలా ఎన్నో కార్యక్రమాలకు సారథ్యం వహించారు. అడవుల పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెబుతూ 1975లో 75 రోజుల పాటుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. 2006 నుంచి 2010 వరకూ ఉత్తరాఖండ్‌లోని నదులు, హిమాలయాలపై ఆమె సర్వే నిర్వహించారు. నదులపై హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గత ఆరు దశాబ్దాలుగా నార్వే, ఫిన్లాండ్, అమెరికా, డెన్మార్క్, కెనడా, స్వీడన్ తదితర అనేక దేశాల్లోని మానవ, మహిళా హక్కుల ఉద్యమాలతో మమేకమయ్యారు. అల్మోరా, పితోరాఘడ్ జిల్లాల్లో లక్షా అరవై వేల మొక్కలను నాటి... పర్యావరణ పరిరక్షణకు దోహదం చేశారు. మారుమూల, పర్వత ప్రాంతాల్లో పాతిక బాలమందిర్‌లను ఏర్పాటు చేసి, 15 వేల మందికి పైగా పిల్లలకు విద్యను అందించారు. 'హిమాలయ సేవా సంఘ్', 'గాంధీ పీస్ ఫౌండేషన్', 'గాంధీ మెమోరియల్ ఫండ్', 'కస్తూర్బా ట్రస్ట్' లాంటి ఎన్నో సంస్థలతో కలిసి ఆమె పని చేస్తున్నారు. గుజరాత్‌లోని 'సేవా ఆశ్రమ్'లో నివసిస్తున్న రాధా బహిన్ 'పద్మశ్రీ' పురస్కారాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ప్రస్తుతం 'నౌలా' పేరుతో కౌసానీ చుట్టుపక్కల ఉన్న జలవనరులు, కాలువల పునరుద్ధరణ లక్ష్యంగా ఉద్యమాన్ని ఆమె సాగిస్తున్నారు.

ఎనభయ్యేళ్ళ కళాయజ్ఞం

అర్ధరాత్రి దాటింది. చీకటి పడగానే ఊళ్ళో రచ్చబండ దగ్గరకు చేరుకున్న ప్రేక్షకులెవరూ అక్కడి నుంచి కదల్లేదు. వారి ఆసక్తిని గ్రహించిన భీమవ్వ దొడ్డబల్లప్ప సిలేక్యా తార తన వయోభారాన్ని లెక్క చెయ్యకుండా ప్రదర్శన ఇస్తూనే ఉన్నారు. మధ్యమధ్యలో కథలు చెబుతూ వారిని అలరిస్తూనే ఉన్నారు. తెల్లవారుజామువరకూ కొనసాగిన 'తొగలు గొంబెయాట' (తోలు బొమ్మలాట) ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ముగిసింది. భీమవ్వలో అలసట కన్నా ఆనందమే ఎక్కువగా కనిపించింది. ఎనభయ్యేళ్ళుగా ఆమె ఆ కళా యజ్ఞంలో ఏమాత్రం అలసిపోలేదు. పద్నాలుగేళ్ళ వయసులో... కుటుంబ వారసత్వంగా అందిపుచ్చుకున్న తోలుబొమ్మలాటకు ఆమె కొత్తదనాన్ని జోడించారు. రామాయణ, మహాభారత గాథలను తోలుబొమ్మలాట రూపంలో చెబుతున్నారు. ప్రాథమికమైన చదువుకూడా లేని ఆమెకు 'మహా భారతం'లోని పద్దెనిమిది పర్వాల గురించి క్షుణ్ణంగా తెలుసు. ఆ ఘట్టాలను తోలుబొమ్మలతో ప్రదర్శించడంతోపాటు... మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక, పర్యావరణ అంశాలను కూడా తన ప్రదర్శనలో విళీతం చేసి, నవతరాన్ని ఆకర్షిస్తున్నారు. ఉత్తర కర్ణాటకలోని మోరనలా గ్రామంలో భీమవ్వ జన్మించారు. ఆ గ్రామానికి చెందిన వారు తరతరాలుగా తోలుబొమ్మలాటలో ప్రసిద్ధి చెందారు. అదే మార్గాన్ని భీమవ్వ అనుసరించారు. మన దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, ఫ్రాన్స్, ఇరాక్, ఇరాన్, హాలెండ్, స్విట్జర్లాండ్, జర్మనీ, సౌదీ అరేబియా, జపాన్... ఇలా కొన్ని పదుల దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి 'భేష్' అనిపించుకున్నారు. అంతేకాదు, ఈ కళ అంతరించిపోకుండా ఉండాలనే ఆలోచనతో ఎందరికో శిక్షణ ఇచ్చారు. భీమవ్వ కుమారులు విరూపాక్ష, యంకప్ప, కేశప్పలతో పాటు, మనుమలు, మునిమనుమలు కూడా ఇప్పుడు ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు. 'జానపదశ్రీ', 'సంగీత, నాటక అకాడమీ', 'కర్ణాటక రాజ్యోత్సవ' అవార్డులతో సహా ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఆమెకు ప్రకటించింది. దీనిపై స్పందిస్తూ "నా కళకు ఇంత పెద్ద పురస్కారం లభించడం గర్వంగా అనిపిస్తోంది. అది కళకు లభించిన గౌరవం. తోలుబొమ్మలాటకు దీనివల్ల మరింత ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నాను" అన్నారు భీమవ్వ. ఆధునిక వినోద రూపాల మధ్య ఉనికిని కోల్పోతున్న తోలుబొమ్మలాటకు పూర్వవైభవం తెచ్చిన ఘనత ఆమెదేనంటారు అభిమానులు.



పిల్లలు నోట్లో వేళ్లు పెట్టుకుంటున్నారా!

చిన్న పిల్లలు సాధారణంగా బొటనవేలుని లేదంటే చేతి వేళ్లన్నీ టినీ నోట్లో పెట్టుకొని చప్పరిస్తూ ఉంటారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. పిల్లల్లో ఈ అలవాటును మాన్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలు ఇవి...



- కాకరకాయ రసం లేదా కరక్కాయ రసాన్ని చేతి వేళ్లకి పట్టిస్తే చేదు రుచి నచ్చక పిల్లలు నోట్లో వేళ్ల పెట్టుకోవడం మానేస్తారు.
- పిల్లలు ఏ వేలుని నోట్లో పెట్టుకుంటున్నారో గమనించి దానికి పలుచని వస్త్రాన్ని చుట్టడం లేదా వేళ్లన్నింటిని కలిపి కట్టులా కట్టడం వల్ల పిల్లల్లో ఈ అలవాటు తగ్గుతుంది.
- అరచేయి మొత్తాన్ని పూర్తిగా కప్పే గ్లోవ్స్ వేయడం వల్ల కూడా ప్రయోజనం కనిపిస్తుంది.
- నెలల పిల్లలు ఆకలి అనిపించినప్పుడు బొటనవేలిని నోట్లో పెట్టుకుంటారు. వారి ఆకలి వేళలు గుర్తించి సమయానుసారం పాలు పట్టడం వల్ల క్రమంగా ఈ అలవాటుని మానేస్తారు.
- నోట్లో వేళ్ల పెట్టుకున్నవెంటనే వాటిని తీసివేసి పిల్లల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తే ఫలితం ఉంటుంది.
- పిల్లలు ఓదార్పు లేదా తోడు కోరుకున్నప్పుడు, మనసులో భయాన్ని వ్యక్తపరిచేముందు ఇలా నోట్లో వేళ్ల పెట్టుకుంటూ ఉంటారు. అలాంటప్పుడు తల్లిదండ్రులు పక్కన ఉండి ధైర్యం చెబితే ఈ అలవాటుని మానుకుంటారు.
- శాశ్వత దంతాలు వచ్చే సమయం వరకూ పిల్లలు ఈ అలవాటుని కొనసాగిస్తే పలువరస క్రమం తప్పుతుంది. పళ్ల మధ్య సందులు ఏర్పడతాయి. కాబట్టి తల్లిదండ్రులు తగిన ప్రయత్నం చేసి ఈ అలవాటుని మాన్పించాలి.

చిత్రజ్యోతి
SINCE 1965

ధనుష్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు



హీరోయిన్ నయనతార డాక్యుమెంటరీ కోసం తాను నిర్మాతగా తెరకెక్కించిన 'నానుమ్ రౌడీదాన్' మూవీలోని మూడు సెకన్ల సన్నివేశాలను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ రూ.10 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని హీరో ధనుష్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని కొట్టివేయాలని కోరుతూ ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

చెన్నై, ఆంధ్రజ్యోతి

అల్లు అరవింద్.. నా తండేల్



అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన 'తండేల్' చిత్రం ఫిబ్రవరి 7న విడుదలవుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ సినిమా ట్రైలర్‌ను వైజాగ్‌లోని రామా పిక్చర్ ప్యాలెస్‌లో విడుదల చేశారు. ప్రేమ, దేశభక్తి అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఈ కార్యక్రమంలో నాగచైతన్య మాట్లాడుతూ 'ఏడాదిన్నర నుంచి నా లైఫ్‌లో నిజమైన తండేల్ అల్లు అరవింద్‌గారే. ఈ చిత్ర నిర్మాణంలో ఆయన ఇన్‌వాల్వ్‌మెంట్ చాలా ఉంది. నేను వైజాగ్ అమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకున్నా. మా ఇంట్లో రూలింగ్ వాళ్లదే. తండేల్ సినిమా వైజాగ్‌లో బాగా ఆడాలి. లేకపోతే ఇంట్లో పరువు పోతుంది' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'చాలా కష్టపడి ఈ సినిమా తీశాం. మీరు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు.

చాలా ఎంజాయ్ చేస్తారు



విశాల్ హీరోగా సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మదగజరాజా'. వరలక్ష్మీ శరత్ కుమార్, అంజలి హీరోయిన్లు. జెమిని కిరణ్ నిర్మాత. తమిళంలో విడుదలై భారీ విజయాన్ని సాధించింది. ఈ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా ఈనెల 31న తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అంజలి మాట్లాడుతూ 'సినిమాను ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు' అన్నారు.

17 రోజుల్లో 15 కోట్ల మంది

నేడు మౌని అమావాస్య.. 10కోట్ల మంది వస్తారని అంచనా..

మహా కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

మహాకుంభ్ నగర్, జనవరి 28: మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నెల 13నుంచి ఇప్పటివరకు 17 రోజుల్లో 15 కోట్ల మందికి పైగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. బుధవారం మౌని అమావాస్యను పురస్కరించుకొని 10కోట్ల మందికి పైగా వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది. ఈ పర్వదినం నాడు ఉదయం 6.45 గంటలకు హెలికాప్టర్ల నుంచి పూల వర్షం కురిపించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 26 వరకూ కొనసాగే ఈ మహా కుంభమేళాలో 45కోట్ల మందికి పైగా తరలివస్తారని అంచనా. మరోవైపు, కుంభమేళాకు వచ్చేవారందరికీ అంతరాయం లేని కాల్స్‌తో పాటు మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందించడానికి టెలికాం కంపెనీలు 92 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేశారు. 328 కొత్త టవర్లు ఏర్పాటు చేశారు.




అంతా ఉచితమంటే పాలన సాగేదెలా?

» కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేస్తున్న ఐదు ఉచిత గ్యారెంటీలతో కోట్లాది మందికి ప్రయోజనం కలుగుతోందని, ఇంకా ఉచితమంటే ప్రభుత్వాన్ని ఎలా నడపాలని కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇప్పటికే విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని, కావేరి నీటిని కూడా ఉచితంగా ఇవ్వమంటే ఎలా సాధ్యమని శివకుమార్ ప్రశ్నించారు. ఎంతోకొంత బిల్లు చెల్లించాలి కదా అన్నారు. జలమండలికి ఏటా రూ.వెయ్యి కోట్ల నష్టం వస్తోందని, నీటి చార్జీలు పెంచడం అనివార్యమని స్పష్టం చేశారు. నష్టాల్లో ఉన్న జలమండలికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించడం లేదని తెలిపారు.

లోకం తీరు



అక్రమ సంతానమైనా కూడా..
'ఆ తండ్రి'ని డీఎన్ఏ పరీక్షకు ఆదేశించలేం

» తన తండ్రి ఎవరో తేల్చాలన్న యువకుడి పిటిషన్‌పై సుప్రీం

» అది వ్యక్తి గోప్యతకు భంగకరమని స్పష్టీకరణ

నూఢిల్లీ, జనవరి 28: తాను ఫలానా వ్యక్తికి, తన తల్లికి పుట్టిన అక్రమ సంతానమని నమ్ముతున్నానని, అతను తన తండ్రో కాదో డీఎన్ఏ పరీక్ష ద్వారా తేల్చాలని ఒక యువకుడు పెట్టుకున్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇది మూడో వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత గోప్యత వ్యవహారమని, అతని అనుమతి లేకుండా డీఎన్ఏ పరీక్ష నిర్వహించడం కుదరదని స్పష్టం చేసింది. ఈ కేసులో తల్లి కూడా కుమారుడి వాదనతో ఏకీభవిస్తున్నప్పటికీ ఆ ఒక్క కారణంతో డీఎన్ఏ పరీక్షకు అనుమతిస్తే.. ఆ ఉత్తర్వులు భవిష్యత్తులో దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. కేరళలోని కోచికి చెందిన మహిళ 1989లో వివాహం చేసుకుని, 1991లో ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. 2001లో ఆమెకు కుమారుడు జన్మించాడు. 2003లో భర్తతో విడిపోయింది. 2006లో వారికి విడాకులు మంజూరయ్యాయి. వెంటనే ఆమె కోచి మున్సిపల్ అధికారులను కలిసి కుమారుడి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంలో తండ్రి పేరు మార్చాలని కోరింది. వివాహ బంధంలో ఉండగానే తాను వివాహేతర సంబంధంలో ఉన్నానని, ఆ సంబంధం వల్ల పుట్టిన సంతానమే ఈ అబ్బాయి అని చెప్పింది. 2007లో స్థానిక కోర్టు ఆ మూడో వ్యక్తికి, పిల్లాడికి డీఎన్ఏ పరీక్ష చేయాలని ఆదేశించింది. దాంతో ఆ మూడో వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. పిల్లాడు కడుపులో పడిన సమయంలో భార్యాభర్తలు కలిసి లేరని నిరూపించగలిగితేనే మూడో వ్యక్తిని డీఎన్ఏ పరీక్ష చేసుకోవాలని ఆదేశించగలమని హైకోర్టు చెప్పింది. భార్యాభర్తలు కలిసి ఉంటే విడాకులు పొందిన 280 రోజుల్లోపు పుట్టిన పిల్లాడు కూడా ఆ తండ్రికి సక్రమ సంతానమే అవుతాడని సాక్ష్యాధారాల చట్టాన్ని ఉటంకిస్తూ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కుమారుడు మూడో వ్యక్తి నుంచి భృతి కోరుతూ 2015లో కుటుంబ న్యాయస్థానంలో పిటిషన్ వేశాడు. తన వైద్య ఖర్చులకు, చదువుకు చట్టబద్ధమైన తండ్రి నుంచి కూడా ఎలాంటి సాయం అందడం లేదని ప్రస్తావించాడు. కుటుంబ న్యాయస్థానం తనయుడికి అనుకూలంగా తీర్పిచ్చింది. మూడో వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు కూడా భృతిని ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. పిల్లాడికి భృతి ఇచ్చే విషయంలో సక్రమ సంతానం అక్రమ సంతానం తారతమ్యం ఉండబోదని తేల్చి చెప్పింది. చట్టబద్ధమైన తండ్రి ఉన్నంత మాత్రాన కన్నతండ్రిని వెతికే హక్కు, భృతిని పొందే హక్కును అడ్డుకోలేమని స్పష్టం చేసింది. దాంతో మూడో వ్యక్తి తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ కేసును మంగళవారం సుప్రీంకోర్టు పరిష్కరించింది. పిల్లాడు కడుపులో పడిన సమయంలో ఆమెతో భర్త, మూడో వ్యక్తి ఇద్దరూ కాంటాక్టులో ఉన్నారని భావించినా కుమారుడు మాజీ భర్తకు సక్రమ సంతానమే అవుతాడని కోర్టు స్పష్టం చేసింది. మూడో వ్యక్తి అనుమతి లేకుండా డీఎన్ఏ పరీక్ష కుదరదని చెప్పింది. ప్రస్తుత కేసులో తల్లి మాజీ భర్తే అబ్బాయికి చట్టబద్ధమైన తండ్రి అని స్పష్టం చేసింది.

డేరా బాబాకు మళ్లీ పెరోల్

» జైలు నుంచి విడుదల.. ఐదేళ్లలో 14 సార్లు పెరోల్

» ఎన్నికల సమయంలోనే లభిస్తుండటంపై సందేహాలు

చండీగఢ్, జనవరి 28: అత్యాచారం, హత్య కేసుల్లో జీవితకాల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు 30 రోజుల పెరోల్ మంజూరయింది. ఆయన మంగళవారం ఉదయం 5.26 గంటలకు హరియాణాలోని సునారియా జైలు నుంచి విడుదలయ్యాడు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాం రహీమ్‌కు పెరోల్ లభించడం గమనార్హం. గతంలో కూడా హరియాణా, పంజాబ్, రాజస్థాన్‌లలో జరిగిన స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు రాంరహీమ్‌కు 20 నుంచి 50 రోజులపాటు పెరోల్ లభించింది. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పెరోల్ మీద విడుదలయ్యాడు. గత ఐదేళ్లలో మొత్తం 14సార్లు రాం రహీమ్‌కు పెరోల్ లభించింది. డేరా బాబాగా పేరొందిన ఈయనకు పంజాబ్,రాజస్థాన్,హరియాణాల్లో భారీగా అనుచరులు ఉన్నారు.

31 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జనవరి 28: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31నుంచి ప్రారంభం కానున్నాయి. ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించాక బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల 2025 సంవత్సరం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. నిర్మల రికార్డుస్థాయిలో వరుసగా ఎనిమిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

ఎస్తేర్ అనూహ్య అత్యాచారం,
హత్య కేసులో చంద్రభాన్ సనప్ నిర్దోషి

» ఏపీ యువతి హత్య కేసులో సుప్రీం కోర్టు సంచలన తీర్పు

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ, జనవరి 28: కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎస్తేర్ అనూహ్యపై అత్యాచారం, హత్య కేసులో సుప్రీంకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ముంబైకి చెందిన నిందితుడు చంద్రభాన్ సనప్‌ను నిర్దోషిగా ప్రకటించింది. నేరం రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంటూ.. సనప్‌ను తక్షణమే విడుదల చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన 23 ఏళ్ల ఎస్తేర్ అనూహ్య ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేది. క్రిస్మస్ సెలవుల కోసం సొంతూరుకు వచ్చిన ఆమె.. విజయవాడ నుంచి రైలులో బయల్దేరి 2015 జనవరి 5వ తేదీ తెల్లవారుజామున కుర్లాలోని లోకమాన్య తిలక్ టెర్మినల్‌కు చేరుకుంది. ఆతర్వాత కొన్ని రోజులపాటు అదృశ్యమైన ఆమె.. పదిరోజుల తర్వాత ముంబైలోని కంజూర్ మార్గ్ వద్ద శవంగా కనిపించింది. ఎస్తేర్‌ను కిడ్నాప్ చేసి ఆమెపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ట్యాక్సీ డ్రైవర్ చంద్రభాన్ సనప్ ఆమెను హాస్టల్ వద్ద డ్రాప్ చేస్తానని నమ్మించి తీసుకెళ్లిన ఆమెపై అత్యాచారం, హత్య చేశాడన్న ఆరోపణలపై అతన్ని అరెస్టు చేశారు. ఈ కేసులో 2015లో ప్రత్యేక మహిళా కోర్టు సనప్‌కు మరణ శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును బాంబే హైకోర్టు కూడా సమర్థించింది. అయితే సనప్.. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. కాగా, ప్రాసిక్యూషన్ కథనంలో లోపాలను గుర్తించిన సుప్రీంకోర్టు మంగళవారం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది.

ఆరోపణలు ఇవే...: ఎస్తేర్ అనూహ్య.. లోకమాన్య తిలక్ టెర్మినల్‌లో దిగిన తర్వాత హాస్టల్‌కు వెళ్లేందుకు కారు మాట్లాడుకుంది. అయితే టాక్సీ ఉందని చెప్పిన చంద్రభాన్ కారు కాకుండా తన మోటర్‌సైకిల్‌పై తీసుకెళతానని ఆమెను ఒప్పించాడు. మార్గమధ్యంలో బైక్ ఆపి ఆమెను సమీప పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేయబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో తలపై కొట్టి.. చున్నీ మెడకు బిగించి హత్యచేశాడు. తర్వాత ఆమె మృతదేహాన్ని దహనం చేయడానికి ప్రయత్నించాడన్న ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. 10 సంవత్సరాల తర్వాత ఈ కేసులో మరణశిక్ష పడిన నిందితుడిపై ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాలు చూపని కారణంగా అతన్ని నిర్దోషిగా విడుదల చేస్తూ సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. ఈ ఘటనపై ఎస్తేరు తండ్రి జొనాథన్ ప్రసాద్ మాట్లాడుతూ 'మా కుమార్తె కనిపించకుండా పోయిన.. పది రోజుల తర్వాత ఆమె మృతదేహం లభ్యమైంది. ఆ సమయంలో మేం ఎదుర్కొన్న మానసిక క్షోభ.. ఏ తల్లిదండ్రులూ ఎదుర్కోకూడదు' అన్నారు.

భారత్‌పై సుంకాలు విధిస్తాం!

చైనా సహా ఇతర దేశాలపై కూడా.. డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

» ఆయా దేశాలతో అగ్రరాజ్యానికి నష్టం జరుగుతోందన్న అమెరికా అధ్యక్షుడు

» అమెరికన్లకు ఆదాయపన్ను రద్దు!

» రిపబ్లికన్ సభ్యుల సదస్సులో వెల్లడి

వాషింగ్టన్, జనవరి 28: అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాలపై సుంకాల బాంబు పేల్చారు. ముఖ్యంగా అగ్రరాజ్యంతో బలమైన వాణిజ్య బంధాన్ని కొనసాగిస్తున్న భారత్‌పై భారీ ఎత్తున సుంకాలు విధిస్తామని ప్రకటించారు. భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతర దేశాలపై భారీగా సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ తెలిపారు. "ఆయా దేశాలు, పౌరులతో మనకు చాలా నష్టం జరుగుతోంది. అదేసమయంలో ఆ దేశాలు బాగుపడుతున్నాయి" అని వ్యాఖ్యానించారు. దేశంలోకి సంపద వచ్చేందుకు ఆయా దేశాలపై భారీగా సుంకాలు విధించాల్సిందేనని ఉద్ఘాటించారు. "ఇతర దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా సుంకాల రారాజు. ఈ జాబితాలోనే భారత్, బ్రెజిల్ సహా పలు దేశాలు ఉన్నాయి. ఈ విధానాన్ని ఇక మీదట కొనసాగకుండా చూడాలి. ఎందుకంటే అమెరికాను అన్ని విధాలా ముందు నిలపాలి. అమెరికా ఫస్ట్!" అని నొక్కి చెప్పారు. ఇక, అమెరికా ప్రజలపై ఆదాయ పన్ను భారాన్ని రద్దు చేయాల్సి ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. "మన ప్రజలను ధనవంతులుగా, శక్తిమంతులుగా తీర్చిదిద్దే వ్యవస్థను పునరుద్ధరించాల్సిన సమయం ఇదే" అని అన్నారు. విదేశాలు, విదేశీ పౌరులపై సుంకాలు, పన్నులు వేయడం ద్వారా అమెరికా తనను తాను సుసంపన్నం చేసుకుంటుందని తెలిపారు. ఈ మేరకు ఫ్లోరిడాలో సోమవారం జరిగిన రిపబ్లికన్ సభ్యుల సదస్సులో ట్రంప్ ప్రకటించారు. "1913కు ముందు దేశంలో ఎలాంటి ఆదాయపన్ను లేదు. కేవలం సుంకాల వ్యవస్థే ఉంది. ఇదే అమెరికాను అత్యంత సుసంపన్న దేశంగా మార్చింది. 1913 నుంచే ఆదాయపన్ను ప్రవేశించింది" అని ట్రంప్ చెప్పారు. అమెరికాను సుసంపన్నం చేసేందుకు విదేశీ పౌరులపై పన్నులు విధిస్తామని పేర్కొన్నారు. "ఇతర దేశాలను సంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు విధించే బదులు.. మన వారిని సంపన్నం చేసేందుకు విదేశాలపై పన్నులు, సుంకాలు విధించాలి. ఇలా చేయడమే సరైంది కదా?!" అని వ్యాఖ్యానించారు. సుంకాలు, పన్నుల నుంచి మినహాయింపు కోరుకునే వారు ఇక్కడే ప్రాజెక్టులను పెట్టాలన్నారు.



ఫిబ్రవరిలో మోదీ వస్తున్నారు..

అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన భారత పౌరుల విషయంలో ఆ దేశం సరైన చర్యే తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. "అక్రమ వలసలపై భారత ప్రధాని మోదీతో చర్చించా. ఈ విషయంలో ఏది సరైన చర్యో భారత్ అలానే చేస్తుందని ఆశిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరిలో మోదీ అమెరికాకు రానున్నట్టు చెప్పారు. ఆ నెలలో ఎప్పుడైనా ఆయన రావొచ్చని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు బ్రేక్

అమెరికా సైనిక దళాల్లో ట్రాన్స్‌జెండర్లను నియమించే విధానానికి ట్రంప్ చెక్ పెట్టారు. తన ఎగ్జిక్యూటివ్ అధికారాలను ఉపయోగించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. "ట్రాన్స్‌జెండర్లను సైనిక దళాల్లో నియమించడం ద్వారా గౌరవ ప్రదమైన, నిజాయితీ, క్రమశిక్షణతో కూడిన సైనికుల నిబద్ధతకు విఘాతం కలుగుతుంది" అని ట్రంప్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐరన్ డోమ్ క్షిపణి వ్యవస్థను నిర్మించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా విదేశాలకు చేసే అన్ని రకాల సహాయాలను నిలిపివేస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. అయితే, ఇజ్రాయెల్, ఈజిప్టులను వీటి నుంచి మినహాయించారు.

భారత్ అప్రమత్తం

భారత్ సహా ఇతర దేశాలపై భారీగా సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం అప్రమత్తమైంది. అమెరికా వాణిజ్య విధానంలో మార్పులు వస్తే ఏం చేయాలన్న దానిపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ అంతర్గత సమావేశాలు నిర్వహించింది. ట్రంప్ ప్రకటనతో భారత ఎగుమతులపై ప్రభావం పడనుందని నిపుణులు తెలిపారు. కాగా, భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 120 బిలియన్ డాలర్లకు చేరింది. ఇదిలా ఉండగా, అక్రమ వలసదారులు వస్తే భారత్ అనుమతించాలంటూ కాంగ్రెస్ పార్టీ ఇండియన్ ఓవర్సీస్ చైర్మన్ శ్యామ్ పిట్రోడా తాజాగా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.

మరణం తర్వాత ఏం జరుగుతుంది?

» తెలుసుకునేందుకు మహారాష్ట్రలో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య

నాగపూర్, జనవరి 28: "మరణం తర్వాత ఏం జరుగుతుంది?" అని తెలుసుకునేందుకు ఓ 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకుంది. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ ఘటన జరిగింది. ఆ బాలిక ఓ ప్రైవేటు స్కూల్లో 12వ తరగతి చదువుతోంది. తండ్రి ఆర్బీఐలో ఉన్నతోద్యోగి.. రీజినల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. బాలిక తల్లి గృహిణి. ఈ కుటుంబం నాగపూర్‌లోని ఛత్రపతి నగర్‌లో ఉంటోంది. మృతురాలు ఆ తల్లిదండ్రులకు ఏకైక సంతానం కావడం గమనార్హం. పోలీసులు వెల్లడించిన వివరాలు, బాలిక ఫోన్లో లభ్యమైన సమాచారం ప్రకారం.. కొన్నాళ్లుగా బాలిక ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారింది. గూగుల్‌లో చావు గురించి, విదేశీ సంస్కృతుల గురించీ అదేపనిగా సెర్చ్ చేస్తోంది. ప్రత్యేకించి ఐరోపా ప్రజల సంస్కృతిపై ఆసక్తి ఎక్కువగా ఉన్న ఆమె, తన డైరీలో విదేశీ సంస్కృతుల గురించి సవివరంగా రాసుకుంది. చావు తర్వాత ఏం జరుగుతుందనేదానిపై వెతుకుతూ.. కొన్ని వారాలుగా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలతో గడుపుతోంది. సోమవారం తెల్లవారుజామున 5:45 గంటలకు బాలిక పడకగదిలోకి ఆమె తల్లి వెళ్లిచూసేసరికి రక్తపు మడుగులో ఆమె మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు ఈ ఘటనపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి బాలిక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాలిక.. కత్తితో తన మణికట్టు మీద రెండు క్రాస్ మార్కులతో సహా ఐదు గాట్లు పెట్టుకుంది. చివరికి గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు ఆమె కర్రపిడితో కూడిన రాతితో తయారుచేసిన కత్తిని వాడింది. ఈ తరహా కత్తులు స్థానికంగా లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి కొన్నట్లు సమాచారం.

'నాడు-నేడు'.. ఫలితం మోడు!

» జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికలోని ముఖ్యాంశాలు

- 6-14 ఏళ్ల చిన్నారుల హాజరుశాతం 2018లో 63.2 ఉండగా 2024లో 61.8 శాతానికి తగ్గింది.
- ప్రభుత్వ స్కూళ్లలో మూడో తరగతిలో ఉండి రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన విద్యార్థులు 2018లో 22.6 శాతం ఉండగా, 2022లో 10.5 శాతం, 2024లో 14.7 శాతానికి తగ్గారు.
- మూడో తరగతి చదువుతూ కనీసం తీసివేతలు చేయడం వచ్చిన విద్యార్థులు 2018లో 34.1 శాతం ఉండగా, 2022లో 29.2 శాతానికి తగ్గారు.
- ఐదో తరగతి చదువుతూ రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన వాళ్లు 2018లో 57.1 శాతం ఉండగా, 2022లో 37.9 శాతం, 2024లో 37.5 శాతానికి తగ్గారు. ఐదో తరగతి చదువుతూ భాగహారాలు చేయడం వచ్చిన విద్యార్థులు 2018లో 36.7 శాతం ఉండగా, 2022లో 27.3 శాతం, 2024లో 35.1 శాతానికి తగ్గారు.
- ఎనిమిదో తరగతి చదువుతూ రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన వారు 2018లో 78.6 శాతం ఉండగా, 2024లో 53 శాతానికి తగ్గారు.
- తాగునీటి సౌకర్యం ఉన్న ప్రభుత్వ స్కూళ్లు 2018లో 58.1 శాతం ఉండగా, 2024 నాటికి 55.9 శాతానికి తగ్గాయి. మరుగుదొడ్డి సౌకర్యం ఉన్న స్కూళ్లు 2018లో 86.4 శాతం ఉండగా, 2024లో 78.4 శాతానికి తగ్గాయి.బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్న స్కూళ్లు 2018లో 81.1 శాతం ఉండగా, 2024లో 77.2 శాతానికి తగ్గాయి.
- పాఠశాలల్లో ఆఫీసులు, స్టోర్ రూం సౌకర్యాలు 2018లో 58.6 శాతం ఉండగా, 2024లో 51.4 శాతానికి తగ్గాయి. లైబ్రరీలో పుస్తకాలు అందుబాటులో ఉన్న స్కూళ్లు 2018లో 91 శాతం ఉండగా, 2024లో 83.8 శాతంగా ఉంది.
- 2018లో కంప్యూటర్లు అందుబాటులో ఉన్న స్కూళ్లు 22.6 శాతం ఉండగా, 2024 నాటికి 19.2 శాతానికి తగ్గాయి. 2024లో 6-14 ఏళ్ల వారు ప్రభుత్వ స్కూళ్లలో 61.8 శాతం, ప్రైవేట్ స్కూళ్లలో 37.9 శాతం చేరారు.
- 1-5, 6-8 తరగతి ఎన్‌రోల్‌మెంట్ ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గింది. 2018లో 1-5 తరగతి అబ్బాయిలు 55.4 శాతం, అమ్మాయిలు 63.4 శాతం ఎన్‌రోల్ అవ్వగా, 2024లో అబ్బాయిలు 54.5 శాతానికి, అమ్మాయిలు 62.2 శాతానికి తగ్గిపోయారు.
- 6-8వ తరగతి పిల్లల ఎన్‌రోల్‌మెంట్ కూడా 2018తో పోలిస్తే 2024 నాటికి తగ్గిపోయింది. ఈ విభాగంలో 2018లో అబ్బాయిలు 68.7 శాతం, అమ్మాయిలు 70.2 శాతం ఎన్‌రోల్ అయ్యారు. 2024 నాటికి అబ్బాయిల శాతం 64.1 శాతానికి, అమ్మాయిల శాతం 67.1 శాతానికి తగ్గిపోయింది.
- 2024లో అన్ని పాఠశాలలను పరిశీలిస్తే 7, 8 తరగతులు చదివే పిల్లలు కనీసం అక్షరం కూడా చదవలేని స్థితిలో 2.2 శాతం మంది, అక్షరాలు చదవగలిగిన వాళ్లు 6.2 శాతం మంది ఉన్నారు. పదాలు చదవగలిగిన వాళ్లు ఏడో తరగతిలో 12.5 శాతం మంది, ఎనిమిదో తరగతిలో 10.7 శాతం మంది ఉన్నారు. ఈ తరగతుల్లో ఉన్న పిల్లల్లో ఒకటో తరగతి, రెండో తరగతి పాఠ్యపుస్తకాలు చదవగలిగిన వాళ్లు 50 శాతం ఉన్నారు.
- 14 ఏళ్ల వయసు గల వారిలో 69.7 శాతం పిల్లలు డిజిటల్ టాస్కులు చేస్తుంటే, 86.8 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నారు.
- 2024లో 3వ తరగతి చదువుతున్న పిల్లల్లో 3.2 శాతం మంది కనీసం అంకెలను కూడా గుర్తించలేకపోయారు. ఆరో తరగతి చదువుతూ అంకెలను గుర్తించలేని పిల్లలు 2.6 శాతం మంది ఉన్నారు. 2024లో ఐదో తరగతి చదువుతూ భాగహారం చేయలేని పిల్లలు 22.6 శాతం మంది, ఎనిమిదో తరగతి చదువుతూ భాగహారం చేయలేని విద్యార్థులు 42.8 శాతం మంది ఉన్నారు.

షరియా వద్దు... లౌకిక చట్టం కావాలి

» ముస్లిం చట్టం ప్రకారమైతే మహిళలకు వారసత్వ ఆస్తిలో మూడో వంతుపైనే హక్కు

» వారసత్వ చట్టమైతే మొత్తం పొందొచ్చు

» సుప్రీంలో ముస్లిం మహిళ పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 28: ముస్లిం పర్సనల్ లా విషయమై సుప్రీంకోర్టులో ఆసక్తికరమైన కేసు నమోదయింది. తనకు షరియా చట్టం కాకుండా, భారతీయ వారసత్వ చట్టాన్ని వర్తింపజేయాలని కోరుతూ ఓ ముస్లిం మహిళ పిటిషన్ దాఖలు చేశారు. తాను ముస్లిం అయినప్పటికీ షరియా చట్టంపై విశ్వాసం లేనందున లౌకికవాద చట్టాన్ని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కేరళలోని అళప్పుజకు చెందిన 'కేరళ మాజీ ముస్లింలు' (ఎక్స్ ముస్లిం ఆఫ్ కేరళ) సంస్థ ప్రధాన కార్యదర్శి సఫియా పి.ఎం. ఈ పిటిషన్ వేశారు. మంగళవారం దీనిపై ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తాను అధికారికంగా ఇస్లాంను విడిచిపెట్టలేదని, కానీ విశ్వాసం లేదని సఫియా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. 'విశ్వాసం లేకపోవడాన్ని' కూడా మత స్వేచ్ఛగా గుర్తించాలని కోరారు. ముస్లిం పర్సనల్ లా అంటే ఇష్టం లేని వారికి భారతీయ వారసత్వ చట్టం-1925 వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. షరియా చట్టం ప్రకారం తండ్రి ఆస్తిలో కేవలం మూడో వంతు మాత్రమే మహిళలకు వస్తుందని, అదే వారసత్వ చట్టం ప్రకారమయితే తన తండ్రి ఇంకా ఎక్కువ వాటా ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. షరియా ప్రకారం ముస్లిం మతం నుంచి బయటకు వస్తే తండ్రి ఆస్తిలో ఎలాంటి వాటా కూడా రాదన్నారు. ఒకవేళ తాను అధికారికంగా ముస్లిం మతం నుంచి బయటకు వస్తే తన ఏకైక కుమారుడికి ఎలాంటి ఆస్తి దక్కదని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కేంద్రం తరఫున కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. మే 5 తర్వాత విచారణ జరుపుతామని తెలిపింది.

విడాకులు.. పునర్వివాహం

» ఆస్తి చేజారకుండా ముస్లిం జంట ఉపాయం

షరియా చట్టాలను తప్పించుకునేందుకు ఓ ముస్లిం జంట తొలుత విడాకులు తీసుకొని, మళ్లీ వారే వివాహం చేసుకోవడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా జరిగింది. తమ కుమార్తెలకు ఆర్థిక భద్రత కల్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు చెబుతున్నారు. న్యాయవాది, నటుడు సి.షుక్కూర్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాజీ ప్రొ చాన్సలర్ షీనాకు 29 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ముగ్గురూ ఆడపిల్లలే. మగ సంతానం లేదు. షరియా చట్టం ప్రకారం కేవలం ఆడ సంతానమే ఉంటే తల్లిదండ్రుల ఆస్తి మొత్తం వారికి చెందదు. కొంత తండ్రి తమ్ముడి పిల్లలకు ఇవ్వాల్సి వస్తుంది. ప్రస్తుత కేసులో ఆ ముగ్గురు కుమార్తెలకు మూడింట రెండొంతుల ఆస్తి మాత్రమే దక్కుతుంది. ఇది ఇష్టంలేని ఆ జంట తొలుత ఇస్లామిక్ చట్టాల ప్రకారం విడాకులు తీసుకున్నారు. మళ్లీ బుధవారం అన్ని మతాల వారికి వర్తించే ప్రత్యేక వివాహ చట్టం కింద కాసరగోడ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పునర్వివాహం చేసుకున్నారు. ఆ చట్టం ప్రకారం మొత్తం ఆస్తిని ముగ్గురు కుమార్తెలకు పంచిపెట్టే అవకాశం కలిగింది.

మాజీ ఎమ్మెల్యే కాటసాని
ఆక్రమణలపై హైడ్రా కొరడా

» అమీన్‌పూర్ పెద్దచెరువు భూమిలో నిర్మాణాల కూల్చివేత

» పద్మావతినగర్ రోడ్డు ఆక్రమణల తొలగింపు

పటాన్‌చెరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా బుల్డోజర్లు మరోసారి అమీన్‌పూర్‌లో ఆక్రమణలపై విరుచుకుపడ్డాయి. అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశాయి. ఇటీవల స్తబ్దుగా ఉన్న హైడ్రా మంగళవారం మళ్లీ జూలు విదిల్చింది. జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించిన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని పెద్దచెరువులో ఆక్రమణలపై కొరడా ఝళిపించింది. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల్లో పెద్దఎత్తున మట్టిపోసి చుట్టూ ప్రహరీని నిర్మించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమణలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. పెద్దచెరువు పక్కనే ఉన్న సర్వే నంబర్ 193, 194, 323లోని పద్మావతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డును మూసివేసి ప్లాట్లలోకి వెళ్లకుండా కాటసాని వర్గీయులు దౌర్జన్యం చేస్తూ వస్తున్నారు. 24 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పద్మావతినగర్‌కు రోడ్డు లేకుండా చేయడంతో బాధితులు న్యాయ పోరాటం ప్రారంభించారు. గతంలో చెరువు కబ్జాతో పాటు పద్మావతినగర్ కాలనీ కబ్జాలపై హైడ్రా స్పందించింది. సుమారు 20 ఎకరాల చెరువు ఎఫ్‌టీఎల్ భూములుగా గుర్తించి, సర్వే చేసి హద్దులను నిర్ణయించారు. చెరువు పరిధి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వచ్చే భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని గతంలోనే కూల్చివేశారు. పద్మావతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డును పునరుద్ధరించారు. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ భూములను స్వాధీనం చేసుకున్నామని హైడ్రా ప్రకటన కూడా చేసింది. కొద్ది రోజులు మిన్నకుండిపోయిన ఆక్రమణదారులు.. గతంలో హైడ్రా కూల్చిన ప్రహరీని, వాచ్‌మన్ గదులను తిరిగి నిర్మించారు. పద్మావతినగర్‌కు వెళ్లే రోడ్డును ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ప్రహరీ కూడా నిర్మిస్తున్నారు. దీంతో బాధితులు మళ్లీ హైడ్రా కమిషనర్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

కాటసాని వర్గీయులు బెదిరిస్తున్నారు: కాలనీవాసులు

కాటసాని రాంభూపాల్‌రెడ్డి మనుషులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పద్మావతినగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ రోడ్డును ఆక్రమించిన కాటసాని వర్గీయులతో 20 ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిష్ట రమేష్, శిష్ట లోహిత్, మౌనిరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కాలనీ రోడ్డును కబ్జాదారుల నుంచి విడిపించిన సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

2న ఢిల్లీలో చంద్రబాబు
ఎన్నికల ప్రచారం

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2వ తేదీన సీఎం చంద్రబాబు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఎన్డీయే కూటమి తరఫున ఆయన ప్రచారం చేస్తారు. ఢిల్లీ తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు చంద్రబాబు అక్కడకు వెళ్తున్నారు. ఢిల్లీలో తెలుగు వారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆయన పర్యటిస్తారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన టీడీపీ ఎంపీల సమావేశంలో సీఎం తన ఢిల్లీ పర్యటనను ధ్రువీకరించారు. పార్టీ ఎంపీలు కూడా ఢిల్లీలో తెలుగువారు నివసించే ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. వచ్చే నెల 1న సాయంత్రం బయలుదేరి ఢిల్లీ వెళ్తారు.

వాట్సప్ ద్వారా
నోటీసులు పంపొద్దు

న్యూఢిల్లీ, జనవరి 28: కోర్టు వ్యవహారాల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరుగుతున్నప్పటికీ విచారణకు సంబంధించిన నోటీసులను వాట్సప్ ద్వారా పంపించడం నిబంధనలకు విరుద్ధమని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అరెస్టు చేయడానికి ముందు విచారణ నిమిత్తం హాజరు కావాలంటూ పంపే నోటీసులు, సీఆర్పీసీలోని సెక్షన్ 41ఏ, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 35 ప్రకారం పంపే నోటీసులకు ఎలక్ట్రానిక్ మాధ్యమాలను ఉపయోగించకూడదని తెలిపింది. కేవలం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలో పేర్కొన్న విధానాల్లోనే పంపాలని తెలిపింది.

టిక్‌టాక్ కొనుగోలు రేసులో మైక్రోసాఫ్ట్ !



• ధ్రువీకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: ప్రపంచంలోని అతిపెద్ద సామాజిక మాధ్యమాల్లో ఒకటైన వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్‌ను కొనుగోలు చేసేందుకు అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చర్చలు జరుపుతోంది. అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. టిక్ టాక్ అమెరికా కార్యకలాపాలను చేజిక్కించుకునేందుకు మైక్రోసాఫ్ట్ సహా పలు టెక్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయన్నారు. టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, ఒరాకిల్ చైర్మన్ ల్యారీ ఎల్లిసన్ కూడా ఈ ప్లాట్‌ఫామ్ కొనుగోలుకు పోటీపడాలని ఆయన కోరారు. టిక్‌టాక్‌లో 50 శాతం వాటా అమెరికన్ కంపెనీ చేతుల్లో ఉండాలని తాను కోరుకుంటున్నాని ఆయన పేర్కొన్నారు. జాతీయ భద్రత కారణాల దృష్ట్యా టిక్‌టాక్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్ హయాంలో విధించిన నిషేధం అమలును ట్రంప్ 75 రోజుల పాటు వాయిదా వేశారు. అప్పటిలోగా టిక్‌టాక్ యూఎస్ కార్యకలాపాలను విక్రయించాలని, లేదంటే నిషేధానికి గురికాక తప్పదని చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్‌కు అల్టిమేటం జారీ చేశారు. టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ టిక్‌టాక్ అమెరికా కార్యకలాపాలను కొనుగోలు చేసేందుకు మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ 2020లోనే పోటీపడ్డాయి. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ దిశగా చర్చలు ప్రారంభమయ్యాయి.

2028 నాటికి భారత్‌లో ఎలక్ట్రిక్ బైక్ ప్లాంట్

హోండా మోటార్


మినోరు కాటో

న్యూఢిల్లీ/ముంబై: భారత్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు మాత్రమే తయారు చేసే ప్లాంట్‌ను 2028 నాటికి ప్రారంభిస్తామని జపాన్ ఆటో దిగ్గజం హోండా మోటార్ ప్రకటించింది. ఈ ప్లాంట్‌లో విస్తృత శ్రేణిలో మోటార్ సైకిళ్లు తయారు చేయనున్నట్లు తెలిపింది. అయితే ఈ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేసేది, పెట్టుబడులు ఎంతనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ కొత్త ప్లాంట్ నుంచి ఎనిమిది మోడళ్లలో ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటర్లు ఉత్పత్తి చేయనున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మినోరు కాటో తెలిపారు. అలాగే విద్యుత్ వాహనాల్లో కీలకమైన బ్యాటరీల కోసం వివిధ బ్యాటరీ ఉత్పత్తిదారులతో సంప్రదిస్తున్నామని, తాము తయారు చేయాలనుకుంటున్న మోటార్ సైకిళ్ల స్వభావానికి సరిపోయే బ్యాటరీలు తయారు చేయడంతో పాటు సరఫరా స్థిరంగా ఉండాలన్నది తమ ధ్యేయమని ఆయన చెప్పారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కు అందుబాటులో ఉన్న సబ్సిడీ విధానాలు, కంపెనీలు అందిస్తున్న వినూత్న మోడళ్ల మద్దతుతో 10 లక్షల విద్యుత్ టూ వీలర్లకు డిమాండ్ ఏర్పడిందని, మొత్తం వాహనాల మార్కెట్లో ఇది ఐదు శాతంతో సమానమని ఆయన వెల్లడించారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 30 విద్యుత్ మోడళ్ల ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 13 మోడళ్ల ప్రవేశపెట్టినట్టు చెప్పారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 40 లక్షల విద్యుత్ బైక్‌లు విక్రయించాలన్నది తమ లక్ష్యమని మినోరు తెలిపారు.

హైదరాబాద్‌లో సానోకో జీసీసీ

500 మందికి ఉద్యోగాలు

SONOCO

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. పలు ఫార్చ్యూన్-500 కంపెనీలకు ప్యాకేజింగ్ ఉత్పత్తులు సరఫరా చేస్తున్న ప్రముఖ అంతర్జాతీయ సంస్థ సానోకో 'పెర్ఫార్మెన్స్ హబ్' పేరుతో ఈ జీసీసీని ఏర్పాటు చేస్తోంది. హైటెక్ సిటీ సమీపంలోని ఫీనిక్స్ కార్యాలయ భవనంలో కోటి డాలర్ల (సుమారు రూ.86 కోట్లు) పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రం ద్వారా వచ్చే ఏడాది, ఏడాదిన్నర కాలంలో 300 నుంచి 500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని సానోకో చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి (సీఐఓ) రాజీవ్ అంకిరెడ్డిపల్లి తెలిపారు. ఇందులో ఇప్పటికే 60-70 మంది నియామకాలను కంపెనీ పూర్తి చేసింది, క్యాపబిలిటీ, కెపాసిటీ, కాస్ట్ అంశాల ప్రాతిపదికన సానోకో హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం ద్వారా తమ కంపెనీతో పాటు తమ ఖాతాదారులకు అవసరమైన డిజిటల్ సేవలు అందిస్తామని రాజీవ్ చెప్పారు. పర్యావరణానికి హాని చేయని రీతిలో ప్యాకేజింగ్ ఉత్పత్తులు అందించడం తమ కంపెనీ ప్రత్యేకత అన్నారు. ప్రస్తుతం నిపుణులైన ఉద్యోగులు భారత్‌లో లభిస్తున్నంత విరివిగా మరే దేశంలోనూ లభించడం లేదని సానోకో కంపెనీ గ్లోబల్ ఐటీ సేవల విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జొచెన్ లీ లార్జ్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,930 ▼	75,100 ▼	1,04,000 ▼
విజయవాడ	82,900 ▼	78,200 ▲	92,500 ▼
విశాఖపట్నం	80,300 ▲	73,610 ▲	90,700 ▼
రాజమండ్రి	81,930 ▼	75,100 ▼	92,700 ▼
ప్రొద్దుటూరు	82,000 ▲	75,840 ▼	92,500 ▼
ముంబై	80,313 ▼	73,567 ▼	89,750 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	120
వరంగల్	109	గుంటూరు	118
కరీంనగర్	109	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	100
కర్నూలు	109	నెల్లూరు	105
విశాఖపట్నం	112	అనంతపురం	105
గోదావరి	120		

బ్యాంకింగ్ షేర్ల దన్ను

ఆర్థిక వ్యవస్థలోకి రూ.1.5 లక్షల కోట్లు విడుదల చేయాలని ఆర్‌బీఐ నిర్ణయం



ముంబై: వరుసగా రెండు రోజులు భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ.. మంగళవారం ట్రేడింగ్‌లో మళ్లీ పుంజుకున్నాయి. ఆర్థిక వ్యవస్థలో రూ.1.5 లక్షల కోట్ల మేర ద్రవ్య లభ్యత పెంచాలని ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోవడంతో బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరపడం సూచీల ర్యాలీకి దోహదపడింది. ఆరంభం నుంచే పాజిటివ్‌గా ట్రేడవుతూ వచ్చిన సెన్సెక్స్. ఒకదశలో 1,146.79 పాయింట్లు ఎగబాకి 76,512.96 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆఖరి అరగంటలో మదుపరులు మళ్లీ లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీ 535.24 పాయింట్ల లాభంతో 75,901.41 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 308 పాయింట్ల పెరుగుదలతో 23,138 స్థాయికి చేరుకున్నప్పటికీ, చివర్లో 128.10 పాయింట్ల లాభంతో 22,957.25 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి. బజాజ్ ఫైనాన్స్ షేరు 4.27 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ 3 శాతానికి పైగా ఎగబాకగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటార్స్ రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా మాత్రం ఏకంగా 4.47 శాతం క్షీణించింది. ప్రధాన కంపెనీలకు కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ.. చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. దాంతో, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.61 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ, ఆటో ఒక శాతానికి పైగా పెరిగాయి.

• ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 26 పైసలు నష్టపోయి 86.57 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో పాటు ట్రంప్ సుంకాల హెచ్చరికలు మన కరెన్సీని కుంగదీశాయి.

ఎన్‌ఎండీసీ రూ.70 వేల కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అతి పెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తిదారైన ఎన్‌ఎండీసీ రాబోయే ఐదేళ్ల కాలంలో రూ.70,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించింది. ఉత్పాదక సామర్థ్యం పెంపు, మౌలిక వసతులు, డిజిటల్ పరివర్తన విభాగాల్లో ఈ సొమ్ము ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ సీఎండీ (అదనపు చార్జి) అమితవ ముఖర్జీ తెలిపారు. ఎన్‌ఎండీసీ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వెండర్ల మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి 10 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం సాధించడం కంపెనీ ప్రాధాన్యత అన్నారు. అలాగే ప్రపంచ మైనింగ్ దిగ్గజంగా తీర్చి దిద్దాలన్నది తమకు లభించిన జీవితకాల అవకాశమని చెప్పారు. కంపెనీ పురోగతిలో పాలు పంచుకున్న వారందరూ ఈ బృహత్ ప్రయత్నంలో భాగస్వాములై ఆర్థికపరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖర్జీ సూచించారు.

ఫ్రెంచి కంపెనీతో ప్యూర్ ఈవీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అత్యాధునిక లిథియం అయాన్ బ్యాటరీ కండిషనింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఫ్రాన్స్‌కు చెందిన బీఈ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు హైదరాబాద్‌కు చెందిన విద్యుత్ టూ వీలర్ల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ ప్రకటించింది. చరిత్రలో ఇలాంటి భాగస్వామ్యాల్లో ఇదే మొదటిదని పేర్కొంటూ ఈ టెక్నాలజీ ఈవీ యజమానులకు దీర్ఘకాలిక పొదుపు కల్పిస్తుందని తెలిపింది. బ్యాటరీల రీ కండిషనింగ్ వల్ల కొత్త బ్యాటరీల కొనుగోలు భారం తగ్గుతుందని పేర్కొంది. ఈ ఒప్పందం కింద బీఈ ఎనర్జీ నుంచి తాము పేటెంట్లు గల హైటెక్ పరికరాలు దిగుమతి చేసుకోగలుగుతామని కంపెనీ తెలిపింది. ఈ భాగస్వామ్యంతో భారత్‌లో బీఈ ఎనర్జీ కార్యకలాపా లు ప్రారంభించినట్టవుతుందని ప్యూర్ ఈవీ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి అన్నారు.

మొబిక్విక్, క్రెడ్ నుంచి డిజిటల్ రూపీ వ్యాలెట్లు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీలైన మొబిక్విక్, క్రెడ్ తాజాగా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా డిజిటల్ రూపీ వ్యాలెట్లను అందుబాటులోకి తెచ్చాయి. ఆర్‌బీఐ, యెస్ బ్యాంక్ భాగస్వామ్యంతో ఈ సేవలను ప్రారంభించాయి. ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీని యూజర్లకు ఆఫర్ చేస్తున్న తొలి బ్యాంకింగేతర సంస్థలివే. ఆర్‌బీఐ తొలుత బ్యాంక్‌లను మాత్రమే డిజిటల్ రూపీ సేవలందించేందుకు అనుమతించింది. అయితే, సీబీడీసీ సేవలను విస్తరించేందుకు నాన్-బ్యాంకింగ్ కంపెనీలకూ ఇందుకు అనుమతివ్వాలని గత ఏడాది ఏప్రిల్‌లో ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. మొబిక్విక్ ఆండ్రాయిడ్ యూజర్ల కోసం పూర్తిస్థాయి ఈ-రూపీ వ్యాలెట్ సేవలను ప్రారంభించగా.. క్రెడ్ మాత్రం ఎంపిక చేసిన సభ్యుల కోసం బీటా వెర్షన్ వ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ వ్యాలెట్ ద్వారా యూజర్లు ఇతరుల డిజిటల్ రూపీ వ్యాలెట్లతో పాటు యూపీఐ ద్వారా బ్యాంక్ అకౌంట్లకు నిధులు పంపవచ్చు లేదా అందుకోవచ్చు.

లాభాల్లోకి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

డిసెంబరు త్రైమాసిక లాభం రూ.202 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) లాభాల్లోకి అడుగుపెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.202 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ రూ.486 కోట్ల నికర నష్టాలను నమోదు చేసింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ నికర ఆదాయం 17 శాతం వృద్ధి చెంది రూ.2,748 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో కంపెనీ నిర్వహణలోని విమానాశ్రయాల్లో ప్యాసింజర్ ట్రాఫిక్ 10 శాతం వృద్ధి చెందింది. హైదరాబాద్ విమానాశ్రయ ట్రాఫిక్ 22.1 శాతం వృద్ధితో 77 లక్షలకు చేరుకున్నట్లు పేర్కొంది. దేశీయ విమాన ట్రాఫిక్ 24.43 శాతం పెరగగా అంతర్జాతీయ ప్యాసింజర్ ట్రాఫిక్ 11.5 శాతం పెరిగిందని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో హైదరాబాద్ విమానాశ్రయ మొత్తం ఆదాయం 22.9 శాతం వృద్ధితో రూ.496 కోట్ల నుంచి రూ.609 కోట్లకు చేరుకుందని పేర్కొంది. కాగా ఢిల్లీ విమానాశ్రయ ఆదాయం 8.1 శాతం వృద్ధితో రూ.1,430 కోట్లుగా నమోదైనట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తెలిపింది. మరోవైపు విశాఖపట్నంలోని భోగాపురం విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించింది.

సీబీఐసీ

బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల పెనాల్టీ చార్జీలపై జీఎస్‌టీ వర్తించదు..

న్యూఢిల్లీ: బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) విధించే పెనాల్టీ చార్జీలపై జీఎస్‌టీ వర్తించదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) స్పష్టం చేసింది. అంతేకాదు, పేమెంట్ అగ్రిగేటర్లకు రూ.2,000 వరకు డిజిటల్ చెల్లింపుల ప్రాసెసింగ్ పైనా జీఎస్‌టీ విధించడం జరగదని తెలిపింది. ఇందుకు సంబంధించి సీబీఐసీ మంగళవారం నాడు సర్క్యులర్ జారీ చేసింది.

డీజీపీగా మళ్లీ హరీశ్ కుమార్ గుప్తా!

» రేపటిలోపు అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం?

» రెండ్రోజుల్లో తిరుమలరావు పదవీవిరమణ

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా నియామకం దాదాపు ఖరారైంది. ఈ నెల 31న పదవీ విరమణ చేయబోతున్న ద్వారకా తిరుమలరావు స్థానంలో ఆయన్ను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిరుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ అప్పటి డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని తప్పించి గుప్తాను ఎంపిక చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తూ ద్వారకా తిరుమలరావును డీజీపీగా నియమించింది. గుప్తా రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమితులయ్యారు. గుప్తా 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. తిరుమలరావు మరో రెండ్రోజుల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తర్వాత సీనియారిటీ పరంగా అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్(1991 బ్యాచ్) ఉన్నారు. అయితే శాంతి భద్రతల విభాగంతో పాటు హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా, జైళ్ల శాఖ డీజీగా నూ పనిచేసిన అనుభవం ఉన్న హరీశ్ గుప్తా పనితీరుపై సంతృప్తిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం నూతన పోలీస్ బాస్‌గా ఆయన్నే ఖరారు చేసినట్లు సమాచారం. గుప్తా నియామకంపై గురువారంలోపే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం.

వర్షాలకు దెబ్బతిన్న ఆటోలకు 20 వేల సాయం

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆగస్టు-సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ఆటోలకు ఇచ్చే సహాయాన్ని ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచింది. ఈ మేరకు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు(జీవో-2) జారీ చేశారు. రాష్ట్ర విపత్తు స్పందన నిధి నుంచి ఈ పరిహారం అందించనున్నారు. భారీ వర్షాలు, వరదలతో విజయవాడతోపాటు పలు ప్రాంతాల్లో నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే.

నాబార్డు నుంచి రాష్ట్రానికి రూ.1,850 కోట్లు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్ఐడీఎఫ్-30 కింద రాష్ట్రానికి నాబార్డు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,850 కోట్లు కేటాయించింది. రాష్ట్రానికి వివిధ అభివృద్ధి పథకాల కోసం నాబార్డు రుణాలందిస్తోంది. ఆర్ఐడీఎఫ్ కింద గ్రామీణ రోడ్లకు 80 శాతం రుణం ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం భరించాలి. 2,683 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.1,086 కోట్లు కోరుతూ ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు పంపింది. పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి రూ.1024 కోట్లతో 2,233 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. గత ఐదేళ్లలో పాఠశాల విద్యకు సంబంధించి అదనపు గదులు, టాయ్‌లెట్స్, తాగునీటి కోసం రూ.6,066 కోట్లు మంజూరయ్యాయి. ఇంకా రూ.1,113 కోట్లు రావల్సి ఉంది. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి రూ.5331 కోట్లు మంజూరుకాగా, మరో రూ.2,198 కోట్లు అందాల్సి ఉంది. బీసీ, సాంఘిక, గిరిజన, మహిళా సంక్షేమం, వ్యవసాయం, పిషరీస్, ఆర్అండ్‌బీ తదితర శాఖలకు గత ఐదేళ్లలో నాబార్డు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.14,435 కోట్ల రుణం మంజూరయ్యింది.

ఈఏపీల రుణానికి కసరత్తు

» రాష్ట్రంలో రూ. 27,259 కోట్లతో 11 ప్రాజెక్టులు

» అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి లోన్లు

» గతంలో రుణాన్ని దారి మళ్లించిన జగన్ సర్కార్

» పరిస్థితి చక్కదిద్దుతున్న కూటమి ప్రభుత్వం

» ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆర్థిక సంస్థల రుణాల సహకారంతో(ఈఏపీ) చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వైసీపీ పాలనలో గాడి తప్పిన ఈ ప్రాజెక్టులను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. జగన్ హయాంలో పలు ఈఏపీ ప్రాజెక్టుల రుణాలను కూడా దారి మళ్లించారు. దీం తో ఆ ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టులకు రుణం దాదాపు విడుదల కాలేదు. ఇప్పుడు ఆ పరిస్థితులను చక్కది ద్ది ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న 11 ఈఏపీ ప్రాజెక్టుల పురోగతిని మంగళవారం సమీక్షించారు. కాగా, రుణాలు ఇచ్చే సంస్థలు ఒకేసారి కాకుండా ప్రాజెక్టు పురోగతి ఆధారంగా, విడతల వారీగా రుణం విడుదల చేస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లో ఉన్న 11 పాజెక్టులకు వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రూ. 20,523 కోట్ల రుణం మంజూరైంది. ఆ రుణం కాకుం డా ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6,736 కోట్లు సమకూర్చాలి. దీంతో 11 ప్రాజెక్టుల విలువ రూ.27,259 కోట్లకు చేరుతుంది. 2024 డిసెంబరు చివరి నాటికి రూ.6,603 కోట్ల లోన్ వచ్చింది. ఇంకా రూ.13,919 కోట్లు రావాల్సి ఉంది. రాబోయే ఐదేళ్లలో రూ.7,155 కోట్ల రుణాలు విడుదలవుతాయని ప్రభు త్వం అంచనా వేస్తోంది. ఈ రుణాలతో పాటు ప్రభుత్వం తన వాటా కింద రూ.3,000 కోట్లు విడుదల చేస్తుంది. అమల్లో ఉన్న 11 ప్రాజెక్టులతో పాటు, ఇప్పటికే పూర్తయిన మరో 31 ఈఏపీలకు సంబంధించి రాష్ట్రం తీసుకున్న అప్పులపై 2024-25 నుంచి 2029-30 వరకు రూ.7,155 కోట్ల అసలు, రూ.5,470 కోట్ల వడ్డీ కలిపి మొత్తం రూ.12,625 కోట్లు చెల్లించాలి. ఈ రుణాలపై 6.08 శాతం నుంచి 7.04 శాతం వడ్డీ అమలవుతోంది.

అమల్లో ఉన్న ప్రాజెక్టులు.. ప్రస్తుత పరిస్థితి

ఏపీ మండల్ కనెక్టివిటీ, రూరల్ కనెక్టివిటీ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు కోసం రూ. 2,240 కోట్ల రుణం మంజూరైంది. రాష్ట్రం తన వాటాగా రూ. 960 కోట్లు విడుదల చేయాలి. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ. 3,200 కోట్లు. ఇప్పటి వరకు రూ. 207 కోట్లు ఖర్చు చేశారు. వచ్చే ఐదేళ్లలో ప్రాజెక్టు పురోగతి ఆధారంగా రూ. 750 కోట్ల లోను విడుదలయ్యే అవకాశం ఉంది.

ఏపీ రోడ్లు, బ్రిడ్జిల పునర్నిర్మాణ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టుకయ్యే మొత్తం ఖర్చు రూ. 3,200 కోట్లు కాగా, ఇందులో రూ. 2,240 కోట్ల రుణం మంజూరైంది. రాష్ట్రం వాటాగా రూ. 960 కోట్లు ఇవ్వాలి. ఇప్పటి వరకు రూ. 269 కోట్లు ఖర్చు చేశారు. వచ్చే ఐదేళ్లలో రూ. 750 కోట్ల అప్పు వచ్చే అవకాశం ఉంది.

ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ. 4,234 కోట్లు అవుతుండగా, ఇందులో రూ. 2,963 కోట్లు రుణంగా మంజూరైంది. రాష్ట్రం వాటా రూ. 1270 కోట్లు. ఇప్పటి వరకు రూ. 908 కోట్ల రుణం విడుదల కాగా, మొత్తం రూ. 1,515 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 2,055 కోట్ల రుణం రావాలి. వచ్చే ఐదేళ్లలో రూ. 1,200 కోట్ల రుణం అందే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

ఏపీ ఇరిగేషన్, లైవ్లీహుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ. 2,000 కోట్లు. ఇందులో రూ. 1,700 కోట్లు రుణం కాగా, రూ. 300 కోట్లు రాష్ట్ర వాటా. ఇప్పటి వరకు రూ. 218 కోట్ల రుణం విడుదలైంది. రూ. 304 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 1,481 కోట్ల రుణం విడుదల కావాలి. వచ్చే ఐదేళ్లలో రూ. 100 కోట్ల లోన్ రావొచ్చని అంచనా.

ఏపీ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్, అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ. 1,600 కోట్లు కాగా ఇందులో రూ. 1,120 కోట్లు రుణం మంజూరైంది. రూ. 480 కోట్లు రాష్ట్రం తన వాటాగా విడుదల చేయాలి. ఇప్పటివరకు రూ. 194 కోట్ల రుణం అందింది. రూ. 243 కోట్లు ఈ ప్రాజెక్టుపై ఖర్చు చేశారు. ఇంకా రూ. 925 కోట్లు రుణం రావాలి. వచ్చే ఐదేళ్లలో రూ. 100 కోట్లు రుణంగా అందే అవకాశం ఉంది.

ఏపీ అర్బన్ వాటర్ సప్లై, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు ఖర్చు రూ. 3,723 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో రూ. 2,606 కోట్లు అప్పుగా మంజూరైంది. రూ. 1,117 కోట్లు రాష్ట్రం ఖర్చు చేయాలి. ఇప్పటివరకు రూ. 333 కోట్ల రుణం విడుదలైంది. ఈ ప్రాజెక్టుపై రూ. 446 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 2,272 కోట్ల రుణం రావాల్సి ఉంది. వచ్చే ఐదేళ్లలో రూ.2,000 కోట్ల రుణం వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్: ఈ ప్రాజెక్టు ఖర్చు రూ. 2,362 కోట్లు కాగా ఇందులో రూ.1,617 కోట్లు లోన్‌గా మంజూరైంది. రూ.745 కోట్లు రాష్ట్ర ప్రభు త్వం సమకూర్చాలి. ఇప్పటి వరకు రూ. 1,298 కోట్ల రుణం వచ్చింది. ఈ ప్రాజెక్టుపై రూ.1,340 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.318 కోట్ల అప్పు రావాలి. వచ్చే ఐదేళ్లలో ఇది పూర్తిగా రానుందంటున్నారు.

విశాఖ-చెన్నై డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్-2: ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.1,758 కోట్లు. ఇందులో రూ.1,155 కోట్లు రుణం మంజూరైంది. రాష్ట్రం వాటా రూ.603 కోట్లు. ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా రుణం రాలేదు. వచ్చే ఐదేళ్లలో రూ.695 కోట్ల లోన్ అందుతుందని భావిస్తున్నారు.

ఏపీ హెల్త్‌సిస్టమ్ స్ట్రెంతెనింగ్ ప్రోగ్రామ్: ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.2,327 కోట్లు. ఇందులో రాష్ట్రం వాటా లేదు. మొత్తం అప్పుగా మంజూరైంది. ఇప్పటి వరకు రూ.2273 కోట్లు అప్పు విడుదలైంది. ఇంకా రూ. 54 కోట్ల అప్పు అందాల్సి ఉంది.

జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్: ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.1,000 కోట్లు. ఇందులో రూ.700 కోట్లు అప్పుగా మంజూరైంది. రూ.300 కోట్లు ప్రభుత్వం ఇవ్వాలి. ఇప్పటి వరకు రూ.195 కోట్ల రుణం వచ్చింది. రూ.195 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.504 కోట్ల లోన్ రావాలి. వచ్చే ఐదేళ్లలో రూ.300 కోట్ల అప్పు వస్తుందని అంచనా.

సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆపరేషన్స్: ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ. 1,853 కోట్లు. ఇందులో రాష్ట్రం వాటా లేదు. మొత్తం అప్పుగా మంజూరైంది. ఇప్పటి వరకు రూ.947 కోట్ల అప్పు విడుదల కాగా, ఆ మొత్తాన్ని ఖర్చు చేశారు. ఇంకా రూ.905 కోట్ల అప్పు రావాలి. వచ్చే ఐదేళ్లలో ఈ మొత్తం విడుదలవుతుందని అంచనా వేస్తున్నారు.

ఏబీవీ సస్పెన్షన్ కాలం

క్రమబద్ధీకరణ

» వేతన, అలవెన్సుల బకాయిలు చెల్లింపునకు ఆదేశాలు

» వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపుల నుంచి రిటైర్డ్ ఐపీఎస్‌కు ఉపశమనం



అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులకు గురై, ఐదేళ్లపాటు న్యాయ పోరాటం చేసిన మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు కూటమి ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. గత ప్రభుత్వ చర్యలను తోసిపుచ్చిం ది. సస్పెన్షన్ కాలాన్ని క్రమబద్ధీకరించింది. సస్పెన్షన్ సమయంలో విధులు నిర్వహించినట్లుగా గుర్తించి వేతన, అలవెన్సుల చెల్లింపునకు మంగళవారం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర కేడర్‌కు చెందిన అధికారి ఏబీవీని 2019 జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ పోస్టింగ్ నుంచి తప్పించారు. నిఘా విభాగం అధిపతిగా ఉన్నప్పుడు ఇజ్రాయిల్ నుంచి అధునాతన టెక్నాలజీ కొనుగోలుకు సంబంధించి అవినీతి జరిగిందంటూ 2020 ఫిబ్రవరి 2న సస్పెండ్ చేసింది. దీంతో ఏబీవీ న్యాయ పోరాటానికి దిగారు. విదేశాల నుంచి ఎలాంటి టెక్నాలజీ కొనుగోలు చేయలేదని, ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో ఆయన సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ 2022 ఫిబ్రవరిలో కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో ప్రింటింగ్ ప్రెస్ కమిషనర్‌గా నియమించిన జగన్ ప్రభుత్వం వారం రోజులు తిరక్కుండానే రెండోసారి 2022 జూన్ 28న సస్పెండ్ చేసింది. తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ మరోమారు న్యాయ పోరాటానికి దిగిన ఏబీ వెంకటేశ్వరరావు 2024 మే 8న కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌లో విజయం సాధించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన పదవీ విరమణకు ముందు రోజు(2024 మే 30) జగన్ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. బాధ్యతలు తీసుకుని కొన్ని గంటల్లోనే పదవీ విరమణ చేశారు. కాగా, జూన్‌లో ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి తనకు జరిగిన అన్యాయాన్ని తెలియజేసిన ఏబీవీ.. కోర్టు, క్యాట్ తీర్పుల మేరకు న్యాయం చేయాలని కోరారు. దీంతో ఆయనపై నమోదైన తప్పుడు అభియోగాలను వెనక్కి తీసుకుంది. తాజాగా సస్పెన్షన్ కాలానికి వేతన, అలవెన్సులు చెల్లించాలంటూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీ

» ఏజెన్సీలో తగ్గిన సాగు.. ఒడిశా నుంచే రవాణా

» ప్రతి జిల్లాలో సైబర్ పోలీసు స్టేషన్

» డీజీపీ ద్వారకా తిరుమలరావు

పరవాడ, శ్రీకాకుళం క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. గంజాయి జోలికి ఎవరూ పోవద్దని, శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో పట్టుకున్న 35 వేల కిలోల డ్రై గంజాయిని మంగళవారం అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని రాంకీ కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులో యంత్రం ద్వారా శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా, ఆ మూలాలు ఏపీలోనే ఉన్నాయన్న అప్రతిష్ఠను పోగొట్టేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఏపీ కంటే ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి గంజాయి ఎక్కువగా రవాణా జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్లలో సుమారు లక్ష కిలోల గంజాయి పట్టుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని డీజీపీ తెలిపారు.చిన్నారులపై లైంగిక దాడుల కేసుల్లో నిందితులను శిక్షించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మూడు యూట్యూబ్ చానళ్లపై కేసులు

తిరుపతి(నేరవిభాగం): టీటీడీ చైర్మన్, ఈవోపై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారంటూ వచ్చిన ఫిర్యాదుపై తిరుపతిలోని యూనివర్సిటీ పోలీసులు మంగళవారం మూడు యూట్యూబ్ చానళ్లపై కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య కథనం మేరకు.. 15 రోజుల క్రితం ఆధ్యాత్మిక వేత్త, ప్రముఖ ఉపన్యాసకులు, ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తిరుమలకు వచ్చారు. ఆ సమయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ఆయనకు ఏ మాత్రం గౌరవ మర్యాదలు ఇవ్వలేదని జర్నలిస్టు వైఎస్ఆర్, దయల్ న్యూస్, పోస్టు 360 చానళ్ల ప్రచారం చేశాయి. దీనిపై విచారణ చేసిన టీటీడీ ఉన్నతాధికారులు అదంతా పూర్తిగా అవాస్తవమని తేల్చారు.



పరవాడ ఫార్మా సిటీలో గంజాయి దహనం ప్రక్రియను ప్రారంభిస్తున్న డీజీపీ తిరుమలరావు. చిత్రంలో ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి





వినుకొండ కొట్నాల్పబజారులో ప్రభుత్వ చీఫ్ విప్‌కు జీవీ ఆంజనేయులుకు సమస్యలు తెలియజేస్తున్న ముస్లిం మైనార్టీ మహిళలు

మీ సమస్యకు.. మా పరిష్కారం!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తరలి వచ్చారు. కేవలం ఒక శాఖ, ఒక విభాగానికి పరిమితం కాకుండా... రెవెన్యూ, మునిసిపల్, ఆరోగ్య, పోలీసు, రవాణా, విద్యుత్తు, నీటిసరఫరా తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. సామాన్య ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు సంధానకర్తలుగా వ్యవహరించారు. కొన్ని సమస్యలు చిన్నవే! వాటి వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులు మాత్రం పెద్దవి! ఇవి ప్రభుత్వం కాస్త దృష్టి పెడితే పరిష్కరించగలిగేవి! మరికొన్ని సమస్యలు తీవ్రమైనవి! వాటిని స్థానికులే ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జనం పెద్దసంఖ్యలో తమ వ్యక్తిగత సమస్యలను కూడా ప్రస్తావించారు. 'చూద్దాం... చేద్దాం' అని కాకుండా ఎప్పటిలోగా పరిష్కరిస్తామో అధికారులు, నేతలు నిర్దిష్టంగా అప్పటికప్పుడే ప్రకటించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని 31వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. సాయినగర్ కాలనీలో చాకలి చెరువును బాగుచేయకపోవడంవల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు చెప్పడంతో... వెంటనే స్పందించిన రామ్మోహన్.. ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అధికారులను వెంటబెట్టుకుని అప్పటికప్పుడు చెరువును స్వయంగా పరిశీలించారు. చెరువును బాగుచేసి అభివృద్ధి చేయాలని అక్కడే కమిషనర్‌ను ఆదేశించారు. కడప అశోక్‌నగర్ ప్రధాన రహదారితో పాటు మిగిలిన వీధుల్లో ఎక్కడికక్కడ అడ్డదిడ్డంగా వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొనడంతో... సమావేశం ముగిసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. తొలగించేందుకు చర్యలు చేపట్టారు. 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా'పై ప్రభుత్వ యంత్రాంగం స్పందనకు... మచ్చుకు రెండు ఉదాహరణలు ఇవి! ఇలా అన్ని కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్దిష్ట హామీలు లభించాయి. తక్షణ పరిష్కారాలూ కనిపించాయి. అధికారులు, నేతలే తమ కాలనీలకు తరలి వచ్చి ఇబ్బందులు తెలుసుకునేలా చొరవ చూపిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



తిరుపతి నగరం జీవకోన అంబేడ్కర్ కూడలిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రాలిస్తున్న జనం

అక్కడికక్కడే ఇంటి పట్టా ఇచ్చేశారు

బాధిత మహిళకు అప్పటికప్పుడే

న్యాయం చేసిన చిత్తూరు కమిషనర్

చిత్తూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు నగరం విజయలక్ష్మి కాలనీలో మంగళవారం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం జరిగింది. చిత్తూరు మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేశ్, ఏసీపీ నాగేంద్ర, కార్పొరేటర్ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రధానంగా కింది సమస్యలు ప్రస్తావించారు...

సమస్యలు:-

- సంతపేట రోడ్డు పొడవునా మాంసం దుకాణాలను పెట్టారు. వాటిని అక్కడ తొలగించి ఒకేచోట ఏర్పాటు చేయాలి.
- సంతపేట మున్సిపల్ హైస్కూల్ పరిధిలో 15 ఎకరాల స్థలం ఉంది. ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

పరిష్కారం: స్థానికుల సమస్యల్ని నోట్ చేసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చిన అధికారులు... మరికొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించారు. పొంచాలి పురానికి చెందిన రుక్మిణి అనే మహిళ తన ఇంటి పట్టాను రద్దు చేశారని, కూలీ పనులు చేసే తాను బాడుగ చెల్లించలేక పోతున్నానని కమిషనర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కమిషనర్ ఇంటి పట్టాను మంజూరు చేయాలని ఆదేశించారు.

'ప్రధాన కాలువ నిర్మాణానికి ఓకే.'

మదనపల్లిలో పై ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటితో ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడుకాలనీ, సప్తగిరినగర్ ముంపునకు గురవుతున్నాయి. దీని నివారణకు స్థానిక టిప్పుసుల్తాన్ మైదానం నుంచి ప్రశాంత్‌నగర్ మూడో లేన్ వరకూ ప్రధాన కాలువ నిర్మించాలని స్థానికులు కోరారు. వారి వినతిని కమిషనర్ కె. ప్రమీల అంగీకరించారు.

నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తా

- ప్రజలిచ్చిన వినతులకు టాప్ ప్రయారిటీ ఇస్తా
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు హామీ



శ్రీకాకుళంలో చాకలి చెరువును పరిశీలిస్తున్న రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో జరిగిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. తమ డివిజన్‌లోని సాయినగర్ కాలనీలోని చాకలి చెరువు నిర్వహణ బాగా లేదని ప్రజలు చెప్పడంతో, అప్పటికప్పుడే కేంద్రమంత్రి తన వెంట అధికారులను తీసుకెళ్లి చెరువును పరిశీలించారు. చెరువును బాగుచేయాలని కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావుకు అక్కడే ఆదేశాలు జారీచేశారు. గంజాయి బ్యాచ్ బెడద ఎక్కువగా ఉన్నదని సాయినగర్ కాలనీవాసులు చెప్పారు. కార్యక్రమం సందర్భంగా.. మరికొన్ని సమస్యలను ప్రజలు లేవనెత్తారు.

సమస్యలు :

- డ్రైనేజీ కాలువలు బాగు చేయాలి... సీసీ రోడ్లు మంజూరు చేయండి..
- పారిశుధ్యం సమస్యలతో దోమలు, కుక్కలు, పాములు, పందుల బెడద ఎక్కువగా ఉంది. ఈ సమస్యల నుంచి విముక్తిని కలిగించండి.
- ఇళ్లు మంజూరు చేయండి.

పరిష్కారం: 'ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన కార్యక్రమాన్ని అభినందిస్తున్నానని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున అండదండలు అందిస్తామని రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. "ఈ డివిజన్‌లో అవసరమైన రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనల చేయాలని అధికారులను ఇక్కడే ఆదేశిస్తున్నా. ప్రజలు ఇచ్చిన సమస్యలను, వినతులను టాప్ ప్రయారిటీ ఇచ్చి నెల నుంచి రెండు మాసాల్లో పరిష్కరిస్తాం. నేను కూడా పర్యవేక్షిస్తా" అని కేంద్రమంత్రి చెప్పారు.

రూ.వంద కోట్లతో వినుకొండ అభివృద్ధి

అందులో 5 కోట్లు విరాళంగా ఇస్తా: జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండలో కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాశ్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. గాయత్రినగర్, కొట్నాల్ప వీధిలో తాగునీటి పైపులైన్ కోసం సిమెంట్ రోడ్డు పగలు గొట్టారు. ఆ రోడ్డును అలాగే వదిలేశారు. మురుగు కాల్వలు లేవు. తాగునీటి సరఫరాకు ఎలాంటి ఏర్పాట్లూ లేవు. కాల్వ కట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు, డ్రెయిన్లు, ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరారు. దీనిపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధి శివశక్తి ఫౌండేషన్ కింద రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు. మ్యాచింగ్ గ్రాంటు కింద రూ.95 కోట్లు కోరతానని.. మొత్తం రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గాయత్రీనగర్‌లో సీసీ రోడ్లు.. మురుగు కాలవ, ఎన్ఎస్పీ కాలువపై బ్రిడ్జి.. వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



శ్రీసత్యసాయి జిల్లాలో మాట్లాడుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

'జగనన్న కాలనీ' పరిహారం ఇప్పిస్తా

- బాధితులకు పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి భరోసా

పుట్టపర్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మేజర్ పంచాయతీలోని బీసీ కాలనీలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. 450 మందికిపైగా ప్రజలు హాజరై తమ సమస్యలను ప్రస్తావించారు.

సమస్యలు:

- జగనన్న లేఅవుట్ల కోసం ముగ్గురు రైతుల నుంచి 14 ఎకరాలు తీసుకున్నారని, పరిహారం ఇవ్వకుండానే ప్లాట్లు వేశారని, అదేమంటే పోలీసులతో బెదిరించే వారని రైతు నాగేంద్ర ప్రసాద్ వాపోయారు.
- జగనన్న లే అవుట్ దారి కోసం 1.35 ఎకరాల పట్టా భూమి తీసుకున్నారని, పరిహారం కింద రూ.50 లక్షలు, 2ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి, చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని రైతు నవీన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

పరిష్కారం: ఈఅంశాలపై పూర్తిస్థాయిలో పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దారు బాలాంజనేయులును ఎమ్మెల్యే ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పరిహారం అందిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.



విజయవాడలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్. చిత్రంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, ఆంధ్రజ్యోతి విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ

'జల్‌జీవన్'తో నీటి సమస్యకు శాశ్వతంగా చెక్

విజయవాడ అదనపు కమిషనర్ చంద్రశేఖర్

విజయవాడ: విజయవాడ నగరంలోని 13వ డివిజన్‌లో 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం జరిగింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, సర్కిల్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) సామ్రాజ్యం పాల్గొన్నారు. స్థానికులు పలు సమస్యలు లేవనెత్తారు. పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. పైపులైన్లలోకి కలుషిత నీరు వస్తోంది. శానిటేషన్ సమస్యలు. చెత్త సేకరణ సిబ్బందిని పెంచాలి. గంజాయి బ్యాచ్ బెడద పెరిగిపోయింది.

పరిష్కారం: ముందుగా ఆర్థికేతర సమస్యలను పరిష్కరిస్తామని అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ పథకం, రక్షిత మంచినీటి ప్రాజెక్టుల ద్వారా కృష్ణానది నీటిని అందిస్తామన్నారు.

'బైపాస్ వెంబడే బస్సులు'

కృష్ణాజిల్లా మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, తహసీల్దార్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. మచిలీపట్నం-విజయవాడ మధ్య తిరిగే బస్సులను బైపాస్ రహదారి వెంబడి నడపాలని జనం కోరగా.. ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు అందుకు అంగీకరించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి 10 కోట్లు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్



ఒంగోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వేదికపై మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు

ఒంగోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పార్కు అభివృద్ధి పనుల తోపాటు.. డ్రైనేజీ, ట్రాఫిక్, రోడ్ల ఆక్రమణ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పార్కు అభివృద్ధితోపాటు డ్రైనేజీ సమస్యను పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దామచర్ల హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.10 కోట్లను కేటాయించి దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు.

తక్షణమే చప్టా నిర్మాణం: కందుల

ప్రకాశం జిల్లా మార్కాపురంలోని 7, 8 వార్డుల పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఛైర్మన్ బాలమురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు మంచినీటి పైప్‌లైన్‌లో మురుగు నీరు కలుస్తోందని, కొళాయిల సమస్యను పరిష్కరించాలని, మూడు వార్డుల కూడలిలో చప్టా దెబ్బతిని ట్రాఫిక్ జామ్ అవుతోందని దీన్ని పరిష్కరించాలని కోరారు. తక్షణమే చప్టా నిర్మాణం, రోడ్డు మరమ్మతులు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.



విజయనగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, హాజరైన 43వ డివిజన్ ఉడా కాలనీ ప్రజలు

పార్కు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు

విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు హామీ

ప్రభుత్వాస్పత్రి వ్యర్థాలు, రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదులు

విజయనగరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ పరిధి 43వ డివిజన్ ఉడాకాలనీలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమాన్ని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' మంగళవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, అధికారులు పాల్గొన్నారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను విన్నవించారు.

సమస్యలివీ..: ఉడా కాలనీలోని అక్కడున్న పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. బోరుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రహరీ నిర్మించాలి. ఇళ్ల నుంచి చెత్త తరలింపునకు వీలుగా చెత్త కుండీ ఏర్పాటు చేయాలి. అయ్యన్నపేట రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి. వాటర్ ట్యాంక్ నిర్మించాలి. కాలువలో ప్రభుత్వాస్పత్రి వ్యర్థాలు కాలనీ వైపు రాకుండా చూడాలి.

పరిష్కారం: పార్కు ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు తెలిపారు. రూ.6లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని, పార్కులో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ పి.నల్లనయ్య పేర్కొన్నారు. కాగా, గత ప్రభుత్వంలో డివిజన్‌లో అనేక సమస్యలు పరిష్కారం కాక మిగిలిపోయాయని వైసీపీ కార్పొరేటర్ సత్యవతి వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని ప్రశంసించారు.



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకుంటాం

- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హామీ

ప్రొద్దుటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు 39వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ప్రజల సమస్యలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కమిషనర్ మల్లికార్జున విన్నారు. బొల్లవరం-రామేశ్వరంను అనుసంధానం చేసే హనుమాన్‌నగర్ మెయిన్‌రోడ్డును విస్తరించాలని ప్రజలు కోరగా, ఎమ్మెల్యే అంగీకరించారు.

'రూ.20 లక్షలతో సీసీ రోడ్లు వేస్తాం': కడప మేయర్

కడప నగరం అశోక్‌నగర్‌లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయనీ ప్రజలు తెలిపారు. దీనిపై మేయర్ సురేశ్‌కుమార్ స్పందిస్తూ... రూ.20 లక్షలతో ఐదు చోట్ల సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో మరోచోట రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు.



25 రోజుల్లో టెండర్లు పిలుస్తాం: ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రి 9వ డివిజన్ లో జరిగిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. రోడ్లు, ఇతర సమస్యలపై ప్రజల వినతులు స్వీకరించారు. 25 రోజుల్లో రోడ్ల పనులకు టెండర్లు పిలుస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రాత్రికి రాత్రే పరిష్కారానికి చర్యలు: ఎస్వీఎస్ఎన్ వర్మ

పిఠాపురం 18వ వార్డులో ప్రభుత్వాస్పత్రి, కుంతీమాధవస్వామి ఆలయ సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయగా, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తక్షణం స్పందించారు. అప్పటికప్పుడు ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను పిలిచి మాట్లాడారు.

పది రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తా

- అనంత అర్బన్ ఎమ్మెల్యే వెంకటేశ్వరప్రసాద్ హామీ

అనంతపురం, జనవవరి 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరంలోని 32వ డివిజన్ ఆదర్శ కాలనీలో అంధ్రజ్యోతి-ఏబీఎన్ 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని నిర్వహించింది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. డివిజన్ ప్రజలు 500 మందికిగా తమ సమస్యలను తెలిపారు.

సమస్యలు: సింగిల్ ఫేజ్ కరెంటుతో ఇబ్బంది పడుతున్నామనీ, త్రిఫేజ్ ఏర్పాటు చేయాలని దాసరి శ్రీనివాసులు కోరారు. రైతు బజారు ఏర్పాటు చేయాలని వ్యాపారి నరసింహారెడ్డి విజ్ఞప్తిచేశారు. కార్పొరేషన్ ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటుచేయాలని రాజారెడ్డి కోరారు.

పరిష్కారం : ప్రజలు లేవనెత్తిన సమస్యలను ఎమ్మెల్యే, అధికారులు నోట్ చేసుకున్నారు. అన్ని సమస్యలనూ పది రోజుల్లోపు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రజలకు హామీ ఇచ్చారు.



ప్రతిరోజూ మంచినీరు అందిస్తాం

రూ.500 కోట్లతో ప్రతిపాదనలు: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కల్లూరులో కార్యక్రమం జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్ రవీంద్రబాబు, 350 మందికి పైగా స్థానికులు హాజరయ్యారు. డ్రైనేజీ సమస్య, కుక్కల బెడద, ఆకతాయిలు, దొంగతనాల బెడద, విద్యుత్, తాగునీటి సమస్యలను స్థానికులు ప్రస్తావించారు. కల్లూరులో ప్రతిరోజూ నీరు అందించేందుకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చోరీలు జరిగే ప్రాంతాలపై నిఘా ఉంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ ఆదేశించారు. సవారితోట కాలనీలో గ్రావెల్ రోడ్లు, వీధి లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే, కమిషనర్ కాలనీల్లో పర్యటించి, ప్రజా సమస్యలను విని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



తాడేపల్లిగూడెంలో సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, వేదికపై మునిసిపల్ ఈఈ వెంకట రమణ

సమస్యల పరిష్కారానికి రూ.3 కోట్లు: బొలిశెట్టి

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిట్ రహదారికి ఆనుకుని వెళ్లే ఎస్వీఆర్ సర్కిల్ రహదారిని ఏర్పాటు చేయాలని, చిరంజీవి పార్కును అభివృద్ధి చేయాలని, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఏపీ నిట్ వరకు రహదారి విస్తరణతోపాటు వీధిలైట్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్పందిస్తూ.. గణేష్‌నగర్-నిట్ రహదారి నుంచి వెళ్లే ఎస్వీఆర్ సర్కిల్ రహదారి, డ్రెయిన్ పనులను రూ.2.90 కోట్లతో చేపడతామని ప్రకటించారు. రూ.10 లక్షలు వెచ్చించి పార్క్ సుందరీకరణ, వీధిలైట్‌లు నెలకొల్పుతామని చెప్పారు.

విశాఖలో భూ ఆక్రమణలకు త్వరలో చెక్



విశాఖలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొండా జగన్. చిత్రంలో అధికారులు కిరణ్‌కుమార్, నారాయణ, శ్రీనివాసరావు, కేదారినాథ్, కృపాకరరావు, వీర్రాజు, 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు

విశాఖపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలోని తిరుమలనగర్‌లో కార్యక్రమం జరిగింది. అనధికార డంపింగ్ యార్డును తరలిస్తామని, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ ఏఎంహెచ్‌వో చెప్పారు. గాంధీబొమ్మ జంక్షన్‌కు బస్సు పునరుద్ధరిస్తామని డిపో ట్రాఫిక్ మేనేజర్ హామీ ఇచ్చారు. వడ్లపూడిలో డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరుకు చేస్తానని కార్పొరేటర్ బొండా జగన్ హామీ ఇచ్చారు.

అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో కోట్నీవీధిలో మురుగు కాలువల్లోని నీరు రోడ్లపైకి వస్తోందని, లక్ష్మీనారాయణనగర్‌లో పార్కు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని, ఆకతాయిలు గంజాయి సేవిస్తూ ఇబ్బంది పెడుతున్నారని స్థానికులు చెప్పారు. మురుగు సమస్యకు పరిష్కారం చూపుతామని, పార్కులో సిమెంట్ బల్లలు బాగు చేయిస్తామని కార్పొరేటర్ చినతల్లి, పార్కులో గస్తీ ఏర్పాటు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు.



పది రోజుల్లో పనులకు శంకుస్థాపన చేస్తాం

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హామీ

నెల్లూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గం సౌత్‌మోపూరులో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొని సమస్యలను విన్నవించారు. సౌత్ మోపూరులో మౌలిక వసతులకు రూ.కోటి కేటాయిస్తున్నామని, పది రోజుల్లోపే పనులకు శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మంత్రి సవిత, తదితరులు

హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి

▸ టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, చెరువులో చేపలు దొంగిలించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు టీడీపీ నేతలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి సవిత, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే సౌమ్య బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కాకినాడ జిల్లా వేట్లపాలెంలో అకారణంగా తమపైకి మారణాయుధాలతో దాడి చేసి ముగ్గుర్ని హతమార్చి, మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు కార్ధాల లక్ష్మి విజ్ఞప్తి చేశారు. పెద్దదిక్కు కోల్పోయిన తమకు ప్రాణహాని ఉందని ఆమె మొరపెట్టుకున్నారు. తమ పొలానికి దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, దౌర్జన్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా చింతలపూడికి చెందిన సూర్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

కస్టమర్లకు పలు అవకాశాలు ఇస్తున్నాం: అమెజాన్

అమరావతి, జనవరి 28: గడువు తీరిన గిఫ్ట్ కార్డుల్లో డబ్బు అదృశ్యం అవుతోందంటూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో అమెజాన్ స్పందించింది. వినియోగించని కార్డుల్లోని డబ్బును వెనక్కి తీసుకోవడానికి తమ కస్టమర్లకు పలు అవకాశాలు ఇస్తున్నామంటూ వివరణ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్డుల విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటిస్తున్నామని తెలిపింది. గిఫ్ట్ కార్డు కొన్న వారికి గడువు తీరేలోగా రెండు సార్లు రిమైండర్లు పంపుతామని వెల్లడించింది. కాగా, గిఫ్ట్ కార్డుల్లో డబ్బు మాయంపై పవన్ కల్యాణ్ ఇటీవల ఎక్స్ వేదికగా స్పందించారు. కస్టమర్లు కష్టపడి సంపాదించిన డబ్బు అదృశ్యం కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

'టీచర్ల' జీతాల సమస్య పరిష్కరిస్తాం: ఫరూక్

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మదర్సాల్లో సర్వశిక్ష అభియాన్‌కు అనుబంధంగా విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాల చెల్లింపు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మదర్సాల్లో సామాన్య, సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా తమకు జీతాలు ఇవ్వలేదని, ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

సంక్షేమంపై సమష్టిగా ముందుకు: మంత్రులు

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, వాటిపై ప్రజల అభిప్రాయాలు, సంతృప్తి తదితరాల గురించి మైనార్టీ, బీసీ, సాంఘిక సంక్షేమశాఖల మంత్రులు చర్చించారు. మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారమిక్కడ సమావేశమయ్యారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ప్రజల చెంతకు చేరే విధంగా సమష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు.

ట్రంప్ తీరుపై సీఎంలు స్పందించాలి: కేఏ పాల్

న్యూఢిల్లీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వలసదారుల పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార శైలితో తెలుగు ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. సీఎంలిరువురూ తెలుగు ప్రజలకు రక్షణ కోసం ట్రంప్‌కు లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. భారత్ నుంచి అమెరికా వెళ్లిన 8 వేల మంది వలసదారులను అక్కడే ఉండనివ్వాలని డిమాండ్ చేశారు. భారత్‌కు అమెరికా అవసరమెంతో, అమెరికాకు కూడా భారత్ అంతే అవసరమని అన్నారు.

డీఈఈల పదోన్నతులకు లైన్ క్లియర్!

▸ మంత్రి నిమ్మల చొరవతో 2018 తర్వాత మళ్లీ ఇప్పుడే!

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో ఇంజనీరింగ్ అధికారుల పదోన్నతులకు సంబంధించి అడ్డంకులన్నీ తొలగిపోయాయి. సీనియారిటీ విషయంలో ఇంజనీరింగ్ అధికారుల మధ్య వివాదాలు తలెత్తి న్యాయపోరాటాలు చేస్తున్న తరుణంలో, వారి మధ్య సఖ్యతను పెంచేలా మంత్రి నిమ్మల రామానాయుడు చొరవ చూపడంతో సమస్యకు పరిష్కారం లభించింది. తాజాగా మరోసారి మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించారు. ఇప్పటి వరకూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, సూపరింటెండింగ్ ఇంజనీరు, చీఫ్ ఇంజనీరు హోదా ఇంజనీరింగ్ అధికారులకు పదోన్నతులు కల్పించినా, డీఈఈల పదోన్నతుల విషయంలో సంక్లిష్టతను ఎదుర్కొనాల్సి వచ్చింది.

మంత్రి లోకేశ్ చొరవ.. జేఈఈ పరీక్షకు విద్యార్థి

తిరుపతి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మంగళవారమే ఆ విద్యార్థికి జేఈఈ మెయిన్స్ పరీక్ష. అడ్మిట్ కార్డులో పేరు తప్పుగా పడింది. దీనిపై ఆ విద్యార్థి ఆకుల వైష్ణవరెడ్డి పరీక్ష నిర్వాహకులైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)ని సంప్రదించగా.. సరి చేస్తామన్నారు. కానీ చేయలేదు. 22వ తేదీ మంగళవారమే పరీక్ష. పేరు తప్పుగా ఉన్నందున పరీక్షకు అనుమతించలేమని నిర్వాహకులు చెప్పేశారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్.. ఫోన్‌లో ఎన్టీఏ అధికారులతో మాట్లాడారు. ఓ అధికారిని పరీక్ష కేంద్రం వద్దకు పంపి.. వైష్ణవరెడ్డిని పరీక్షకు అనుమతించేలా చేశారు.

రాంగోపాల్‌వర్మకు మళ్లీ పోలీసుల నోటీసులు

ఒంగోలుక్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకి ఒంగోలు రూరల్ పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 4న విచారణకు హాజరుకావాలని కోరారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసినందుకు మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన్ను అరెస్టు చేయవద్దంటూనే పోలీసుల విచారణకు హాజరుకావాలని వర్మను ఆదేశించింది. దీంతో వచ్చే నెల 4న ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని పోలీసులు వాట్సాప్ ద్వారా సమాచారం పంపారు. ఆ రోజున కాకుండా.. వచ్చే నెల 7లోపు ఎప్పుడైనా హాజరవుతానని ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో 7న హాజరు కావాలని పోలీసులు కోరే అవకాశం ఉంది.

'బనకచర్ల' సాధనే లక్ష్యం!


▸ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం దక్కేలా చూడండి

▸ టీడీపీ ఎంపీలకు చంద్రబాబు సూచన

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర సాయం సాధించడం టీడీపీ ఎంపీల లక్ష్యంగా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాబోయే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం దక్కేలా చూడాలని వారికి సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఇక్కడ తన నివాసంలో పార్టీ ఎంపీలతో సుమారు మూడు గంటలపాటు సమావేశమై పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు. పోర్టులు, కొత్త జాతీయ రహదారులు, విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులు సాధించడానికి గట్టి ప్రయత్నం చేయాలని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రం దశ, దిశ వేగంగా మారిపోతాయి. సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడానికి మనం దీనిని చేపడుతున్నాం. దీనిని సాధించడం మన లక్ష్యంగా ఉండాలి. నడికుడి-శ్రీకాళహస్తి, రేణిగుంట-గూడూరు, కోటిపల్లి-నరసాపురం, కడప-బెంగళూరు రైల్వే లైన్లు త్వరగా పూర్తయ్యేలా రైల్వే శాఖ నుంచి నిధులు సాధించాలి' అని తెలిపారు.

చాలా ప్రాజెక్టులకు కేంద్ర సాయం..

బడ్జెట్‌కు ముందే కేంద్రం చాలా ప్రాజెక్టులకు రాష్ట్రానికి సాయం చేసిందని చంద్రబాబు ప్రశంసించారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రూ.11,500 కోట్లతో ప్యాకేజీ, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కోసం రూ.14 వేల కోట్లు, రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం మొదటి దశ నిర్మాణానికి రూ.12 వేల కోట్లు, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్లకు రూ.5 వేల కోట్లు కేటాయించడానికి ముందుకొచ్చింది' అని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా దెబ్బతిందని.. ఈ సమయంలో రాష్ట్రం నిలదొక్కుకోవడానికి కేంద్రం సహాయం అవసరమని ప్రతి సందర్భంలో గుర్తు చేయాలని కోరారు. విభజన చట్టంలో అంశాలు ఇంకా కొన్నిటిని కేంద్రం పరిష్కరించాల్సి ఉందన్నారు. రాష్ట్రం రూపొందించిన పాలసీలను ఎంపీలు బాగా అధ్యయనం చేయాలని సూచించారు. విదేశాల్లో ఉన్న పాలసీలు, ప్రాజెక్టులపైనా అవగాహన పెంచుకుని రాష్ట్రానికి సమాచారమివ్వాలన్నారు. కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను ఖర్చు చేసే సమయంలో వాటిపై జీఎస్టీ పడకుండా చూడాలని పెమ్మసాని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు.



వక్ఫ్ బిల్లుపై చర్చ

కేంద్రం ప్రవేశపెట్టబోతున్న వక్ఫ్ బిల్లుపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. టీడీపీ కోరడం వల్లే దీనిని సెలెక్ట్ కమిటీకి పంపారని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో విస్తృత చర్చకు అవకాశం కలిగిందని కృష్ణదేవరాయలు చెప్పారు. ఈ బిల్లుకు 14 సవరణలు ఆమోదించగా అందులో 4 టీడీపీ పెట్టినవేనని తెలిపారు. ఇందులో ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని ఒకరిద్దరు ఎంపీలు చెప్పగా.. బిల్లు చర్చకు వచ్చే సమయంలో వాటిపై ఏం చేయాలో ఆలోచిద్దామని బాబు బదులిచ్చారు. ఒకే దేశం- ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లు ఈసారి సమావేశాల్లో రాకపోవచ్చని ఎంపీలు అభిప్రాయపడ్డారు. దీని విధి విధానాలేంటో లోతుగా అధ్యయనం చేయాలని, భవిష్యత్‌లో రాబోయే సమస్యలను ఇప్పుడే అంచనా వేయకపోతే తర్వాత చాలా తలనొప్పులు వస్తాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యేలపై వదిలేయొద్దు..

ఎంపీలు తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని, ఎమ్మెల్యేలపై వదిలేసి ఊరుకోవద్దని సీఎం సూచించారు. 'కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు మీరు రావడానికి అభ్యంతరపెడతారు. అయినా ఎంపీలుగా మీ విధి నిర్వర్తించాల్సిందే. ఎమ్మెల్యేలతో సమన్వయం పెంచుకోండి. ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదనలు తయారు చేసే సమయంలో వారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోండి' అని చెప్పారు. పార్లమెంటులో టీడీపీ ఎంపీల పనితీరును ఆయన ప్రశంసించారు. మన ఎంపీల హాజరు జాతీయ సగటు కంటే అధికంగా ఉందన్నారు. ప్రశ్నలు అడగడంలో జాతీయ సగటు 9% ఉంటే టీడీపీ ఎంపీలు 23 శాతంలో ఉన్నారని తెలిపారు. ఇదే పనితీరు ఇక ముందు కూడా చూపించాలని, కింది స్థాయి సమస్యలను పార్లమెంటులో సమర్థంగా లేవనెత్తాలని సూచించారు. సమావేశంలో మంత్రి లోకేశ్ కూడా పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మెరుగైన కేటాయింపులు: కేశినేని చిన్ని

డబుల్ ఇంజన్ సర్కార్ తోడ్పాటుతో ఈసారి బడ్జెట్‌లో ఏపీకి మెరుగైన కేటాయింపులు ఖాయంగా ఉంటాయని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీపీ సమావేశానికి హాజరయ్యే ముందు పలువురు ఎంపీలు విలేకరులతో మాట్లాడారు. చిన్ని మాట్లాడుతూ.. ఇప్పటికే సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేశారని తెలిపారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఏడు వెనుకబడిన జిల్లాలకు సాయం, స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ, అమరావతి, పోలవరానికి నిధులు ఈ ఏడు నెలల్లో తెచ్చామన్నారు. కళ్లుండీ చూడలేని వైసీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

▸ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు: సీఎం

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో పేర్కొన్న పథకాలన్నీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విషయంలో వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, కింది స్థాయి పార్టీ నేతలతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'పథకాలన్నీ ఇస్తాం. వైసీపీ తప్పుడు ప్రచారాలను చూస్తూ ఊరుకోవద్దు. గట్టిగా తిప్పికొట్టండి. ఇప్పటికే వ్యవస్థలను గాడిలో పెట్టాం' అని న్నారు. కాగా, పార్టీ అంతర్గత నిర్మాణానికి సంబంధించిన క్లస్టర్ కమిటీల్లో ఉండి పనిచేసిన వారికే నామినేటెడ్ పదవులు దక్కుతాయని చంద్రబాబు తేల్చిచెప్పారు. 'అసెంబ్లీ ఎన్నికల ముందు మనం పార్టీ పని కోసం అంతర్గతంగా వివిధ స్థాయిల్లో క్లస్టర్ కమిటీలు పెట్టాం. క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ కమిటీలను కలిపి క్యూబ్స్ అని పిలుస్తున్నాం. ఈ కమిటీల్లో ఉండి పనిచేసిన వారికే నామినేటెడ్ పదవులు ఇస్తాం. పదవులు పొందే నేతలు వీటిలో ఉండి తీరాలి. వారినే పదవుల కోసం నాయకులు సిఫారసు చేయాలి' అని స్పష్టం చేశారు. సహకార సంస్థలు, 214 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 1100 ఆలయ ట్రస్ట్ బోర్డులు భర్తీ చేయాల్సి ఉందని, వీటి భర్తీకి సరైన ప్రతిపాదనలు పంపాలని ఆయన ఎమ్మెల్యేలకు సూచించారు. పార్టీలో ఎప్పటి నుంచో ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడగా.. చంద్రబాబు సమ్మతించారు. 'బాగా పనిచేసిన వారి పేర్లనే నామినేటెడ్ పదవులకు సిఫారసు చేయండి. ఎమ్మెల్యేలం... ఎంపీలం అయిపోయాం కాబట్టి ఇక కార్యకర్తలతో పనిలేదని అనుకోవద్దు. వారిని దగ్గరకు తీయండి. ఆప్యాయంగా పలకరించండి. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం జరిగేలా మీరూ మేమూ కలిసి నామినేటెడ్ పదవులు భర్తీ చేద్దాం. జూన్‌లోపు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు అన్నీ భర్తీ చేస్తాం.సభ్యత్వం బాగా చేసిన వారికి కూడా పదవుల్లో ప్రోత్సాహం ఇస్తాం' అని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లో నిరంతరం పని చేయాలని పార్టీ నేతలను కోరారు.

ఏపీ 'పవర్'

(మొదటి పేజీ తరువాయి)

పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఎప్పుడూ లేనంత భారీగా ఏపీకి పెట్టుబడులు తరలివస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ భారీ పెట్టుబడులకు ఆమోద ముద్ర వేసింది. సౌర, జల, పవన విద్యుత్తు ఉత్పత్తి రంగాల్లో ఏకంగా రూ.4,83,753 కోట్ల పెట్టుబడులతో 5,91,290 మంది యువతకు ఉద్యోగాలు కల్పించేలా పలు సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. ఆయా సంస్థలు ప్లాంట్లను స్థాపించేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇవికాక మరిన్ని సంస్థలు ప్రతిపాదనలతో ముందుకువస్తున్నాయి. సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

ఒప్పందాలు జరిగిన సంస్థలు.. ప్లాంట్లు

- కర్నూలు జిల్లా అస్పిరి వద్ద ఎకోరాన్ ఎనర్జీ ఇండియా సంస్థ 498.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును రూ.4,435.63 కోట్ల పెట్టుబడితో స్థాపించేందుకు ముందుకు వచ్చింది. ఈ ప్లాంటులో 530 మందికి ఉద్యోగాలు వస్తాయి.
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎకోరాన్ ఎనర్జీ ఇండియా ప్రై. లిమిటెడ్ రూ.3,142 కోట్లతో 349.40 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తి సంస్థను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందులో 1,200 మందికి ఉద్యోగాలొస్తాయి.
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని నూతిమడుగు, మద్దెలచెరువులో ఎకోరాన్ ఇండియా సంస్థ 50 మెగావాట్ల పవన, సౌర హైబ్రీడ్ ప్లాంటును రూ. 567.73 కోట్లతో ఏర్పాటు చేస్తుంది. ఇందులో 170 మందికి ఉద్యోగాలు వస్తాయి.
- అన్నమయ్య, కడప జిల్లాల్లో ఆస్ట్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా రూ.8,240 కోట్లతో 1,800 ఎంవీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తుంది. దీని లో 4,000 మందికి ఉద్యోగాలు వస్తాయి.
- గ్రీన్‌కో ప్రై.లిమిటెడ్ నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రాన్ని రూ.2,500 కోట్లతో చేపట్టనుంది. దీంట్లో 1,725మందికి ఉపాధి లభిస్తుంది.
- అనంతపురం జిల్లాలోని రాళ్ల అనంతపురం, కురుబరహళ్లి, కడప జిల్లాలోని గంగాదేవి పల్లిలో ఎకోరాన్ ఎనర్జీ ఇండియా ప్రై.లిమిటెడ్ 227 మెగావాట్ల పవన విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో 340 మందికి ఉద్యోగాలొస్తాయి.
- కాకినాడలో గ్రీన్‌హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా ఉత్పత్తి కేంద్రాన్ని ఏఎం గ్రీన్ అమోనియా ఇండియా ప్రై.లిమిటెడ్ ఏటా ఒక మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ. 12,000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను స్థాపించనున్నది. ఇందులో 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి.
- కాకినాడలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీలో జాన్ కోకరిల్ గ్రీన్కో హైడ్రోజన్ సొల్యూషన్స్ ప్రై.లిమిటెడ్ రెండు గిగావాట్ ఎలక్ట్రోలైజర్ ప్లాంటును రూ. 2,000 కోట్ల పెట్టుబడితో స్థాపిస్తుంది. ఇందులో 500 మందికి ఉద్యోగాలొస్తాయి.
- నంద్యాల, కడప జిల్లాల్లోని రౌలిమిగుండ్ల, మైలవరం, కొండాపురంలలో క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ ప్రై.లిమిటెడ్ రూ. 2,000 కోట్లతో 119 మెగావాట్ విండ్, 130 మెగావాట్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తుంది. ఇందులో 650 మందికి ఉద్యోగాలొస్తాయి.
- కర్నూలు జిల్లా హోసూరు, పెద్దహాలిటిలో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ 400 మెగావాట్ల సోలార్ ప్లాంటును రూ. 2,000 కోట్ల పెట్టుబడితో స్థాపిస్తుంది. ఇందులో 1,380 మందికి ఉద్యోగాలొస్తాయి.
- రాష్ట్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 65,000 కోట్లతో రోజుకు సీబీజీ-11,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేస్తుంది. ఇందులో ఏకంగా 2,50,000 మందికి ఉద్యోగాలొస్తాయి.
- విశాఖజిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను, రెన్యువబుల్ ఎనర్జీ జోన్లను ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, ఏపీఎన్ఆర్ఈడీసీ సంయుక్తంగా సంవత్సరానికి 0.50 మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్, 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ, 10 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలను రూ. 1,00,000 కోట్ల పెట్టుబడితో స్థాపించనున్నాయి. ఇందులో 64,000 మందికి ఉద్యోగాలొస్తాయి.

ప్రభుత్వం ముందుకు మరిన్ని ప్రతిపాదనలు

ఒప్పందాలు పూర్తి చేసుకుని ప్లాంట్లు స్థాపించబోతున్న సంస్థలుగాక మరికొన్ని కూడా ప్రభుత్వం ముందు తమ ప్రతిపాదనలు ఉంచాయి. ఎకోరాన్ ఎనర్జీ అస్పిరి వద్ద 498.30 ఎంవీ విండ్ ప్లాంటును రూ.4,435.64 కోట్ల పెట్టుబడితో మరో ప్లాంటు స్థాపించడానికి ముందుకొచ్చింది. దీనిలో 630 మందికి ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చింది. కర్నూలు, నంద్యాలలో రూ. 3,142 కోట్లతో 349.50 ఎంవీ విండ్ ఎనర్జీ ప్లాంట్‌ను స్థాపిస్తామని ఎకోరాన్ ప్రతిపాదించింది. ఈ ప్లాంటులో 1,200 మందికి ఉద్యోగాలొస్తాయని పేర్కొంది.

ఇది పనికిమాలిన వ్యాజ్యం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సీఐడీ కేసులను సీబీఐకి అప్పగించాలని కోరడమేంటి.. ఒక పక్క విచారణ జరుగుతోంది కదా అని పిటిషనర్‌ను నిలదీసింది. ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్ అంటూ మండిపడింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్‌సింగ్ వాదనలు వినిపించడానికి సిద్ధమవడంతో జస్టిస్ బేలా త్రివేది స్పందిస్తూ.. మీలాంటి సీనియర్ న్యాయవాదులు ఇలాంటి పిటిషన్లను కూడా చేపడతారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అలా కాదు మేడమ్ అంటూ.. మణీందర్‌సింగ్ ఏదో చెబుతుండగా.. మీరు ఇంకొక్క మాట మాట్లాడినా జరిమానా విధించాల్సి ఉంటుందంటూ కటువుగా వ్యాఖ్యానించారు. ఇలాంటి పిటిషన్లను మీరు కూడా వాదిస్తారా అంటూ ధర్మాసనం ఆయనపై మరోసారి అసహనం వ్యక్తం చేసింది. ఇది విశ్వసనీయత, చట్టపరంగా అర్హత లేని పిటిషన్‌గా పేర్కొంటూ డిస్మిస్ చేసింది.

డబ్బంటే చేదా?

(మొదటి పేజీ తరువాయి)

ఆర్జించేందుకు వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) స్కీమ్‌ను అమలు చేశాయి. ఉత్తరాది రాష్ట్రాలు ముందుగా ఓటీఎస్‌ను అమలు చేసి ఆదాయాన్ని రాబట్టుకోగా, ఆలస్యంగా కళ్లు తెరిచిన మన దక్షిణాది రాష్ట్రాలు గడిచిన రెండేళ్లలో ఓటీఎస్‌ను అమలు చేసి బకాయిల భారాన్ని తగ్గించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ మాత్రం ఆ దిశగానే ఆలోచనే చేయడం లేదు. దేశవ్యాప్తంగా వ్యాపారవర్గాలపై పరోక్ష పన్నుల భారం తగ్గించేందుకు, వస్తువులు, సేవలు... రెండింటిపైనా ఏకీకృత పన్ను విధించేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తీసుకొచ్చింది. 2017 జూలైలో జీఎస్టీ అమల్లోకి వచ్చింది. అప్పటి వరకు అమల్లో ఉన్న వ్యాట్, సీఎస్టీ తదితర పన్నుల స్థానంలో జీఎస్టీని ప్రవేశపెట్టారు. నిర్ణీత సమయాన్ని ఇచ్చి వ్యాపారులందరూ పాత పన్నుల బకాయిలు కట్టేసి, జీఎస్టీకి మారాలని కోరారు. కానీ చాలా మంది వ్యాపారులు వ్యాట్ తదితర పన్నుల బకాయిలను కట్టలేదు. దీంతో అసలుపై పెనాల్టీలు, వడ్డీలు కలిపి ప్రస్తుతం రూ.7,733 కోట్ల బకాయిలు ఉండిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఈ బకాయిల కొండను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కరిగించలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 వాణిజ్యపన్నుల డివిజన్లు ఉండగా, విశాఖపట్నంలోని రెండు డివిజన్లలో అత్యధికంగా రూ.2,073 కోట్ల బకాయిలు ఉన్నాయి.

దేశమంతా ఓటీఎస్ బాట..

వ్యాట్ బకాయిలను వసూలు చేసేందుకు దేశంలోని దాదాపుగా అన్ని రాష్ట్రాలు వన్‌టైం సెటిల్‌మెంట్‌ను అమలు చేశాయి. బకాయిలను వీలైనంత వరకు వదిలించుకున్నాయి. అంతెందుకు.. పొరుగునే ఉన్న తెలంగాణ ప్రభుత్వం 2022లో వన్‌టైం సెటిల్‌మెంట్ అమలు చేస్తూ జీవో ఇచ్చింది. చాలా రాష్ట్రాలు కనిష్ఠంగా 15 శాతం నుంచి 20 శాతం వరకు ఓటీఎస్‌ను అనుమతించాయి. మహారాష్ట్ర మాత్రం 30 శాతం, తెలంగాణ 40 శాతం అమలు చేశాయి.

మీనమేషాలు ఎందుకో...!

ఏపీలో ప్రస్తుతం వ్యాట్ తదితర పన్ను బకాయిల్లో నాన్‌కలెక్టబుల్ బకాయి (కోర్టుల్లో కేసులు ఉన్నవి) మొత్తం రూ.5262 కోట్లు కాగా, కలెక్టబుల్ బకాయి (ఎలాంటి వివాదం లేకుండా వసూలు చేయదగ్గవి) రూ.2471 కోట్లు ఉన్నాయి. ఈ పరిస్థితికి వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారులే కారణమని చెబుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగులను వేధించేందుకు ఈ బకాయిలను సాకుగా చూపుతున్నారు. ఓటీఎస్ విషయమై చాలాసార్లు ప్రతిపాదనలు తయారైనా ఉన్నతాధికారులే వాటిని కార్యరూపం దాల్చకుండా చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. 2024 జనవరిలో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు జిల్లాలవారీగా సమావేశాలు నిర్వహించారు. ఓటీఎస్ అమలు సాధ్యాసాధ్యాలను వ్యాపారులతో చర్చించారు. అందరి అంగీకారం తీసుకుని చివరి నిమిషంలో ఎందుకనో ఈ విధానాన్ని అమలు చేయకుండా చేతులెత్తేశారు. ఓటీఎస్‌ను 20శాతంగా ఖరారుచేసి వసూలు చేసినా సుమారు రూ.1,546కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అవి చేతిలో ఉంటే రాష్ట్ర సంక్షేమానికీ, అభివృద్ధి పనులకూ ఎంతోకొంత ఆసరాగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

కదిలిన కారుణ్య నియామకాల ఫైల్

▸ పీఆర్‌లో ఖాళీల భర్తీకి ఉపముఖ్యమంత్రి పవన్ చొరవ

▸ 1488 పోస్టుల భర్తీకి ఆదేశాలు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కరోనాతో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వంలో ఊరట లభించనుంది. మూడేళ్లుగా నియామకాలు చేపట్టకపోవడంతో తమ పరిస్థితి అధ్వానంగా మారిందని ఆయా కుటుంబాలు ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మొరపెట్టుకోవడంతో ఆయన అధికారులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. వెంటనే నియామకాలకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో కారుణ్య నియామకాల ఫైల్‌ను పంచాయతీరాజ్ అధికారులు బూజు దులిపి ఆర్థిక శాఖకు పంపారు. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఈ ఫైల్ సీఎం వద్దకు చేరింది. ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇస్తే కరోనాలో మరణించిన 1,488 మంది పంచాయతీరాజ్ ఉద్యోగుల కుటుంబాలకు ఊరట కలగనుంది. మొదటి, రెండో వేవ్ కరోనా కారణంగా రాష్ట్రంలో 2917 మంది ఉద్యోగులు మరణించారు. వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు 1944 మంది, కలెక్టరేట్ల పరిధిలో 330మంది, యూనివర్సిటీల్లో 83మంది, కార్పొరేషన్లు, సొసైటీలకు సంబంధించి 560 మంది మరణించారు. కారుణ్య నియామకాల కోసం 2744 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1,488 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అప్పట్లో నిర్ణయించారు. కానీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 1,149 మంది దరఖాస్తులు ఇంకా పెండింగ్ దశలోనే ఉన్నాయి. 107 మంది దరఖాస్తులు చేసుకోలేదు. నియామకాలకు సీఎం చంద్రబాబు ఆమోదం లభిస్తే ఆయా కుటుంబాలకు ఊరట దక్కనుంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.